

# ఆంధ్రప్రదేశ్

ంపుటి 1 నవంబరు - డిసెంబరు 1956 సంచిక 1




సమాచార పౌరసంబంధముల శాఖ, ఆంధ్రప్రదేశ్



శ్రీ సంజీవరెడ్డిగారి కుమారునితో మురిపెమాడుతున్న ప్రధానమంత్రి.

# ఆంధ్రప్రదేశ్

సంపుటి 1 నవంబరు - డిసెంబరు 1956 సంచిక 1

## విషయసూచిక


| | | |
|---|---|---|
| నవరాష్ట్ర అవతరణ | .... | 1 |
| అల్పసంఖ్యాక వర్గములకు ముఖ్యమంత్రి అభయం | .... | 16 |
| ప్రకృతి సౌందర్యానికి ఆలవాలమైన భూమి ఆంధ్రప్రదేశ్ | .... | 18 |
| గర్వకారణమైన చరిత్ర, ఉజ్జ్వలమైన భవిష్యత్తు గల రాష్ట్రం | .... | 24 |
| ఆంధ్రప్రదేశ్ జనాభా | .... | 27 |
| సర్వమతస్థుల సామరస్య పూర్వక సహజీవనం | .... | 31 |
| రాజధాని | .... | 35 |
| నీటి పారుదల - విద్యుచ్ఛక్తి | .... | 47 |
| భూ సంస్కరణలు | .... | 55 |
| భూదానము : ప్రేమ మార్గం ద్వారా సమస్యా పరిష్కారం | .... | 57 |
| స్త్రీజనోద్యమము | .... | 59 |
| జిల్లాల వివరాలు | .... | 62 |
| శాసన సభ్యులు | .... | 66 |
| భారతదేశ నూతన వ్యవస్థ | .... | 75 |
| కేంద్ర పాలిత ప్రాంతాలు | .... | 76 |
| ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం | .... | 77 |
| ఆంధ్రప్రదేశ్ పటము | .... | 85 |


— చందా —

సాలుసరి రు. 2—0—0 విడిప్రతి 0—2—0

ఆంధ్రప్రదేశ్ సమాచార పౌరసంబంధములశాఖచే ప్రచురింపబడి అజంతా ప్రింటర్సులో ముద్రింపబడినది.

# ★ నవరాష్ట్ర అవతరణ ★

ఆంధ్రావని ఈ సంవత్సరం దీపావళి పండుగను అపూర్వ సంభ్రమోత్సాహాలతో జరుపుకున్నది. ఈయేడు వచ్చిన దీపావళికి ఒక విశిష్టతవున్నది. తెలుగువారు చిరకాలంనుంచీ కంటూవచ్చిన కలలు ఈ పండుగరోజున నిజమైనవి. ఆంధ్ర తెలంగాణాలు ఏకమై నూతనంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించింది. ఈ లక్ష్యసాధనకోసం యావదాంధ్రులు ఎంతో కాలంనుంచీ కృషిచేస్తూ వచ్చారు. లక్ష్యం సిద్ధించడంతో ఆ శుభముహూర్తాన్ని ప్రజలు కడు వేడుకతో, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

ఆనాడు రాష్ట్ర రాజధానీ నగరం హైద్రాబాదు నవవధువువలె శోభాయమానంగా అలంకృతమైంది. ఎక్కడచూచినా అరటి స్తంభాలు, మామిడి తోరణాలు, పతాకాలు; ఆ నవోదయానికి సుస్వాగత మిస్తున్నట్లుగా ఇళ్లూ, అంగళ్లూ, పురవీథులు కనుల పండువుగా అలంకరింపబడ్డాయి. రాష్ట్రావతరణోత్సవాలలో పాల్గొనడానికై ఆంధ్ర జిల్లాల నుండి వేలాది ప్రజలు నగరానికి వచ్చారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన సభలు కాక అనేక అనధికార సంస్థలు ఈ ఉత్సవాలు జరుపుకోవడానికి సాంస్కృతిక, వైజ్ఞానిక సభలు ఏర్పాటుచేశాయి. ఆంధ్రదేశ ప్రముఖ కళాకారులు, నృత్య సంగీత నాటక ప్రదర్శనలతో అసంఖ్యాక ప్రజలను రంజింపజేశారు. నిజంగా అది ఒక చరిత్రాత్మకమైన రోజు. ఆంధ్రప్రజల స్మృతిపథంలో చిరకాలం నిలిచిపోగల సుదినం.


రాష్ట్రావతరణ సందర్భంలోనే పశ్చిమాసియాలో పరిస్థితి హఠాత్తుగా విషమించింది. అసలే తీరుబడిలేకుండా ఎప్పుడూ రాజకీయ, పరిపాలనా వ్యవహారాలలో నిమగ్నుడయ్యే ప్రధానమంత్రి నెహ్రూకు ఆ పరిస్థితి బొత్తుగా విరామం లేకుండా చేసింది. అయినా ఆయన నవంబరు 1 వ తేదీన కొత్తరాష్ట్రానికి ప్రారంభోత్సవం చేయడానికి ప్రత్యేక విమానంలో విచ్చేశారు. వేలాది పౌరులు విమానాశ్రయం వద్ద ప్రధాన మంత్రికి అఖండమైన స్వాగతమిచ్చారు.

ప్రధానమంత్రి రాకకు కొంచెం ముందుగా రాజ్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ప్రముఖుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసింది. పన్నెండుమంది మంత్రులచేత రాష్ట్ర గవర్నరు ప్రమాణ స్వీకారము చేయించారు. అరగంటలో ఈ లాంఛనం ముగిసింది. ఆ తరువాత ప్రధానమంత్రికి స్వాగతమివ్వడానికై అంతా బయలుదేరి, విమానాశ్రయానికి వెళ్లారు.

ప్రధానమంత్రి నగరానికి విచ్చేసిన కొద్దిసేపటికే గాంధీ భవన్ హాలులో కాంగ్రెసు శాసన సభ్యుల, కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తూ, ఆ ఉదయంనుంచీ భారతదేశ పటంలో వచ్చిన మార్పులను ప్రస్తావించి ఒకవిధంగా చాలా గొప్పమార్పు ఆంధ్ర హైద్రాబాదులలో వచ్చిందని అన్నారు. హైద్రాబాదులో వచ్చినమార్పు కేవలం రాజకీయమైనదే కాదు. అది మానసికమైన మార్పు కూడా. ఎందుచేతనంటే భారతదేశ పటంనుంచి ఒక సంస్థానం అదృశ్యమైపోయింది. హైద్రాబాదు రాష్ట్రం మూడు ప్రాంతాలుగా విభజితమై, వాటిలోనుంచి ఒక ప్రాంతం ఆంధ్ర రాష్ట్రంలో లీనమైపోయింది. దేశంలో వస్తున్న గొప్ప మార్పులకు ఇది ఒక తార్కాణం.

గతంలో సంస్థానాధీశులు తమ విధులను వారు నిర్వర్తించి ఉండవచ్చు. అయినా ప్రజలు ఇప్పటికీ వారిని వ్యక్తులుగా గౌరవిస్తున్నారు. కాని ఒక వర్గంగా ఆ సంస్థానాధీశులకు నవభారతంలో స్థానంలేదు. ఒక పదవికి ఇప్పుడు ఒక సంస్థానాధీశుని ఎన్నికచేయడం జరిగిందంటే ఆయన సంస్థానాధీశుడని కాదు. ఆ పదవి విధి బాధ్యతలను నిర్వహించడానికి ఆయన తగినవాడని మాత్రమే అలా జరుగుతుంది అని ప్రధానమంత్రి అన్నారు.

మనదేశం సామ్యవాదపద్ధతి సమాజాన్ని తనలక్ష్యంగా నిర్ణయించుకున్నది. సామ్యవాదమంటే అందరికీ సమా



*బేగంపేట విమానాశ్రయంలో ప్రధాన మంత్రితో ఆంధ్రప్రదేశ్ గవర్నర్, ముఖ్యమంత్రి.*

సావకాశాలు, ఉన్నతమైన జీవిత ప్రమాణాలు. ఈ సామ్యవాద విధానాన్ని యూరపులోవలె దౌర్జన్యకర పద్ధతులతోగాని లేదా శాంతియుత మార్గాలతోగాని సాధించవచ్చు. భారతదేశం తీవ్రగతిని అభ్యుదయం పొందాలని వాంఛిస్తూన్నది. అయితే అది శాంతియుత మార్గాల ద్వారానే జరుగవలెనని అభిలషిస్తున్నది.

భారతదేశ చరిత్రలో సమస్యలను శాంతియుతంగా పరిష్కరించడానికి ప్రయత్నం జరిగిన సంఘటనలెన్నో ఉన్నవి. అటువంటివాటిలో భారతదేశాన్ని ఆంగ్లేయుల పరిపాలననుంచి విముక్తం చేయడం ఒకటి. రెండవది ఆరువందలకు పైబడిన దేశీయ సంస్థానాల విలీనీకరణ. ప్రపంచ చరిత్రలోనే ఇది అనన్యమైన విషయం. తరువాత జాగీర్దారీ జమీందారీ విధానాలు రద్దుపరచబడ్డవి. భారీ పరిశ్రమలు నెలకొల్పబడినవి. హిందూకోడుబిల్లు వంటి తీవ్రమైన శాసనాలు ఆమోదింపబడ్డవి. ఇతర దేశాలలో ఇటువంటివాటి కన్నిటికీ విప్లవాలు జరుగవలసివస్తే మన దేశంలో ఇవన్నీ శాంతియుత పద్ధతుల ద్వారా సాధింపబడినవి.

## మిశ్రమ సంస్కృతి

హైద్రాబాదు ప్రజలు ఒక ప్రత్యేక సంస్కృతిని రూపొందించుకున్నారు. ఇతర సంస్కృతులవలెనే దీనిలో కూడా మంచీ చెడూ రెండూ ఉన్నవి. నవభారతంలో పాతకాలపు 'దర్బారీ' సంప్రదాయాలకు తావులేదు. క్రమేణా ఆ సంప్రదాయాలకు బదులు నూతనపరిస్థితులకు అనుగుణమైన పద్ధతులను మనం అనుసరించాలి. అయితే హైద్రాబాదులో కొంత మంచి కూడా వుంది. దానిని ఏవిధంగానైనా చివరకు వత్తిడితోనైనా మార్చకూడదు. హైద్రాబాదు మిశ్రమ సంస్కృతి ఇలాగే ఉండేట్టు చూడాలి. దానివల్ల ఆంధ్రులకు కూడా మేలుకలుగుతుంది అని ప్రధానమంత్రి అన్నారు.

ఆంధ్ర ప్రదేశ్‌లో తెలంగాణాకు ప్రముఖ స్థానం వుండాలని ప్రధాన మంత్రి అన్నారు. ఆంధ్రకూ, తెలంగాణాకూ సామరస్యం ఏర్పడాలి. ఉభయ ప్రాంతాలు సహనంతో, సద్భావంతో వ్యవహరిస్తూపోవాలి. ఒకరు మరొకరిపై వత్తిడి తేకూడదు.


పాత చరిత్ర కొంత వుంది కాబట్టి రాష్ట్రంలో ముస్లిములు స్వల్ప సంఖ్యలో వున్నా హైద్రాబాదులో వారికి ప్రాముఖ్యం ఉన్నది. జాగీర్దారీ జమీందారీ విధానాలు రద్దుకావడంచేత వారు కొంత ఇబ్బందికి లోనయ్యారు. తమ భవిష్యత్తును గూర్చి వారికి భయాందోళనలు ఉన్నవి. కనుక వారి అనుమానాలను, భయాందోళనలను తొలగించడం ఇతరుల కర్తవ్యం. భారతదేశం అనేక భాషలకు మతాలకూ తావలమైన భూమి. కనుక ప్రజలు మేము ఆంధ్రులమనీ, పంజాబీలమనీ, బెంగాలీలమనీ తలోచిస్తూ పోకూడదు. అంతా భారతీయులమనే భావంతో వ్యవహరించాలి.

ఆంధ్ర మంత్రులపైన, శాసన సభ్యులపైన గొప్ప బాధ్యతలున్నవి. ఇక్కడ మీకు అనేక క్లిష్టసమస్యలున్నవి. అందుచేతనే మీరు ఎట్లా పురోగమిస్తారని మిగతా భారత దేశం యావత్తు చూస్తూవున్నది. కనుక మీకిది పరీక్షా సమయం. మీరు ఎట్టి పొరపొచ్చెములు లేకుండా ఐకమత్యంతో వ్యవహరిస్తూ ఇతరులకు నమ్మిక, సదభిప్రాయం కలిగించాలి.


సంకుచిత స్వభావాలన్నా, వర్గ మనస్తత్వాలన్నా కాంగ్రెసుకు సరిపడవు. పెద్ద మనస్సుకలవాళ్లే ఇతరులతో సద్భావంతో మెలగ గలుగుతారు. సంకుచిత స్వభావాల వల్ల జాతికి పేరు ప్రతిష్ఠలు రావు. దేశం బలపడదు. అంటూ 'మీకు నా శుభాకాంక్షలు' అని ప్రధానమంత్రి తమ ప్రసంగం ముగించారు.

## సమైక్య కృషి

చరిత్రాత్మకమైన ఫతేమైదాన్‌లో ప్రధాన మంత్రి నూతన రాష్ట్రానికి లాంఛనప్రాయంగా ప్రారంభోత్సవం



*నవంబరు 1 వ తేదీన ప్రధానమంత్రి నెహ్రూ బేగంపేట విమానాశ్రయంలో దిగగానే వారికి స్వాగత మిస్తున్న ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ చందూలాల్ త్రివేదీ, నిజాం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి, డా. బి. రామకృష్ణారావు, నవాబ్ జైన్ యార్ జంగ్ తదితరులు.*



*నవంబరు 1 వ తేదీన బేగంపేట విమానాశ్రయంలో దిగగానే ప్రధానమంత్రి సైనికదళం సమర్పించిన గౌరవ వందనం స్వీకరించారు.*

జరిపారు. ఈ మైదానంలో జరిగిన బ్రహ్మాండమైన బహిరంగసభలో ప్రధాన మంత్రి ప్రసంగించారు. శ్రీమతి టంగుటూరి సూర్యకుమారి ప్రార్థనాగీతంతో సభా కార్యక్రమం ఆరంభమైంది. ప్రధాన మంత్రి ఇలా ప్రసంగించారు :

'ఈనాడు మనం చరిత్రలో ఒక అధ్యాయాన్ని సృష్టించుకుంటుకున్నాము. కనుక కొన్ని పాత పద్ధతులను మనం వదులుకోవాలి. రాజప్రముఖ్ పదవులను మనం తీసివేశాము. ఇది వ్యక్తిగత కారణాలవల్ల జరుగలేదు. ఒక సిద్ధాంతాన్నిబట్టి అలా చేశాము. ఇక్కడ నిజాం రాజప్రముఖ్ గా ఉండేవారు. అనేక పరిస్థితుల ప్రభావాలు ఆయనపై ఉన్నప్పటికీ కొత్త వ్యవస్థకు అనుగుణంగా ఆయన నడుచుకున్నందుకు నేనాయనకు కృతజ్ఞుడను. ముందు ముందు ఏమైనా అవకాశాలు కలిగేట్లయితే ఆయన హైద్రాబాదుకూ, భారతదేశానికీ సేవచేయాలి.

'రాజ ప్రముఖ్ ల వ్యవస్థ తాత్కాలికమైనది. ఇప్పుడది అంతరించింది. అంటే మనం పాత దృక్పథాన్ని వదులుకుంటున్నామన్నమాట. ప్రతి భారతీయుడు అభివృద్ధి చెందడానికి పూర్తి అవకాశాలుండే సమయం రావాలి. పేదరికం, నిరుద్యోగం మొదలైన వాటిని మనం నిర్మూలించాలి. ఈ ప్రయత్నంలో మనం విజయం పొందుతామనే నా ప్రగాఢ విశ్వాసం'.

బహిరంగసభలో లోక్ సభ సభాపతి శ్రీ మాడభూషి అనంతశయనం అయ్యంగార్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి డా. బూర్గుల రామకృష్ణారావుగారలు ప్రసంగిస్తూ ఆంధ్ర ప్రజల చిరకాలవాంఛ ఈడేరినదికాబట్టి ఆంధ్రులందరికీ ఇది శుభ సమయమనీ, అయితే రాష్ట్రాన్నీ, జాతినీ అభివృద్ధి పరచడానికి అందరూ సమష్టిగా కృషిచేయాలనీ ఉద్బోధించారు.

రాష్ట్రంలోని ఇతర జిల్లాలలో ఆనందోత్సాహాలతో ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవాలు జరిగాయి. పబ్లికు భవనాలపై జాతీయ పతాకాలు ఎగురవేయబడినవి. పోలీసుల విన్యాస ప్రదర్శనలు జరిగినవి. పాఠశాలల బాల బాలికలు, తదితరులు ఊరేగింపులు తీశారు. అనేక వైజ్ఞానిక

సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటుచేయబడినవి. విందులు జరిగినవి. దీపాలంకరణలు చేయబడినవి. బహిరంగసభలలో నాయకులు నూతన్న రాష్ట్రావతరణ దినోత్సవం ప్రాముఖ్యాన్ని వివరించారు. మారుమూల గ్రామాలలో సైతం వేడుకలు కడు వైభవంగా జరిగాయి.

## విశాఖపట్నం

నవంబరు 1 వ తేదీ ఉదయం జరిగిన పోలీసు పెరేడ్‌లో కలెక్టరు గౌరవ వందనం స్వీకరించి, గవర్నరు సందేశాన్ని చదివి వినిపించారు. పాఠశాలలు కూడా రాష్ట్రావతరణోత్సవాన్ని జరుపుకున్నవి. మహాంధ్ర సిద్ధించినందుకు ప్రజలలో ఆనందోత్సాహాలు వెల్లివిరియడం చేత జిల్లా కేంద్రము, ఇతర పట్టణాలు కళకళలాడినవి.


విజయనగరంలో వివిధ సంస్థలు ప్రభాత భేరీలు తీశాయి. పురపాలక సంఘ కార్యాలయంలో రెవిన్యూ డివిజనల్ ఆఫీసరు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని అధ్వర్యాన గరల్ గైడ్సు డ్రిల్లు ప్రదర్శనం చేశారు.

## వరంగలు


వరంగలు, హనుమకొండ పట్టణాలు నవంబరు 1 వ తేదీన చక్కగా అలంకరింపబడ్డవి. ఉదయం హనుమకొండ బహుళార్థ సాధక ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన పోలీసు పెరేడ్‌లో వరంగలు కలెక్టరు గౌరవ వందనం స్వీకరించి గవర్నరు సందేశాన్ని చదివి వినిపించారు. సందేశం తెలుగు అనువాదం కూడా చదవబడింది. అనేకమంది అధికార, అనధికార ప్రముఖులు ఆ ఉత్సవాన్ని చూచారు. ఆంధ్రప్రదేశ్ అవతరణకు ఆనంద సూచకంగా హనుమకొండ, మట్టెవాడలలో బాణసంచాలు కాల్చబడ్డవి.

## పశ్చిమ గోదావరి

జిల్లా కేంద్రమైన ఏలూరులో ఉదయం జరిగిన పోలీసు పెరేడ్‌లో కలెక్టరు గౌరవ వందనం స్వీకరించారు.



ప్రధానమంత్రి బేగంపేట విమానాశ్రయంలో దిగగానే గౌరవ వందనం స్వీకరించారు.



*ఫతేమైదాన్‌లో 1956 నవంబరు 1 వ తేదీన జరిగిన బహిరంగసభలో ప్రధానమంత్రి ప్రసంగించారు.*
*ఆ బహిరంగసభకు వచ్చిన ప్రజానీకం దృశ్యం.*

కలెక్టరు గవర్నరు సందేశాన్ని చదువగా అనేకమంది అధికార అనధికార ప్రముఖులు విన్నారు. పెరేడ్ ముగిసిన తరువాత పిల్లలకు మిఠాయి పంచిపెట్టబడింది.

పట్టణంలో ఉదయమే పబ్లికు భవనాలన్నిటిపై జాతీయ పతాకాలు ఎగురవేయబడినవి. మునిసిపల్ ఎలిమెంటరీ పాఠశాలల పిల్లలు పట్టణవీధుల గుండా ఊరేగింపుతీసి మునిసిపల్ కార్యాలయం వద్దకు వచ్చారు. అక్కడ వారికి మిఠాయి పంచిపెట్టబడింది. సి. ఆర్. రెడ్డి కళాశాల, సెంట్ థెరెసా కళాశాల ఉచితరీతిని రాష్ట్రావతరణోత్సవాన్ని జరిపాయి.

తాలూకా పట్టణాలలో పాఠశాలల బాలబాలికలు ఉదయం ఊరేగింపులు తీశారు. మిఠాయీలు పంచిపెట్టబడ్డవి. తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరములలో జరిగిన బహిరంగ సభలలో ప్రముఖ పౌరులు రాష్ట్రావతరణోత్సవ ప్రాముఖ్యాన్ని వివరించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రోద్యమాన్ని వివరంగా చెప్పారు. తాడేపల్లి గూడెం కార్యక్రమంలో ఒక నాటిక, భరత నాట్య ప్రదర్శనం కూడా కలవు.

## ఆదిలాబాదు

నవంబరు 1వ తేదీన పోలీసు పెరేడ్‌లో జిల్లా కలెక్టరు గౌరవవందనం స్వీకరించి, గవర్నరు సందేశం చదివి వినిపించారు. రాత్రి 9 గం. లకు పురపాలక సంఘంవారు వైజ్ఞానిక కార్యక్రమం పర్యాటుచేశారు.

నిర్మల్ పట్నంలో రాష్ట్రావతరణోత్సవం సందర్భంలో తగు విధంగా కార్యక్రమాలు జరిగినవి,

## నల్లగొండ

పట్టణమంతా జాతీయపతాకాలతో అలంకరించబడింది, ఉదయం ప్రభుత్వ కార్యాలయాల పైన ఇతర ముఖ్య స్థలాలలో జాతీయపతాకాలు ప్రతిష్ఠాపించబడ్డవి. కలెక్టరు పోలీసు పెరేడులో గౌరవవందనం స్వీకరించి, గవర్నరు

సందేశం చదివారు. జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు నల్లగొండ సివిల్ ఆసుపత్రి రోగులకు పండ్లు పంచిపెట్టారు.

జిల్లా తహశీల్లలో, ఫిర్కా కేంద్రాలలో రాష్ట్రావతరణోత్సవాలు వైభవంగా జరుపబడ్డవి.

సూర్యాపేటలో వేలాది ప్రజలు రాష్ట్రావతరణోత్సవాలలో పాల్గొన్నారు. వికలాంగులైనవారికీ, అనాథులకూ సహాయంచేసే నిమిత్తం పురపాలక సంఘం రూ. 500లు మంజూరుచేసింది.

## ఖమ్మంమెట్టు

ఉదయం ప్రభాతభేరీలు తీయబడినవి. వందలాది ప్రజలు బాల బాలికలు ఊరేగింపులలో పాల్గొన్నారు. పోలీసు పెరేడ్‌లో జిల్లాకలెక్టరు గౌరవవందనం స్వీకరించి, గవర్నరు సందేశం చదివి వినిపించారు.


పాఠశాలల బాలబాలికలు, ప్రజలు ఆటలలో పాల్గొన్నారు. పాఠశాలల బాలికలు నాటికలు ప్రదర్శించారు. ఆటలలో గెలిచినవారికి కలెక్టరు బహుమతులిచ్చారు.

వీధులు- ఇండ్లు, అంగళ్లు పచ్చతోరణాలతో, పుష్పాలతో, పతాకాలతో అలంకరించబడ్డవి. స్థానిక సినిమా హాళ్ల యజమానులు, అంగళ్లు కాఫీహోటళ్ల యజమానులు తమ కార్మికులకు రాష్ట్రావతరణదినోత్సవంనాడు రెండురెట్లు వేతనా లిచ్చారు.


జిల్లాలో డివిజన్ తహశీలు కేంద్రాలు, జాతీయ వికాస కేంద్రాలు, సామాజిక వృద్ధి బ్లాకులు ఆనందోత్సాహాలతో రాష్ట్రావతరణ దినోత్సవం జరుపుకున్నవి.

## కడప

నవంబరు 1 వ తేదీన జిల్లా పోలీసు మైదానంలో జరిగిన పోలీసు పెరేడులో కలెక్టరు గౌరవవందనం స్వీకరించారు. కలెక్టరు బంగళాలో దర్శనీయమైన వైజ్ఞానిక కార్యక్రమం జరిగింది. ఉత్తమకళాకారులు సంగీతనాట్య కార్యక్రమాలతో ప్రేక్షకులను రంజింపచేశారు.



ఫతేమైదాన్ బహిరంగసభలో ప్రసంగిస్తున్న ప్రధాన మంత్రి.



నవంబరు 1 వ తేదీన రాజ్ భవన్ విందుకు విచ్చేస్తున్న ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ.

## తూర్పు గోదావరి

నవంబరు 1 వ తేదీన జిల్లా అంతటా రాష్ట్రావతరణోత్సవం జరుపబడింది. విద్యార్థులు ప్రబలు ఊరేగింపులు తీశారు. బహిరంగ సభలు జరిగినవి.

జిల్లా కేంద్రంలో కలెక్టరు పోలీసు పెరేడ్‌లో గౌరవ వందనం స్వీకరించారు. పెరేడ్‌లో సాయుధ రిజర్వు పోలీసులు, కాలేజీ కేడెట్లు పాల్గొన్నారు.

ఉదయం జిల్లా కేంద్రంలో పాఠశాలల బాలబాలికలు పుర వీథుల గుండా ఊరేగింపు తీశారు. మునిసిపల్ కార్యాలయంలో పిల్లలకు మిఠాయి పంచిపెట్టబడింది.

పి. ఆర్. ప్రభుత్వ కళాశాలలో, పురమందిరంలో బహిరంగ సభలు ఏర్పాటుచేయబడినవి. ప్రముఖ విద్యావేత్తలు, నాయకులు ఉత్సవ ప్రాముఖ్యాన్ని గూర్చి ప్రసంగించారు.

రాజమండ్రి పురపాలక సంఘం, వాణిజ్య మండలి, యువజన కాంగ్రెసు, ఇతర ప్రజాసంస్థలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు రాష్ట్రావతరణోత్సవం జరిపాయి.

## మెదకు

జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో పోలీసు పెరేడ్ జరిగింది. గవర్నరు సందేశాన్ని కలెక్టరు చదివారు. సాయంత్రం పోలీసు పెరేడ్ మైదానంలో ఆటల పోటీలు జరిగాయి. పాఠశాలల పిల్లలకు మిఠాయి పంచిపెట్టబడింది.


## కర్నూలు


ఆంధ్రరాష్ట్రానికి మొదట రాజధానిగావున్న కర్నూలులో ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవాలు ఎంతో ఉత్సాహంతో జరిగాయి. ఉదయం పోలీసు పెరేడ్ మైదానంలో జరిగిన అధికార సభలో కర్నూలు జిల్లా కలెక్టరు పోలీసు పెరేడ్‌లో గౌరవ వందనం స్వీకరించి గవర్నరు సందేశం చదివారు.



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అధికార నివాసం "దిల్‌కుషా"లో ప్రధానమంత్రి భోజనంచేస్తున్న దృశ్యం.

→ ముఖ్యమంత్రి అధికారనివాసం "దిల్‌కుషా"లో ప్రధానమంత్రి.





"దిల్ కుషా"లో ప్రధానమంత్రితో రాష్ట్ర ముఖ్యమంత్రి, తదితరులు.

పెరేడ్‌లో సాయుధ రిజర్వుపోలీసు, నేషనల్ కేడెట్ కోర్ జూనియర్ సీనియర్ డివిజనులు, ఆక్జిలియరీ కేడెట్ కోర్ బాలబాలికల డివిజనులు, గర్ల్‌గైడ్లు పాల్గొన్నారు.

## నెల్లూరు

ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవాలు మహోత్సాహంతో జరుపబడ్డవి. దర్గం పేటలో జరిగిన పోలీసు పెరేడ్ చూడడానికి చాలామంది ప్రజలు వచ్చారు. నెల్లూరు సాయుధ రిజర్వు పోలీసువారిచ్చిన గౌరవవందనాన్ని కలెక్టరు స్వీకరించారు.

పురమందిరంలో బహిరంగ సభ జరిగింది. ఆ తరువాత నృత్య సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

## శ్రీకాకుళం

మునిసిపల్ హైస్కూలు మైదానంలో జిల్లా సాయుధ రిజర్వు పోలీసు లిచ్చిన గౌరవవందనాన్ని కలెక్టరు స్వీకరించి, గవర్నరు సందేశం చదివి వినిపించారు. పాఠశాలల పిల్లలకు మిఠాయి పంచిపెట్టబడింది.

అగ్నిమాపక దళంవారు అగ్ని మంటలను చల్లార్చే ప్రదర్శనాన్ని చూపించారు.

స్థానిక న్యాయవాద సంఘం, పురపాలక సంఘం, కళాశాల, పాఠశాలలు, ఇంకా ఇతర సంస్థలు రాష్ట్రావతరణోత్సవం జరుపుకొన్నవి. పబ్లిక్ భవనా లన్నిటినీ అలంకరించి, దీపాలతో ప్రకాశింపజేశారు.

## కృష్ణా

మచిలీపట్నంలో పోలీసు పెరేడ్‌లో జిల్లా కలెక్టరు గౌరవవందనం స్వీకరించి, గవర్నరు సందేశం చదివారు. విద్యాసంస్థలు, బ్యాంకులు, అనేక ఇతర సంస్థలు రాష్ట్రావతరణోత్సవం జరిపాయి. మునిసిపల్ పార్కులో బహిరంగసభ జరిగింది.

## నిజామాబాదు


ఆంధ్ర ప్రదేశ్ అవతరణోత్సవం కడు వైభవంగా జరుపబడింది. ఉషస్సు రేఖలు దృగ్గోచరం కావడంతోటే దాదాపు 8 వేల మంది విద్యార్థులు, బాలబాలికలు దేశ



← శ్రీ నెహ్రూ గౌరవార్థం ముఖ్యమంత్రి చేసిన విందు — మరొక దృశ్యం.

నవంబరు *1* వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారు తమ అధికారనివాసం “దిల్ కుషా”లో చేసిన విందులో ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశంగారు.





అఖిలభారత పారిశ్రామిక వస్తుప్రదర్శనంలో ప్రత్యేకంగా నిర్మింపబడిన రంగస్థలంలో ప్రధానమంత్రి సమక్షంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆ సందర్భంలో బేబీ రత్నపాప నృత్యం.

→ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కళాకారులలో బాలికలకు పూలమాలలు వేశారు.







సాంస్కృతిక కార్యక్రమంలో శ్రీమతి టంగుటూరి సూర్యకుమారి చక్కని రెండుపాటలు పాడారు.

← పారిశ్రామిక ప్రదర్శన రంగస్థలంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో కూచిపూడి నృత్యం.
కృష్ణుడు గోపికల సరససల్లాప దృశ్యం.





విమానాశ్రయంవద్ద : ఢిల్లీకి బయలుదేరేముందు ప్రధానమంత్రి ప్రముఖు లందరివద్దనుంచి సెలవుపుచ్చుకుంటున్నారు.



కొత్తఢిల్లీకి బయలుదేరేముందు శ్రీ వి. కె. కృష్ణమేనన్ ప్రభృతులతో శ్రీ నెహ్రూ.

భక్తి గీతాలు పాడుకుంటూ వీధుల గుండా ఊరేగింపు తీశారు. పోలీసు మైదానంలో జరిగిన అధికార ఉత్సవం చూడడానికి ఐదువేల మందికి పైగా ప్రజలు వచ్చారు. జిల్లా కలెక్టరు గౌరవ వందనం స్వీకరించి, గవర్నరు సందేశం చదివారు. ఆ సందేశం తెలుగు, హిందూస్తానీ భాషలలోకి అనువదించబడింది.

ఖైదీలకు మిఠాయిలు, పండ్లు పంచిపెట్టబడ్డవి. మునిసిపాలిటీవారు 15 వేల మందికి అన్నదానం చేశారు. పేదలకు వస్త్రాలిచ్చారు.

అనేక పేటలలో బహిరంగ సభలు జరిగాయి. ఆంధ్ర ప్రదేశ్ అవతరించినందుకు ప్రజలు ఆనందించారు. రాత్రి నిజామాబాదుపట్టణమంతా దీపాలతో శోభాయమానంగా అలంకరించబడింది.

## గుంటూరు

నవంబరు 1 వ తేదీన రాష్ట్రావతరణోత్సవం విజయవంతంగా జరుపబడింది. పోలీసు పెరేడ్ మైదానంలో జిల్లా, సెషన్సు జడ్జి గౌరవవందనం స్వీకరించి, జాతీయ పతాకావిష్కరణ గావించారు. పిల్లల ఆటల పోటీలు, విచిత్ర వేషధారణ పోటీలు జరిగాయి.

సెంట్ మాత్యూస్ చర్చిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రారంభోత్సవం సందర్భంగా థాంక్స్ గివింగ్ సర్వీస్ - ఉపకారస్మృతికర్మ - జరుపబడింది. ఆంధ్ర ఎవాంజెలికల్ లూథరన్ చర్చి అధ్యక్షుడు డివైన్ సర్వీసు జరిపించారు.

## చిత్తూరు

పోలీసు పెరేడ్ మైదానంలో జిల్లా కలెక్టరు జాతీయ పతాకావిష్కరణం చేసి, గౌరవవందనం స్వీకరించారు. నేషనల్ కేడెట్ బాలికలు, పార్థసారథి బాలవిహార్ పిల్లలు స్థానిక నర్సరీ స్కూలు పిల్లలు ప్రదర్శనలిచ్చారు. పెరేడు ముగిసిన తరువాత ప్రత్యేకంగా అలంకృతమైన శకటాలతో పట్టణ వీధులగుండా ఊరేగింపు తీయబడింది.

## మహబూబునగర్

పురప్రముఖులు అధికారులు రాష్ట్రావతరణోత్సవం జరిపారు. పోలీసు పెరేడ్ జరిగింది. పట్టణంలో ప్రధాన వీధులు పచ్చతోరణాలతో, పతాకాలతో అలంకరింపబడ్డవి. సాయంత్రం జిల్లా కలెక్టరు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. 30 లారీలతో ఊరేగింపు తీయబడింది. వివిధరంగుల దీపాలతో పట్టణం అలంకరింపబడింది. పోలీసు పెరేడ్‌లో జిల్లా కలెక్టరు గౌరవవందనం స్వీకరించి గవర్నరు సందేశం చదివారు. ఆ సందేశాన్ని జిల్లా స్కూళ్ల ఇనస్పెక్టరు తెలుగులోకి అనువదించారు.

## కరీంనగర్

కరీంనగరులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణోత్సవం మహోత్సాహంతో జరుపబడింది. ఉదయం పోలీసు పెరేడ్‌లో జిల్లా కలెక్టరు గౌరవవందనం స్వీకరించి గవర్నరు సందేశం చదివారు, సాయంత్రం అధికారులు, అనధికారులు, పాఠశాలల పిల్లలు ఆటల పోటీలలో పాల్గొన్నారు. రాత్రి కరీంనగర్ క్లబ్బులో విందు, వినోద కార్యక్రమాలు జరిగాయి.

## అనంతపురం


ఉదయం పోలీసు ట్రెయినింగ్ కాలేజీ మైదానంలో జరిగిన పోలీసు పెరేడ్‌లో జిల్లా కలెక్టరు గౌరవవందనం స్వీకరించి గవర్నరు సందేశం చదివారు. ఈ ఉత్సవానికి అనేక మంది అధికారులు, అనధికారులు విచ్చేశారు.

పబ్లికు భవనాలు దీపాలతో అలంకరింపబడ్డవి. వాటన్నిటిపై జాతీయ పతాకాలు ప్రతిష్ఠాపింపబడ్డవి. వైజ్ఞానిక కార్యక్రమాలు జరిగినవి. వాటిలో స్థానిక కళాకారులు పాల్గొన్నారు. పబ్లికు భవనాలు నివాస గృహాలు దీపాలతో అలంకరించడంవల్ల పట్టణమంతా కళాకాంతులతో విరాజిల్లింది.

# అల్పసంఖ్యాక వర్గములకు ముఖ్యమంత్రి అభయం

క్రొత్త ప్రభుత్వంక్రింద అల్పసంఖ్యాక వర్గములకు, తెలంగాణా ప్రాంతపు ప్రభుత్వోద్యోగులకు ఏ విధమైన కష్టనష్టాలు రావనీ, ఏకీకరణ సూత్రాలు చర్చించినప్పుడు నాయకుల మధ్య జరిగిన ఒప్పందం అక్షరాలా అమలు జరగగలదనీ హామీ యిస్తూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారు 1956 నవంబరు 1 వ తేదీన హైదరాబాదు రేడియోనిలయం నుండి ప్రసంగించారు. ముఖ్యమంత్రి ప్రసంగం పూర్తిపాఠం ఇది :

ఈ వేళ ఉదయమే నేనూ, నా సహమంత్రులూ ప్రమాణ స్వీకారం చేశాము. ఆ లాంఛనంతో ఆంధ్ర ప్రదేశం అవతరించింది. ఈ రోజునే భారత దేశంలో మరి కొన్ని కొత్త ప్రదేశాలు కూడా అవతరించినవి. ద్విభాషా రాష్ట్రమైన బొంబాయి మినహా, తక్కిన ప్రదేశాలన్నీ పరిపాలనా సౌలభ్యం కోసం ఏక భాషారాష్ట్రాలుగా ఏర్పాటు చెయ్యబడ్డవి. ప్రజా ప్రభుత్వయుగంలో ప్రజలే ప్రభువులు గనక ప్రజా భాషలో పరిపాలనా వ్యవహారాలు జరగడం అవసరమూ, శ్రేయస్కరమూ అన్న సిద్ధాంతం ఆదిలో ప్రవచించిన వారు ఆంధ్రులు. సాధించిన వారు కూడా ఆంధ్రులే. పందొమ్మిదివందల ఏభై మూడో సంవత్సరం అక్టోబరు ఒకటవ తేదీన ఆంధ్ర రాష్ట్రం అవతరించింది. జగదేక రాజకీయవేత్త మన ప్రధాని నెహ్రూ అనుగ్రహంతో, ఆయన పౌరోహిత్యంలో రూపొందిన ఆంధ్ర రాష్ట్ర అవతరణతో యావదాంధ్రుల వాంఛా ఈడేరలేదు. ఆంధ్రప్రదేశ్ నిర్మాణంతోనే ఆ కోరిక ఫలించింది. ఈ రోజున జరిగిన ఈ సంఘటన, భారత జాతీయ పరిణామంలో ఆంధ్రులకి ఒక విశిష్ట విజయం. సంస్కృతి సౌధానికి ఒక గట్టి పునాది. నవయుగానికి మహోదయం. ఇవి దీపావళిపండుగ రోజులు. మన పర్వదినాలన్నీ దుష్ట శిక్షణకీ శిష్ట రక్షణకీ చిహ్నాలు. సత్యమూ, ధర్మమూ అనే సనాతన సూత్రాల మీద నిర్మాణమయిన భారతదేశం ఆ సంప్రదాయాన్నే చిర కాలం పాలించగలదు. భారత దేశంలో అవినాభావమైన ఆంధ్రప్రదేశ ప్రభుత్వ ఆదర్శం వేరుగా ఉండబోదు.



శ్రీ నీలం సంజీవరెడ్డి

ఉండరాదు. ఆంధ్ర శబ్దానికి శాస్త్రజ్ఞులు, చీకటిలోంచి వెలుగులోకి రావడం అని అర్థం చెబుతారు. నిజానికి ఆంధ్రప్రదేశ్ అవతరణ చీకటిలోంచి వెలుగులోకి రావ

డమే. దీపావళి వెలుగు తెచ్చే పర్వం. ముక్కోటి ఆంధ్రుల హృదయాలలోను ఈ రోజుతో కొత్త వెలుగు ప్రకాశి స్తోంది. మూడు చెరగులైన తెలుగు వారు ఒకే కుటుం బంగా రూపొందినారు. ఆంధ్రులకి తల్లి దేశం తెలంగాణమే. ప్రపంచం కన్ను తెరవకమునుపే ఈ ప్రాంతంలో నాగరి కత వెల్లివిరిసిన చిహ్నలున్నవి. మన శిల్ప కళా, సాహిత్య సంపదే కాక ఆర్థిక సంపదకూడా ఎక్కువగా తెలంగా ణంలోనే ఉన్నది. వైజ్ఞానికంగా ఈ శతాబ్ది ప్రారంభంలో ఆంధ్రోద్యమం ఇక్కడే మొదలైంది. ఆంధ్రచరిత్ర సమగ్ర రచనకి సహాయపడే పరికరాలన్నీ ఇక్కడే దొరుకుతున్నవి. తెలంగాణ మొకటీ ఆంధ్ర వేరొకటీ కాదు. నిన్నటివరకూ తెలంగాణమనీ, ఆంధ్ర అనీ ప్రత్యేకంగా ఉన్న ప్రాంతాలు ఒకానొకప్పుడు ఒకటే. రాయలసీమ అనే ఆంధ్ర భాగం కూడా కలిసి మహాంధ్రంగా ఉండేది. దత్తమండలాలు తెల్లవారికి దత్తమైనవి. సర్కార్లు అనే కోస్తా ప్రాంతం కూడా అల్లాగే కంపెనీ వారికి సంక్రమించింది. మూడు ముక్కలైన ఆంధ్రులు మళ్లీ మూడు ముళ్లు వేసుకుని ఒకటైనారు. అంతే. జనసామాన్యంలో, గ్రామసీమలలో, రైతులలో, పారిశ్రామికులలో ఒకే జీవితాశయం, సంస్కృతీ, సంప్రదాయం సుస్పష్టంగా ఉన్నాయి. కాల మాన పరిస్థితుల్ని అనుసరించి, చరిత్ర ప్రవాహంలో కొన్నాళ్లు వేరు పాయలు కావచ్చు. బహుకొద్ది ప్రాంత ములో, బహుకొద్ది ప్రజలు ఆంధ్ర సంస్కృతికి, తెనుగు జాతీయతకి కించిత్తు దూరమై ఇతర స్రవంతులలో పడి పోయి ఉండవచ్చు. అది సహజం. అసలు తెలుగుజాతి సాంస్కృతికంగా స్వీకార స్వభావం కలది. తిరస్కార స్వభావం కలది కాదు. ఉత్తర దక్షిణ భాగాల మధ్య నున్న మనము రెండు సంప్రదాయాలు అలవర్చు కున్నాము. తత్కారణంగా భారతీయ సమైక్యతకి మనం సూత్రధారులం అవుతున్నాము. ఈ సమైక్యతే ఇప్పుడు కలిసిపోయిన ఆంధ్ర తెలంగాణముల మధ్య ఉండగలదని నా సంపూర్ణ విశ్వాసం. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల ఏకీకరణ, మంజీర గోదావరి సంగమం వంటిది. ముచి కుందా కృష్ణా సంగమం వంటిది. అది ఒక మహా సంక్రాంతి. ఈ సంయోగంలో పూర్వరూపాల తర తమాలు లేవు. ఈ సంగమంలో పూర్వ జలాల ఛాయలు లేవు. ఈ స్రవంతి సనాతనం, ఈ ప్రవాహం సజీవం.

అక్షర క్రమంలో ఆంధ్ర ప్రదేశం, భారతీయ రాష్ట్రా లలో మొదటిది. 'అ' అనేది బీజాక్షరం. మానవ అక్షరా మ్నాయానికే కాక ఓంకారానికే ప్రథమాక్షరం. వైశా ల్యంలో యావత్తు భారతదేశంలోనూ నాలుగోస్థానం అలంకరిస్తున్నది. ఒక లక్షా పదివేల చదరపు మైళ్ల వైశా ల్యంతో, అయిదు వందల నలభై మైళ్ల సుదీర్ఘ సముద్ర తీరంతో, కృష్ణా, గోదావరి, పినాకినీ, తుంగభద్రా నదీమ తల్లులతో, మూడుకోట్ల ఇరవై రెండు లక్షల జనాభాతో అవతరించిన ఆంధ్రప్రదేశం సౌభాగ్యవంతమైన పుణ్యసీమ. ఈ ఆవతరణ మహా ముహూర్తంలో ఏ పెద్దలు ఈ కలలు కన్నారో, ఏ నాయకులు ఈ పుణ్య సమయంకోసం కృషి చేశారో, ఏ కవులు ఆంధ్ర, మహాంధ్ర రాష్ట్ర గానం చేశారో, ఏ శిల్పులు ఈ నిర్మాణం రూపొందించారో, వారిలో దివంగతులైన వారిని నేను స్మరిస్తున్నాను. జీవించి వున్న వారిని అభినందిస్తున్నాను.

తెలుగు వారిదైన ఈ దివ్య దీపావళికి, ఆంధ్ర రాష్ట్రా నికి అంకురార్పణ చేసిన మన ప్రధాని పనులెన్నో వున్నా వీలుచేసుకుని దయచేసి మనల్ని ఆశీర్వదించడం మన భావి సౌభాగ్యానికి శుభ శకునం. మూడుకోట్ల ఆంధ్రుల తరఫున వారికి నా కృతజ్ఞత తెలియజేస్తున్నాను.

ఆంధ్ర ప్రదేశ ప్రథమ ముఖ్యమంత్రి కావడం నా అదృష్టం అని నేను భావిస్తున్నాను. ఈ మహదవకాశం నాకు కల్పించి, ఈ గౌరవం నాకు చేసినందుకు ప్రజా ప్రతినిధులైన కాంగ్రెసు శాసనసభ్యులకు నా వినయ పూర్వక కృతజ్ఞతాభి వందనాలు అర్పిస్తున్నాను.

ఈ శుభ సమయంలో, ఈ ఆనందంలో మన భావి బాధ్యతలు మనం మర్చిపోకూడదు. అవి చాలా ఘన మైనవి. కలిసిపోయిన రెండుప్రాంతాలలోనూ పరిపాలనా క్రమం, నియమాలూ- చట్టాలూ, సంప్రదాయాలు వేరు వేరుగా వున్నవి. కొంతకాలం ఆవిధంగా వుండడం తప్పని సరి. అయినా, సకాలంలో ఒకటి కావలసిన అవసరం వున్నది. ప్రభుత్వాధికారులూ, ఉద్యోగులూ ఈ లక్ష్యం మనస్సులో వుంచుకునే తమ తమ కార్యకలాపాలు నెర వేర్చాలి. ఈ పరిస్థితులలో కొంత వ్యవహార క్లిష్టత జరిగి తీరుతుంది. ఉద్యోగులు ఓపికతో, శ్రద్ధతో, శాంతంతో పనిచెయ్యాలి. రెండువేపుల వ్యవహారాలు, ఉద్యోగుల కలయిక సర్వాంధ్ర కల్యాణంగా పరిణమించాలి. ఆంధ్ర ప్రదేశ సౌభాగ్యమే మన పరమ లక్ష్యంగా మనం వ్యవ హరించాలి. ఈ ఏకీకరణ వల్ల హైద్రాబాదు రాజ్యంలో పనిచేస్తూ వుండి, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ ఉద్యోగులైన వారికి ఏవిధమైన కష్టనష్టాలూ రావని నేను అభయ

[తరునాయి 30 వ పేజీలో]

నైసర్గిక స్వరూపం :

# ప్రకృతి సౌందర్యానికి ఆలవాలమైన భూమి ఆంధ్ర ప్రదేశ్

జనసంఖ్య విషయంలో భారతదేశంలోని మిక్కిలి పెద్దరాష్ట్రాలలో నాలుగవది ఐన ఆంధ్ర ప్రదేశ్‌లో గొప్ప ప్రకృతి సౌందర్యానికి ఆటపట్టు లైన ప్రదేశాలు — పర్వతశ్రేణులు రమారమి అయిదువేల అడుగుల యెత్తుగల శిఖరాలు, పెద్ద చిన్న నదులు, విశాలమయిన సరస్సులు, చెరువులు, వివిధరకాల జంతు, వృక్ష సముదాయముతో కూడిన అడవులు వున్నవి. కొన్ని ప్రదేశాలలో వేసవి తీవ్రంగా వున్నప్పటికీ, రాష్ట్ర శీతోష్ణస్థితి, ఆరోగ్యకరమైనది. రాక పోకల విషయంలో దక్షిణభారతంలో ఈ రాష్ట్రం కీలక స్థానాన్ని ఆక్రమిస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ భారతదేశంలోని మిక్కిలి పెద్ద రాష్ట్రాలలో నాలుగవది. దీని వైశాల్యం 1,10,250 చ. మై; జనసంఖ్య 322 లక్షలు. రాష్ట్రానికి బంగాళాఖాతము నంటి సుదీర్ఘమైన 540 మైళ్ళ తీరప్రదేశం కలదు. దీనికి వుత్తరానవున్న పొరుగురాష్ట్రాలు ఒరిస్సా, మధ్యప్రదేశ్, పశ్చిమాన నూతన బొంబాయి రాష్ట్రము, దక్షిణాన మద్రాసు, మైసూరురాష్ట్రాలు వున్నాయి.

ఈ రాష్ట్రం సర్వసామాన్యంగా వుత్తరాన 15°, 20° అక్షాంశ రేఖ, తూర్పున 78°, 85° దీర్ఘాంశ రేఖల మధ్య వున్నది.

దక్కను పీఠభూమి కొంత భాగానికి, తూర్పు కోస్తా ప్రదేశానికి విస్తరించి వున్న ఈ రాష్ట్రపు భూభాగంలో పశ్చిమాన మొత్తంమీద మెట్టభూములు, తూర్పుకు రాను రాను సారవంతమైన పల్లపు భూములు వున్నవి. కళింగపట్నం, బారువ, భీమునిపట్నం, విశాఖపట్నం, కాకినాడ, మచిలీపట్నాలు ప్రసిద్ధ రేవులు. ఇవికాక మరికొన్ని కోస్తా పట్టణాలున్నవి. రాకపోకల విషయంలో ఇది దక్షిణ భారతావనికి కేంద్ర స్థానంలో వుంది. ఢిల్లీ, త్రివేంద్రములను; బొంబాయి, మద్రాసులను కలిపే ముఖ్యమైన అన్ని రోడ్లు, రైలు మార్గాలూ, విమాన మార్గాలూ దీని గుండా వెళ్ళవలసివున్నది.

ఉత్తరపు కొసనుగల మహేంద్రగిరి రాష్ట్రంలో మిక్కిలి యెత్తైన శిఖరం. అది సముద్రమట్టానికి 4,920అడుగుల యెత్తున వున్నది. రాష్ట్రంలో ప్రవహించే మిక్కిలి పెద్ద నది గోదావరి. దాని మొత్తం పొడుగు 870 మైళ్ళు.

వర్షపాతం సాధారణంగా ప్రాంతాలనుబట్టి మారుతూ వుంటుంది. తూర్పు గోదావరి జిల్లాలో అధికతమంగా 55 అంగుళాలు వుంటుంది. అనంతపురం జిల్లాలో అల్పతమంగా వుంటుంది. 1951—52 లో అక్కడి వర్షపాతం 16 అంగుళాలు. వేర్వేరు ప్రాంతాలలో సంవత్సరం పొడుగునా అప్పుడప్పుడు వర్షాలు కురిసినా, వర్షాకాలం ప్రధానంగా జూన్ నెలతో ప్రారంభమై, సెప్టెంబరుతో ఆఖరవుతుంది. వర్షపాతం తరుచు నియమబద్ధంగా వుండదు; దాన్ని గురించి ముందుగా తెలుసుకొనడానికి వీలుండదు. ఒక్కొక్కప్పుడు వర్షాకాలం ఆరంభంలోను, మరొకప్పుడు ఆఖరుసమయంలోను అధికంగా వుంటుంది. సాధారణంగా పశ్చిమప్రాంతాలకంటె తూర్పుప్రాంతంలో యెక్కువ వర్షం కురుస్తుంది. తూర్పుప్రాంతంలో వుష్ణోగ్రత హెచ్చుగా వుండడము, గాలి వూర్ధ్వచలనం యెక్కువ చురుగ్గా వుండడమే దీనికి కారణం. తూర్పున అడవులు, సరస్సులు యెక్కువ వున్నందున తేమ కూడా అధికంగా వుంటుంది. తూర్పున గల నదీలోయల గుండా బంగాళా

ఖాతంలోని తుపానులు లోపలికి చొచ్చుకొని వస్తాయి. కాని పశ్చిమభాగం కొండప్రదేశం కావడం వల్ల అవి సులభంగా అక్కడికి చేరనేరవు.

## శీతోష్ణస్థితి

రాష్ట్రపు శీతోష్ణస్థితిలో విపరీతమైన హెచ్చుతగ్గులు ఉండవుకాని కొన్ని ప్రాంతాలలో మాత్రం సంవత్సరంలో స్వల్పకాలం శీతోష్ణాలు తీవ్రంగా ఉండడం నిశ్చయం. సంవత్సరంలో అధికభాగం దేశం బాగా వేడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతమాత్రం ఋతువులనుబట్టి మారుతూ ఉంటుంది. ఇక్కడి ఋతువులు స్థూలంగా నాలుగు— మార్చి నుండి మే వరకు వేసవి. జూన్ నుండి సెప్టెంబరు వరకు వర్షాకాలం. అక్టోబరు- నవంబరు నెలలు మధ్య కాలం. డిసెంబరు నుండి ఫిబ్రవరి వరకూ శీతాకాలం లేక చలికాలం. సామాన్యంగా మే నెలలో వేడిమి అత్యధికంగా ఉంటుంది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో ఉష్ణోగ్రత ఫారన్ హీటు డిగ్రీలు 120 వరకూ పెరుగుతుంది. డిసెంబరు నెలలో ఉండే అల్పతమ ఉష్ణోగ్రత 54° ఫారన్ హీటు. వేడిమి అత్యధికంగా గల ప్రదేశాలు గుంటూరు, కృష్ణా, ఖమ్మం జిల్లాల్లో వున్నవి. ఇక్కడ నడి వేసవికాలంలో కొన్నిరోజులు యెండలు చాలా బాధాకరంగా ఉంటాయి. కాని సామాన్యంగా వేసవి వెళ్లగానే వర్షం గుమ్మరించి ప్రాణాలను సేదతీరుస్తుంది. వేసవి మకాములుగా పనికివచ్చే చల్లనిప్రదేశాలు కొన్ని ఉన్నవి. వీటిలో ప్రసిద్ధమైనవి వాల్తేరు, విశాఖపట్నం, భీమునిపట్నం, ఉప్పాడ, వాడరేవు, మదనపల్లి, పెనుగొండలు.

రాష్ట్రంలో యించుమించు అన్ని ప్రాంతాలలోను కొండలు, నదీలోయలు ఉన్నవి. ఇక్కడి భూములను ముఖ్యంగా స్పష్టమైన రెండు తరగతులుగా విభజించవచ్చును. ఎక్కువ సారవంతమైన భూమి మధ్యభాగంలో నదీలోయల చుట్టూను, కోస్తాప్రదేశాన్ని అంటివున్నది. మిగిలిన మూడు పక్కలా సరిహద్దుల వైపుగల నేల అంత సారవంతమైనదికాదు. ఇది స్థూలంగా యింతే అయినప్పటికీ బాగా పండే భూములకు ప్రసిద్ధిగాంచిన కొన్ని జిల్లాలలో పంటరాలని మెట్టభూములు విస్తారంగా వున్నవి. వాడుకభాష విషయంలో రాష్ట్రాన్ని స్థూలంగా నాలుగు ప్రాంతాలు— ఈశాన్య, వాయవ్య, మధ్య, దక్షిణ-గా విభజించవచ్చును. ఈశాన్య, వాయవ్య, దక్షిణ ప్రాంతాల భాషలో తరతమ భేదాలలో వరుసగా ఒరియా, ఉర్దూ, తమిళభాషల ప్రభావం కనబడుతుంది. వీటితో పోల్చినప్పుడు మధ్యప్రాంతం పై ప్రభావానికి లోనుగాని ప్రాంతంగా పరిగణింపబడవచ్చు సహజంగా.

## కొండలు, అడవులు

కొండలలో మహేంద్రగిరి కాక మిగిలిన కొండలు యివి : పాలకొండలు— వీటియెత్తు 4,000 అడుగులు, గాలికొండలు, వెలగాడకొండ, సింహాచలం నరసింహ కొండ, గోల్కొండలు, విశాఖపట్నం నౌకాశ్రయంవద్ద గల డాల్ఫిన్స్‌నోస్, అనంతగిరికొండలు, నల్లమలకొండలు. సహ్యాద్రి శ్రేణి, ఉత్తర బాలఘాట్ శ్రేణి, దేవరకొండ, భోనగిరికొండలు. తూర్పు భాగంలో అక్కడక్కడ తూర్పు కనుమలకు చెందిన చిన్నచిన్న కొండలు ఉన్నవి. ఇది మొత్తంమీద యిప్పుడు సారవంతమైన పీఠభూమి. మూడువేల సంవత్సరాల క్రితం యిది అంధకారబంధురమై మనుష్యసంచారం లేని దండకారణ్యమనే అడవి.

ఉత్తరాన అనంతగిరి కొండలలో కాఫీతోటలు కలవు. అనంతగిరి, ఉత్తర దక్షిణాలగల మరికొన్ని ప్రదేశాల చుట్టూగల ప్రదేశం అడవులతో నిండివున్నది. ఈ అడవులలో టేకు, వెదురు, లక్క, తేనె ఉత్పత్తి అవుతవి. అచ్చట కోదులు, సవరలు, గోడబులవంటి కొండజాతుల ప్రజలు నివసిస్తారు.

దక్షిణానికి వచ్చినకొలదీ తూర్పుగోదావరి జిల్లాలో అన్నవరపు సత్యనారాయణకొండ, డూమ్‌కొండ, పాపికొండలు ఉన్నవి. వీటియెత్తు 2,000- 4,000 అడుగుల మధ్యవుంటుంది. ఈ ప్రాంతంలోని అడవులలో కుంకుడుకాయలు, చింతపండు, తేనె వంటి వస్తువులు ఉత్పత్తి అవుతవి. కొండలుకాని మెట్టభూములుకాని లేని తాలూకాలు యీ జిల్లాలో మూడు ఉన్నవి. అవి రామచంద్రపురం, అమలాపురం, కాకినాడలు. వీటిలో మొదటి తాలూకాలో ప్రతి అడుగునేల సాగుచేయబడుతుంది. గ్రామాలలో యిళ్లగోడల ప్రక్కనే పైర్లు పెరుగతవి.

పశ్చిమ గోదావరి జిల్లాలో కొవ్వూరు, ద్వారకా తిరుమలల సమీపంలో చిన్న చిన్న కొండలు వున్నవి. చింతలపూడి, కొవ్వూరు తాలూకాలలోనివి మెట్టభూములు. మిగిలిన ప్రాంతంలోనివి మాగాణిభూములు. ప్రధానమైన పంట వరి.

కృష్ణా జిల్లాలో విజయవాడలోను, దాని చుట్టుపట్లను కొండలు వున్నవి. గుంటూరు జిల్లాలో గనికొండ, నాగా

ర్జునకొండ, బెల్లంకొండ, కొండపీడు, కోటప్పకొండ, వినుకొండ, చీమకుర్తి, మంగళగిరి, సీతానగరం, వుండవల్లి కొండలు వున్నవి. సహ్యాద్రికొండలు బొంబాయిరాష్ట్రం లోని ఔరంగాబాదునుండి ఆంధ్రప్రదేశ్‌లోని ఆదిలాబాద్ వరకూ విస్తరించివున్నవి. ఇక్కడ వీటికి నిర్మల లేక సత్నాల కొండలని పేరు. అక్కడి నుంచి ఆగ్నేయ దిశగా చీలిన శాఖకు కందికల్ గుట్ట అని పేరు. అవి యింకా ముందుకు సాగి, ఖమ్మంమెట్టు జిల్లాలో విడికొండలు - యెల్లండ్లపాడు, రాజ్‌గుట్ట, యెర్రకొండ, బూర్గంపాడు-గా యేర్పడుతవి.

ఉత్తర బాలఘాట్‌శ్రేణి వికారాబాదు ప్రాంతంలో అనంతగిరి కొండలుగా విస్తరిస్తుంది. దక్షిణ బాలఘాట్ శ్రేణి లేక గోల్కొండ వాటర్ షెడ్డు బొంబాయి రాష్ట్రపు బీడ్ జిల్లాలోని అష్టి నుండి నైరుతి, ఆగ్నేయ దిశలుగా నల్గొండకు చేరుతుంది. ఈ కొండలబారు హైదరాబాద్, మహబూబ్‌నగరం, నల్గొండ జిల్లాల గుండా పోతుంది. చివర చెప్పిన జిల్లాలో దేవరకొండ, భోనగిరి వంటి యితర కొండలు కూడా వున్నవి.

ఆదిలాబాద్, వరంగల్లుజిల్లాల్లో విస్తారమైనఅరణ్యాలు వున్నవి. ఇక్కడ మామూలుగా వుత్పత్తిఅయ్యే యితర పదార్థాలతోపాటుసిర్పూరుకాగితం మిల్లుల్లోతయారయే కాగితానికి తగిన వెదురు లభిస్తుంది.

కరీమ్‌నగర్, మహబూబ్‌నగర్, నిజామాబాదు,ఖమ్మం జిల్లాల్లో కూడా అడవులు వున్నవి. వాటిలో అధికభాగం లో చెట్లు ఆయా కాలాల్లో ఆకురాల్చి, చిగురించేవే. కాని యెప్పుడూ పచ్చగా వుండే అడవులు కూడా వరంగల్లు జిల్లాలోని ములుగు, నరసంపేటలలోను; ఆదిలాబాద్‌జిల్లా లోని మహాదేవపురంలోను; కరీంనగర్ జిల్లాలోని మన నూరులోను; మహబూబ్‌నగర్ జిల్లాలోని అమరాబాద్ లోను అక్కడక్కడ కనబడుతవి. ఈ చెట్ల సరాసరి యెత్తు 50 అ. మంచి గంధము, టేకు, నల్లచేవ, రేగు యిక్కడి రకాలలో కొన్ని. ఉత్తర మహబూబ్‌నగర్, హైద్రాబాద్ నల్గొండ, మెదక్ జిల్లాల్లోని చిత్తడినేలలో యెక్కువగా సీతాఫలం వంటి గిడసబారుచెట్లు పెరుగుతవి.

ఈ అడవుల నుండి కలప, వంటకట్టెలు కాక తేనె, లక్క, బంకలు, తోలు పదునుకు పనికివచ్చే బెరళ్లు, మైనము, పేము, ఓషధీ లతలు లభిస్తవి. కొన్ని మొక్కల నుండి బట్టలకు, బొమ్మలకు వేసే రంగులు తయారు చేయబడతవి.

కడప జిల్లాలో శేషాచలము, పాలకొండలు వున్నవి. కర్నూలు జిల్లాలో నల్లమలకొండలు వున్నవి. వీటిపొడుగు 70 మైళ్లు. వెడల్పు 25 మైళ్లు, ఎత్తు 3,000 అడుగులు. ఈ కొండలలో మిక్కిలి యెత్తైనశిఖరంపేరు బైరెనికొండ. దీని యెత్తు 3,150 అడుగులు. జంతు, వృక్షజాలము, రమణీయమైన ప్రకృతి దృశ్యాల విషయంలో నల్లమల అడవి దేశంలో మిక్కిలి సుందరమైన వాటిలో ఒకటి.

కర్నూలు, నెల్లూరుజిల్లాల సరిహద్దులలో వెలిగొండలు అనే కొండలున్నవి. నెల్లూరు జిల్లాలో వాటి మధ్య చిన్న చిన్న అడవులున్నవి. ఈ కొండ ప్రదేశానికి తూర్పున ఒక రైలుమార్గము, ట్రంకురోడ్డు నిర్మించబడినవి. ఈ ప్రాంతం లో వున్న మరొక కొండల వరుస యెర్రమలలు.

అనంతపురం జిల్లా మధ్యలో పెనుగొండ కొండలు- యెత్తు 3,191 అ. — మలకసిర, మల్లప్పకొండలు ఉన్నవి.

చిత్తూరుజిల్లాలోని మదనపల్లికి వాయవ్యంగా హార్సిలీ కొండలు ఉన్నవి. వాటి యెత్తు 4,100 అడుగులు. పూర్వం అవి యేనుగ యెల్లమ్మకొండ అని వ్యవహరింప బడేవి; అక్కడ నివసించిన యెల్లమ్మ అనే ఆమె యేనుగు లకు ఆహారం పెట్టడంవల్ల వాటికాపేరు వచ్చినదట. ఈ జిల్లాకుగల యెత్తైన పీఠభూమిలో కుప్పం డివిజను, మదనపల్లి, వాయల్పాడు తాలూకాలు చేరివున్నవి. ఈ పీఠభూమిని అంటివున్న ఆవులపల్లి కొండలు చంద్ర గిరి తాలూకాలో తిరుపతి వెంకటేశ్వర కొండలతో కలుస్తున్నవి. కాళహస్తి కార్వేటినగరాలు కొండ ప్రదేశంలో ఉన్నవి. పెద్దకొండ లన్నిటికి కనుమలున్నవి. వాటిలో మామండూరు, కల్లూరు, మొగలి, సైనగుంట కనుమలు యెక్కువ ప్రసిద్ధికెక్కినవి. ఆవులపల్లి, తిరుపతి కొండలపై అడవులున్నవి.

కొండ ప్రాంతాలలో సాధారణంగా పెద్దపులులు, చిరుతపులులవంటి అడవిమృగాలు చాలరకాలు కనబడతవి. బహుశా మైసూరు రాష్ట్రం తరువాత యెక్కువ రకాల అడవి జంతువులు, పక్షులు ఆంధ్రప్రదేశ్‌లో ఉంటాయి. వరంగల్లు జిల్లాలోని పాఖాల సరస్సు చుట్టూగల మహాట విలో కారెనుములు ఉన్నవి. అడవులలో అడవి పందులు బహుళంగా ఉన్నవి. ఎలుగుబంట్లు, సివంగులు, తోడేళ్లు, లేళ్లు, నక్కలు మొదలైనవి రాష్ట్రంలోగల యితర రకాల జంతువులు. రాష్ట్రంలో రకరకాల పక్షులు కూడా యెన్నో ఉన్నవి.

# నదులు

రాష్ట్రంలో ప్రవహించే మిక్కిలి పెద్దనది గోదావరి పశ్చిమ కనుమలలోని నాసిక్ సమీపంలోగల త్రియంబక కొండలలో జన్మించి, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, వరంగల్లు, ఖమ్మంమెట్టు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలగుండా ప్రవహిస్తున్నది. కూనవరంవద్ద శబరి ఉపనది కలుస్తున్నది. శబరి ద్వీపంలో పెరిగిన పొగాకు ప్రసిద్ధమైనది. ఈ నది భద్రాచలం ప్రక్కనుండి పాపికొండలగుండా ప్రవహిస్తుంది. అటుపిమ్మట దాని వెడల్పు హెచ్చి అనేక ద్వీపములు ఏర్పడతవి. 1852 లో యీ నదికి ధవళేశ్వరంవద్ద ఒక ఆనకట్ట నిర్మించబడింది. రాజమండ్రి వద్ద యీ నదిపై రైలువంతెన ఉన్నది. తుదిదశలో ఈ నది రెండుగా చీలి యేడుపాయలై సముద్రంలో కలుస్తుంది. ఈ యేడు పాయలకు సప్తగోదావరి అని పేరు. గోదావరి సాగునీటి సిస్టం దేశంలో మిక్కిలి పెద్దవాటిలో ఒకటి. ఈ నది, దాని కాలువలు పడవ ప్రయాణానికి ఉపయోగిస్తాయి.

800 మైళ్ళ పొడుగు గల కృష్ణానది పశ్చిమ కనుమలలోని మహాబలేశ్వర్ సమీపంలో జన్మిస్తుంది. దీనితో సతారావద్ద వేణి కలుస్తుంది. శ్రీశైలంవద్ద దీనికి పాతాళ గంగ అని పేరు. ఆ తరువాత ఈ నది నల్లమల కొండల లోయగుండా ప్రవహించి, నాగార్జునకొండ, యేలేశ్వరాలను, నాగార్జున సాగర్ ఆనకట్ట స్థలం సమీపానగల నందికొండ గ్రామాన్ని దాటి, యింకా తూర్పుకు ప్రవహించి ముక్త్యాల, ధాన్యకటక- అమరావతి - ప్రాచీనాంధ్ర రాజధాని- విజయవాడలను దాటి ఆ తరువాత మరి 40 మైళ్లు తూర్పుగా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తుంది. కృష్ణానది రమారమి 200 మైళ్లు గుంటూరు జిల్లాలో ప్రవహిస్తుంది. దీని కాలువలు సాగునీటి సౌకర్యాలను, రవాణా సౌకర్యాలను కూడా చేకూరుస్తవి.

బకింగ్‌హామ్ కాలువ కాకినాడనుంచి మద్రాసుకు ప్రవహిస్తున్నది.

తుంగ, భద్ర జంటనదుల సంగమమైన తుంగభద్ర అలంపూర్ సమీపానగల సంగమేశ్వర్ వద్ద కృష్ణానదితో కలుస్తున్నది, తుంగ, భద్ర జంటనదులు పశ్చిమ కనుమలలో మైసూరు రాష్ట్రపు ఉత్తర సరిహద్దులోగల గంగమూలవద్ద జన్మిస్తున్నవి. ఇక్కడ లోయ విశాలమై వుంటుంది. గట్లు యిసుకతో నిండివుంటాయి. తుంగభద్ర ప్రాజెక్టు రాయలసీమకు సాగునీటి సౌకర్యాలను కలిగిస్తుంది.

పెన్న లేక పినాకినీనది మైసూరు రాష్ట్రంలోని నందిదుర్గ కొండలలో జన్మించి, అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల గుండా ప్రవహించి, పశ్చిమ వెలిగొండలలోని సోమశిల కనుమ గుండా నెల్లూరు జిల్లాలో ప్రవేశిస్తుంది. ఇది ఉత్తర[illegible] ప్రవహించి, [illegible] కలుపుకొని, నెల్లూరు, [illegible] తాలూకాల సరిహద్దుగా ప్రవహించి, సముద్రంలో కలుస్తుంది. ఈనదికి డెల్టా యేర్పడుతుంది. దీని కాలువలు పరిసాగుకు నీటిని అందిస్తాయి. దీనిపై సముద్రానికి సమీపంలో ఒక ఆనకట్ట నిర్మించబడినది.

మధ్యప్రదేశ్‌లోని సాత్పూరా కొండలలో జన్మించిన పెన్‌గంగ, వమ్‌గంగ నదుల సంగమం ద్వారా యేర్పడిన ప్రాణహిత ఆదిలాబాదు జిల్లా తూర్పు సరిహద్దునే ప్రవహించి, ఆ జిల్లాలోనే చెన్నూరు సమీపంలో గోదావరితో కలుస్తుంది.

మంజీరానది బీడ్ జిల్లా పటోడాలోని బాలఘాట్ శ్రేణిలో జన్మిస్తుంది. ఇది నిజామాబాద్, నాందేడు జిల్లాల సరిహద్దుగా ప్రవహించి, నాందేడు జిల్లా కొండలవాడి సమీపంలో గోదావరితో కలుస్తుంది. ఈ నదిపై సాగునీటి ప్రయోజనాలకు, జల విద్యుచ్ఛక్తి వుత్పత్తినిమిత్తము నిజామ్‌సాగర్ ఆనకట్ట నిర్మిపబడింది. ఇది నిజామాబాద్ జిల్లాలో యెల్లారెడ్డికి 8 మైళ్ల దూరంలోవున్నది.

80 మైళ్ల పొడుగుగల మానేరు కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్ల కొండలలో జన్మిస్తుంది. ఇది అక్కడక్కడ చెదిరి వున్న కొండలు, రాతి ప్రదేశాలలో ప్రవహించేటప్పుడు రెండు ప్రక్కలనుండి వచ్చి అనేకమైన వాగులు దీనిలో కలుస్తవి. కరీంనగర్ పట్టణం యీ నది వుత్తరపు ఒడ్డున వున్నది. ఇది మహదేవపూర్ తాలూకాలో గోదావరితో కలుస్తుంది.

95 మైళ్ల పొడవుగల దిండినది లేక దండివాగు మహబూబ్‌నగర్ జిల్లాలోని సాహబాద్ కొండలలో పుట్టి, దక్షిణంగా అమరాబాద్, నందికొండ కొండలగుండా ప్రవహించి, యేలేశ్వరానికి దక్షిణాన కృష్ణతోకలుస్తుంది. దీనిపై గల చిన్న ప్రాజెక్టు నల్లగొండ జిల్లాలోని 14 గ్రామాలకు సాగుకు నీటిని సప్లయిచేస్తుంది.

మత్‌కల్ గుల్బర్గా జిల్లా యాద్గిర్ తాలూకా లోని గురుమత్‌కల్ కొండలలో పుట్టి, యెల్లప్పుడూ ప్రవహించే

వాగు. దీనినుండి పుట్టే జలపాతం 80అడుగుల ఎత్తునుండి పడుతున్నది. ఈ జలపాతానికి 10మైళ్ల దూరంలో వుండి ప్రముఖ వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి నొందుతున్న నారాయణపేట (మహబూబ్‌నగర్ జిల్లా) కు జల విద్యుచ్ఛక్తి సప్లై నిమిత్తం యీ జలపాతాన్ని వినియోగించు చున్నారు. 31 మైళ్లు ప్రవహించిన పిమ్మట యీ వాగు మక్తల్ వద్ద కృష్ణానదిలో కలుస్తున్నది.

157 మైళ్ల పొడవు గల మూసీనది అనంతగిరి కొండలలో పుట్టి, హైదరాబాద్, నల్లగొండ జిల్లాల గుండా ప్రవహిస్తుంది. ఇది హైదరాబాదు నగరం సమీపంలో వుస్మాన్‌సాగర్ చెరువులో ప్రవేశిస్తుంది. ఇక్కడ వరదలను అదుపుచేసే నిమిత్తము, మంచినీటి సప్లై నిమిత్తము ఒక ఆనకట్ట నిర్మించబడింది. మూసీ చిత్తూరు సమీపంలో ఆలేరును కలుపుకొని నల్లగొండ జిల్లాలోని వజీరాబాద్ సమీపంలో కృష్ణానదితోకలుస్తుంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అయిన హైదరాబాదు నగరం మూసీనది ఒడ్డున వున్నది.

92మైళ్లు నిడివిగల పాలేరు నల్లగొండ జిల్లా ఘనపూరు సమీపంలో పుట్టి, నల్లగొండ, ఖమ్మంమెట్టు జిల్లాల సరిహద్దుగా ప్రవహించి; జగ్గయ్యపేటకు దక్షిణాన కృష్ణానదితో కలుస్తుంది. పాలేరు ప్రాజెక్టు ఖమ్మంజిల్లాలోని కొంత ప్రాంతానికి సాగునీటి సప్లైచేస్తుంది.

120 మైళ్లు గల మునేరు వరంగల్లు జిల్లాలోని పాఖాల్ చెరువులో పుట్టి, కృష్ణాజిల్లాలో కృష్ణానదితో కలుస్తుంది.

విశాఖపట్నం జిల్లాలో అనేకమైన చిన్నచిన్ననదులు ప్రవహిస్తున్నవి. వీటిలో బాహుదానది పెద్ద కిమిడిమాలు పాలలో పుట్టి, యిచ్ఛాపురం తాలూకా నుండి కొంత దూరంలో సముద్రంలో కలుస్తుంది. మహేంద్ర పర్వతంలో పుట్టిన మహేంద్ర తనయ బారువ వద్ద సముద్రంలో కలుస్తుంది. అదేకొండలలో పుట్టిన మరొక మహేంద్ర తనయ పాతపట్నం తాలూకాలో వంశధారా నదితో కలుస్తుంది.

నిమ్మగిరి కొండలలోని వెదురు పొదలలో పుట్టి, తద్వారా ఆ పేరుపొందిన వంశధార దక్షిణంగా గుణుపురం తాలూకాగుండా ప్రవహించి, తరువాత తూర్పుకు తిరిగి, కళింగపట్నం వద్ద సముద్రంలో కలుస్తుంది. 115 మైళ్ళ పొడవుగల నాగావళి లేక లాంగుల్యకు స్వర్ణముఖి, వేగావతి, కుంభికోట గడ్డవంటి వుపనదులున్నవి. నిమ్మగిరి కొండలలో పుట్టిన యిది దక్షిణగాం పార్వతీపురం, పాలకొండ తాలూకాలగుండా ప్రవహించి మోపాన్‌బందేర్ వద్ద సముద్రంలో కలుస్తుంది. వంశధారపై త్వరలో సాగునీటి ప్రాజెక్టు నిర్మింపబడగలదు.

చంపావతి గజపతినగరం తాలూకాలోని ఆంధ్ర కొండలలో పుట్టి, విజయనగరం, భీమునిపట్నం తాలూకాలగుండా ప్రవహించి కోనాడవద్ద సముద్రంలో కలుస్తుంది.

గోస్తని, గోస్తనాలవంటి రాళ్ళగుండా ఒక వాగువలె ప్రవహిస్తుంది. శృంగవరపుకోట తాలూకాలోని కాశీపురం కొండలలో పుట్టి, భీమునిపట్నం తాలూకా గుండా కూడా ప్రవహించి, భీమునిపట్నంవద్ద సముద్రంతో కలుస్తుంది. పశ్చిమ గోదావరి జిల్లాలో మరొక గోస్తని ఉన్నది. ఈ నది కొంతభాగం కాలువగా సాగునీటి సప్లై నిమిత్తం ఉపయోగించబడుతున్నది.

శారద- 45 మైళ్ళు- వీరవల్లి తాలూకా మాడుగులలో పుట్టి, అనకాపల్లి, సర్వసిద్ధి తాలూకాలగుండా ప్రవహించి, వల్లాడవద్ద సముద్రంతో కలుస్తుంది.

వరాహ గోలుకొండలో పుట్టి సర్వసిద్ధి తాలూకా గుండా ప్రవహించి వల్లాడవద్ద సముద్రంలో కలుస్తున్నది.

ఖాండవనది కూడా గోలుకొండలో జన్మించి, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల సరిహద్దుగా ప్రవహించి, పెంటకోటవద్ద సముద్రంలో కలుస్తుంది. కృష్ణార్జునుల కృషివల్ల దహనమైపోతున్న ఖాండవ వనాన్ని రక్షించడానికి ఇంద్రుడు సృష్టించిన వర్షంవల్ల ఈ నది పుట్టినదని పూర్వగాథ.

ఈ ప్రాంతంలో ఇంద్రావతి, చిట్టివలస యేరు, కొలాబ్ నది, మాచేరులు కూడా ఉన్నవి.

తూర్పు గోదావరి జిల్లాలో ఏలేరు, తాండవ నదులు ఉన్నవి.

కృష్ణాజిల్లాలో భయంకరమైన కొండవాగుల కూడలియై, యిప్పుడు సమస్యగావున్న బుడమేరు ఉన్నది. ఇది మిక్కిలి ఉపయోగకారి కాగల అవకాశా లున్నవి.

గుంటూరు జిల్లాలో చరిత్రాత్మకమైన చంద్రవంక, నాగులేరు నదులు, యెత్తిపోతల జలపాతాలు ఉన్నవి. పాలేరు చిత్తూరు, నెల్లూరు జిల్లాలగుండా ప్రవహిస్తున్నది.

పులికాట్ వద్ద సరస్సు నెల్లూరు జిల్లా సరిహద్దులో ఉన్నది.

సర్వసిద్ధి తాలూకాలోని కొండకర్ల గ్రామం సమీపంలో గల కొండకర్ల ఆవలో నీరు యెల్లప్పుడు

ఉంటుంది. అందుచేత అక్కడ వేలాది నీటిపక్షులు నివసిస్తాయి. దీనికి నీరు శారదా నదినుండి ఒక పెద్ద కాలవ ద్వారా వస్తుంది. ఇది బోటుషికారు కేంద్రం. గోలుకొండ తాలూకాలోని వరాహానదిశాఖ అయిన కొమరవోలు ఆవ యీ 'ఆవ'తో కలుస్తుంది.

జయపూరు సమీపంలో దమయంతి సరస్సు, జగన్నాథ సాగరం ఉన్నాయి. నీటినిండా తామర పద్మాలు మొదలైనవి వుండి, మనోహరంగా ఉంటుంది.

సోంపేట సమీపంలోగల జలంతపర విస్తార ప్రదేశం లోని పైర్లను పోషిస్తుంది.

పశ్చిమగోదావరి జిల్లాలో కొల్లేటి సరస్సు ఉన్నది.

పాతపట్నం తాలూకాలో అసురుల సాగరం, తదితరమైన ప్రాచీనకాలపు చెరువులు ఉన్నాయి.

పశ్చిమ గోదావరి జిల్లాలోని కొల్లేరు చరిత్రాత్మకమైన సరస్సు. ఆంధ్రకోస్తాలో సహజసిద్ధమైన పెద్ద మంచినీటి జలాశయం యిదొక్కటే. స్థూలంగా అండాకారంలో వుండి, మెరకగా నున్న యీ పెద్ద సరస్సు మొదట బంగాళాఖాతంలో ఒక భాగం.

దీని కిరుప్రక్కలను మహానదులైన గోదావరి, కృష్ణలు సముద్రంలోనికి చొచ్చుకొని పోవునపుడు ఒకదాని దక్షిణపు చివర మరొకదాని వుత్తరపు కొనతో కలుస్తుంది. ఆ విధంగా యేర్పడిన భూభాగం కొల్లేటిని సముద్రపు నీటి నుండి విడదీస్తుంది. ఈ సరస్సులోనికి ప్రవహించే వాగులవల్ల దాని నీరు తేరుకుంటుంది. కాని అవి తీసుకొని వచ్చే మడ్డివల్ల యిది త్వరితంగా మెట్టవేసి పోతున్నది. కొంత కాలాని కిది అదృశ్యం కాకతప్పదు. కొల్లేరు సరస్సు వైశాల్యం యెక్కువగా మారుతూ వుంటుంది. వర్షాకాలంలో అది 100 చ.మైళ్లను మించిపోతుంది. వర్షాలు లేని కాలంలో అది బాగా తగ్గిపోతుంది. ఒక్కొక్కప్పుడు అది పూర్తిగా యెండిపోతుంది కూడా. 1900 సం. లో బొత్తిగా వర్షాలు లేనప్పుడు యిలాగే జరిగింది. దీన్ని బాగుచేసి, గట్లు వేయడంతో సహజంగా దీని పరిమాణం తగ్గుతున్నది.

దీనికి వుత్తరాన రమారమి 20-25 మైళ్ళ అవతల మార్గ్యరమములు చెందిన యత్తుప్రదేశాలున్నవి. అక్కడి నుండి మూడు కొండవాగులగుండా యీ సరస్సుకి నీరు వస్తుంది. వాటిలో ఒకటి బుడమేరు. ఈ సరస్సులోని నీరు పరెంటలు ఆవ, జ్యూయర్ ఆవ అనే రెండుమార్గాల ద్వారా బయటికి పోయి వుప్పుటేరుతో కలుస్తుంది. అది సముద్రంతో కలుస్తుంది.

కొల్లేరు ద్వీపాలలో ఒకదాని కోటను వశపరచుకొనడానికి ప్రయత్నిస్తున్న ఒకానొక సైన్యము యీ సరస్సును ఖాళీ చేసే నిమిత్తము వుప్పుటేరును త్రవ్వినదని, నీటి లోతు వల్ల దానికి ఆటంకం కలిగినదని, తన వుద్యమ విజయానికై తన కూతురును బలియిచ్చిన సేనాని కూతురి పేరు పరెంటలు ఆవకు వచ్చినదని స్థానిక గాథ.

కొల్లేరులో చేపలు బాగా వుంటాయి. అన్నిరకాల నీటి పక్షులు కూడా యెక్కువగా వుంటాయి. ఒకప్పుడు యిక్కడ పక్షులు, చర్మాల యెగుమతి వ్యాపారంసాగేది.

ఈ సరస్సులో సారవంతమై, బాగా సాగుచేయబడే ద్వీపాలు చాలవున్నవి. ఇవి 26 గ్రామాలలో చేర్చబడినవి.

సముద్రగుప్తుడు దక్షిణదేశ దండయాత్రకై వచ్చునపుడు ఆంధ్ర రాజులందరూ యేకమై యీ కొల్లేరు ఒడ్డున అతని నెదిరించారనీ, ప్రసిద్ధమైన ఆ యుద్ధంలో అతడు వెనుకకు తరుమబడినాడనీ చరిత్ర గాథ.

# గర్వకారణమైన చరిత్ర ఉజ్వలమైన భవిష్యత్తుగల రాష్ట్రం

చరిత్రకు పూర్వకాలంనుంచే ఆంధ్రజాతి కలదని చరిత్రకారు లంటారు. చరిత్రకు పూర్వమూ, చరిత్ర మొదలైన తొలికాలంలోను ఆంధ్రులు భారతదేశంలో వున్నారు. వీరు రాజ్యాలు, సామ్రాజ్యాలు నెలకొల్పి, ఈ దేశంలో ముస్లిముల పరిపాలన ఏర్పడిన తరువాత కూడా పెద్ద పెద్ద భూభాగాలను పరిపాలించారు. జాతీయోద్యమంలో ఆంధ్రులు ప్రముఖపాత్ర వహించి పూర్వం ఒకప్పు డున్నవిధంగా తిరిగి తమ రాష్ట్రాన్ని సాధించుకున్నారు.

ఆంధ్ర శబ్దం బహు ప్రాచీనమైనది. క్రీస్తుకు పూర్వం వెయ్యి సంవత్సరాల నాటిదని చెప్పబడు ఐతరేయ బ్రాహ్మణంలో ఆంధ్రుల ప్రస్తావన వున్నది. ఆ కాలంలో ఆంధ్రులు వింధ్యకు దక్షిణమున గల ప్రాంతంలో నివసించెడివారు. చంద్రగుప్త మౌర్యుడు ఉత్తర దేశమును పరిపాలిస్తున్నప్పుడు దక్షిణదేశంలో ఆంధ్రులకు ప్రత్యేకరాజ్యం వుండేది. ఆ రాజ్యానికి 30 కోటలు, ఒకలక్ష పదాతి సైన్యం, రెండు వేల ఆశ్విక బలం వుండేది. అశోకుని శాసనాలలో ఆంధ్రుల ప్రసక్తి కలదు. ఆ తరువాత శాతవాహన వంశం అధికారానికి వచ్చింది. ఈ వంశానికి మూలపురుషుడైన సిముకుడు క్రీ. పూ. 225 లో తన రాజ్యాన్ని స్థాపించాడు. ఈ వంశం వారు దాదాపు 450 ఏండ్లు అవిచ్ఛిన్నంగా పరిపాలన చేసి చరిత్ర ప్రసిద్ధి పొందారు. వీరి రాజ్యం పడమటి అరేబియా సముద్రం వరకు వ్యాపించి వుండేది. అందులో హైద్రాబాదు, విదర్భప్రాంతా లుండేవి. ఆ విదర్భయే నేటి బెరారు. వీరి రాజధాని కొంతకాలం గుంటూరు జిల్లాలోని ధాన్యకటకంలో వుండేది. ఈ వంశంవారు బాగా ప్రాబల్యం సంపాదించి బలవంతులై మగధపై దండయాత్ర చేసి పాటలీపుత్రమును జయించారు. ఈ వంశ రాజులలో గౌతమీపుత్ర శాతకర్ణి సుప్రసిద్ధుడు. ఈతడు మహారాష్ట్ర, ఉత్తరకొంకణ, గుజరాతు, కాథియావార్, మాళ్వ ప్రాంతాల వరకు తన అధికారాన్ని విస్తరింప జేసుకున్నాడు.

క్రీ. శ. మూడవ శతాబ్దంలో శాతవాహనుల పరిపాలన అంతరించింది. ఆ తరువాత పల్లవులు బళ్లారి, అమరావతి. కాంచీపురముల మధ్యగల దేశాన్ని పాలించారు. శాతవాహనులకు ఇక్ష్వాకు వంశజులు సామంతులుగా వుండేవారు. కాని తరువాత వారు స్వతంత్రులై నాగార్జున కొండ లోయలోని విజయపురిని రాజధానిగా చేసుకొని కృష్ణా గోదావరి నదులు ప్రవహించే ప్రాంతాన్ని పరిపాలించారు. మచిలీపట్నం ప్రాంతాన్ని బృహత్పలాయనులు పరిపాలించేవారు. ఏలూరునకు సమీపమున గల వేంగి శాలంకాయనులకు రాజధానిగా వుండేది. తరువాత విష్ణుకుండినులు క్రీ. శ. 260 నుంచి 610 వరకు పరిపాలించారు. వారి రాజధాని లెందులూరు- దెందులూరు. అది వేంగికి సమీపంలో వుండేది. పల్లవ రాజులలో ఒకడైన మహేంద్రవర్మన్ చాళుక్యరాజగు రెండవ పులకేశిచే ఓడింపబడి కాంచీపురం పారిపొయ్యాడు.

గోదావరి మహానదుల మధ్య దేశాన్ని తూర్పు గంగులు కూడా పరిపాలించారు. ఈ వంశ రాజులలో ఒకడైన అనంతవర్మ చోడ గంగ దేవుడు 60 ఏండ్ల పాటు ఏకచ్ఛత్రాధిపత్యంగా పరిపాలించి ఉత్కళమును జయించి తన రాజధానిని ముఖలింగమునుంచి కటక్‌కు మార్చుకున్నాడు.

క్రీ. శ. 615 లో రెండవ పులకేశి మహేంద్రవర్మన్‌ను ఓడించడంతో వేంగి ప్రాంతములో చాళుక్యుల రాజ్యం ఏర్పడింది. చాళుక్యులలో పశ్చిమ చాళుక్యులని తూర్పు చాళుక్యులని రెండు శాఖలు వుండేవి. తూర్పు చాళుక్యులలో ఒకరాజు వేంగిని వదలి గోదావరి తీరంపై వేరొక రాజధానినినెలకొల్పాడు. అదే రాజమహేంద్రవరమని వ్యవహరింపబడుతున్నది.

నన్నయ భట్టారకుడు రచించిన ఆంధ్ర మహా భారతం తూర్పు చాళుక్య రాజైన రాజరాజ నరేంద్రునికి అంకిత మివ్వబడింది. ఈయన క్రీ. శ. 1022 నుంచి 1063 వరకు పరిపాలన చేశాడు. ఈయన కుమారుడు చోళ రాజులకు మేనల్లుడగుటచేత అతడు కులోత్తుంగచోళుడై చోళరాజ్య సింహాసన [illegible] ప్రభు త్వం చేశాడు.

చాళుక్యుల పతనం తరువాత ఓరుగల్లు కాకతీయులు ప్రాముఖ్యానికి వచ్చారు. ఈ వంశ రాజులు రెండున్నర శతాబ్దాల పాటు బలీయమైన సామ్రాజ్యాన్ని పరిపాలించారు. వీరి కాలంలో వ్యాపార వాణిజ్యాలలో, సాహిత్యంలో, లలిత కళలలో ఇంకా అనేక ఇతర రంగాలలో ఆంధ్రుల ప్రతిభ వెల్లడైంది. క్రీ. శ. 1323 లో మహమ్మదీయ రాజులు కాకతీయులను జయించారు. అయితే వారు ఆంధ్రదేశాన్ని తమ ఏలుబడిలో ఉంచుకో లేకపోయ్యారు. కృష్ణానది ప్రాంతంలో రెడ్డి ప్రభువుల రాజ్యములు వెలిశాయి. అదే కాలంలో అంటే క్రీ. శ. 1336 లో విజయనగర సామ్రాజ్యం స్థాపించబడింది. క్రీ. శ. 1347 లో అలావుద్దీన్ హసన్ షాహ గంగూ బహమనీ అను నాతడు బహమనీ రాజ్యాన్ని స్థాపించాడు. దినదిన ప్రవర్ధమానమై పేరు ప్రఖ్యాతులు పొందుతున్న విజయనగర రాజ్యంపై బహమనీ రాజులు అనేకమార్లు దండెత్తారు. విజయనగర రాజులలో కృష్ణదేవరాయలు వాసికెక్కినవాడు. ఈయన క్రీ. శ. 1509 నుంచి 1530 వరకు పరిపాలన చేశాడు. ఈయన పరిపాలనలో ఆంధ్రుల రాజకీయ సాహితీ ప్రతిభ మధ్యందిన మార్తాండునివలె ప్రకాశించింది. 1566 లో జరిగిన తల్లికోట యుద్ధంలో మహమ్మదీయ రాజులంతా ఏకమై విజయనగర రాజు రామరాయలను ఓడించి అతడిని చంపివేశారు. విజయనగర రాజుల వంశంలో మిగిలినవారు అచ్చటచ్చట తమ రాజ్యములను నెలకొల్పుకొని పరిపాలన చేశారు. వారిలో చంద్రగిరిని ఏలిన వెంకటపతిరాయలు సుప్రసిద్ధుడు. గోలకొండ మహమ్మదీయ ప్రభువులు ఆంధ్రదేశంలోని పెద్ద ప్రాంతాలను ఆక్రమించుకున్నారు. దక్షిణ భారతంలో తమ వ్యాపారమును సువ్యవస్థితం చేసుకొన్న బ్రిటిషువారు, ఫ్రెంచివారు తరచు రాజకీయాలలో జోక్యం కలిగించుకోవడం మొదలుపెట్టారు. అంతటితో ఆంధ్రుల రాజకీయ స్వాతంత్ర్యం క్షీణించింది.


గోలకొండ రాజ్య స్థాపకుడు సుల్తాన్ ఖులీ ఖుతుబుల్ముల్కు. ఇతడు బహమనీ రాజుల కాలంలో గవర్నరుగా వుండి తరువాత స్వతంత్రుడైనాడు. ఖుతుబ్‌షాహీ వంశం 1512 నుంచి 1687 వరకు గోలకొండ రాజ్యాన్ని పరిపాలించింది. పారశీకరాజు షాహ అబ్బాస్ 1603 లో విలువైన కానుకలిచ్చి తన రాయబారిని హైద్రాబాదు పంపాడు. మొగలు యువరాజు షాజహాన్ తన తండ్రిపై తిరుగుబాటు చేసి బుర్హాన్‌పూర్ నుంచి పారిపోయి గోలకొండకు [illegible] ఖుతుబ్‌షా అతడికి స్వాగతమిచ్చాడు. షాజహాను చక్రవర్తి అయినతరువాత గోలకొండకు [illegible] పంపాడు. పెద్ద మసీదులో చక్రవర్తి పేరిట ఖుత్బా చదువబడింది. ఆయన పేరుతో నాణెములు ముద్రించబడినవి. 1655 లో ఔరంగజేబు గోలకొండపై దండెత్తి దోచుకున్నాడు. కాని అబ్దుల్లా సంధిచేసుకొని తాత్కాలికంగా సంకటస్థితి నుంచి బైటపడ్డాడు. 1674 లో అబ్దుల్లా మేనల్లుడు అబుల్ హసన్ రాజ్యానికి వచ్చాడు. ఇతడే తానాషా. ఈయన కాలంలో రామదాసు కథ జరిగింది. భద్రాచలమునకు తహశీల్దారైన గోపన్న అచ్చట రామాలయమును నిర్మింపడానికై ప్రభుత్వ పన్ను మొత్తమును వ్యయపరచగా అందుకు తానాషా కోపించి, అతడిని కారాగారంలో బంధించాడనీ, అప్పుడు శ్రీరాముడు తానాషాకు కలలో కన్పించి, గోపన్న ఖర్చు పెట్టిన మొత్తాన్ని చెల్లించి అతడిని విడుదల చేయించినాడనీ ఒక గాథ ప్రతీతిలో వున్నది. 1687 లో ఔరంగజేబు గోలకొండను వశపరచుకొని తానాషాను దౌలతాబాదులో నిర్బంధంలో వుంచాడు. తానాషా అచ్చటనే 1704 లో మరణించాడు. ఈ విధంగా గోలకొండ ఖుతుబ్‌షాహీ రాజ్యం అంతరించింది. ఆంధ్రప్రాంతం మొగలు సామ్రాజ్యంలో అంతర్భాగమైపోయింది.

ఔరంగజేబు సేనాపతులలో ఒకడగు అసఫ్‌జా 1713 లో నిజాముల్ముల్కు బిరుదుతో దక్కన్ సూబేదారుగా నియమింపబడ్డాడు. ఇతడు స్వతంత్రుడై హైద్రాబాదును కేంద్రంగా చేసుకొని అసఫ్‌జాహీ వంశ రాజ్యాన్ని నెలకొల్పాడు. ఇతడు మరణించిన తరువాత ఈయన రెండవ కుమారుడు నాసిర్ జంగుకూ, ఆయన కుమార్తెయొక్క కుమారుడగు ముజఫర్ జంగుకూ రాజ్యాధిపత్యం విషయములో పేచీవచ్చింది. నాసిర్‌జంగును ఆంగ్లేయులు బలపరచగా ముజఫర్ జంగును ఫ్రెంచివారు సమర్థించారు. అనేక సంఘటనలు జరిగిన తరువాత సలాబత్‌జంగ్ నిజాం అయినాడు. ఇతడు ఆంధ్ర ప్రాంతంలో ఉత్తర సర్కార్లు అని వ్యవహరింపబడు నాలుగు జిల్లాలను ఫ్రెంచి వారికి ఇచ్చివేశాడు. కాని బ్రిటీషువారు వెంటనే ఫ్రెంచివారి నుండి జయించుకొని వాటినిస్వాధీనపరచుకున్నారు. 1800లో నిజాముకూ, బ్రిటీషువారికీ కొత్తగా సంధి జరిగింది. ఆ సంధి

ఫలితంగా నిజాం సర్వీసుకు కేటాయింపబడిన సహాయక సైన్యం హెచ్చించబడింది. అందుకుగాను దత్తమండలాలని వ్యవహరింపబడే జిల్లాలను నిజాం బ్రిటీషువారికి ఇచ్చి వేశాడు. ఈ విధంగా 11 జిల్లాలతో కూడిన పూర్వ ఆంధ్ర రాష్ట్రం పరిపాలనార్థం మద్రాసు రాష్ట్రంలో కలిసిపోయి 1953 అక్టోబరు 1 వ తేదీన ఆంధ్రరాష్ట్రం ఏర్పడేవరకు అలాగే ఉండిపోయింది. తెలంగాణా అని వ్యవహరింపబడు తొమ్మిది తెలుగు జిల్లాలు హైదరాబాదు రాష్ట్రంలో ఉండిపోయాయి.

భారత జాతీయ కాంగ్రెసు సంస్థ ఏర్పడ్డంతో బ్రిటీషు వారి హయాంలో జాతీయోద్యమం ఆంధ్ర జిల్లాలకు తీవ్ర గతిని వ్యాపించింది. కాని తెలంగాణా ప్రాంతంలో జాతీయోద్యమ ప్రభావం అంత ఉధృతం కాలేదు. మాంటేగు-ఛెమ్సుఫర్డు సంస్కరణలకు వ్యతిరేకంగా ప్రారంభమైన అసహాయోద్యమంలో ఆంధ్రులు మహోజ్జ్వలమైన పాత్ర వహించారు. 1935 సంవత్సరపు భారత ప్రభుత్వపు చట్టమునుసరించి కాంగ్రెసు మద్రాసులోను, ఇతర రాష్ట్రాలలోను మంత్రివర్గాలు ఏర్పాటుచేసింది. మద్రాసులో శ్రీ చక్రవర్తి రాజగోపాలాచారి అధ్వర్యం క్రింద ఏర్పడిన మంత్రివర్గంలో ముగ్గురు మంత్రులు, నలుగురు పార్లమెంటరీ కార్యదర్శులు ఆంధ్రులు. 1939 లో రెండవ ప్రపంచ యుద్ధం ఆరంభం కావడంతో కాంగ్రెసు మంత్రివర్గాలు రాజీనామా చేశాయి. 1942 లో సకల భరతవర్షంలో పెద్ద పెట్టున క్విట్టిండియా ఉద్యమం మొదలైంది. ఇంగ్లండులోని చర్చిల్ ప్రభుత్వం క్రిప్సు రాయబారం పంపింది. కాని ప్రయోజనం లేకపోయింది. యుద్ధానంతరం ఇంగ్లండులో జరిగిన ఎన్నికలలో కన్సర్వేటివ్ పక్షం ఓడిపోయి అట్లీ అధ్వర్యాన లేబర్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తరువాతనే 1947 ఆగస్టు 15 వ తేదీన భారతదేశానికి అధికారం మార్పిడి జరిగింది. స్వతంత్ర భారత ప్రభుత్వం అనేక దేశీయ సంస్థానాలను నూత్న జాతీయ వ్యవస్థలో లీనం చేయగలిగింది. కాని హైద్రాబాదుపై 1948 సెప్టెంబరులో పోలీసుచర్య జరుపవలసివచ్చింది. ఆ తరువాత కొంతకాలం మిలిటరీ ప్రభుత్వం అధికారంలో ఉండి, సివిలు అధికారులతో. స్థానిక రాజకీయ నాయకులతో కూడిన మధ్యమ ప్రభుత్వం ఏర్పడింది. చివరకు 1952 ఫిబ్రవరిలో సంపూర్ణ ప్రజా ప్రాతినిధ్యం గల ప్రభుత్వం ఏర్పాటైంది.

ఈలోగా మద్రాసు రాష్ట్రంనుంచి ఆంధ్ర జిల్లాలను వేరు చెయ్యాలనే ఉద్యమం తీవ్రమైంది. శ్రీ పొట్టి శ్రీరాములు గారి పూర్ణ త్యాగం తరువాత ఇక ఈ విషయంలో జాప్యం చేయడానికి వీలు లేకపోయింది. వెంటనే భారత ప్రధాన మంత్రి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేయబడుతుందని ప్రకటించారు. ఈ రాష్ట్రం 1953 అక్టోబరు 1 వ తేదీన ఏర్పడింది. ఆ తరువాత తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నిటినీ ఏకంచేసి విశాల రాష్ట్రాన్ని ఏర్పాటుచేయాలనే ఉద్యమం ఆంధ్ర తెలంగాణాలలో ఆరంభమైంది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సంఘాన్ని నియమించింది. ఆ కమీషన్ వారు తెలంగాణా జిల్లాలను ఐదేళ్ళవరకు హైద్రాబాదు రాష్ట్రంగా ఉంచాలనీ, ఆ తరువాత అవి కొన్ని షరతుల ప్రకారం ఆంధ్రరాష్ట్రంలో కలిసిపోవచ్చుననీ సిఫారసు చేశారు. అయితే ఆ సిఫారసు అందరికీ సంతృప్తికరమైనది కాకపోవడంచేత అనేక పర్యాయాలు ఈ విషయాన్ని క్షుణ్ణంగా చర్చించినమీదట చివరకు హైద్రాబాదు రాజధాని నగరంగా ఆంధ్ర తెలంగాణాలతో కూడిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు చేయడానికి నిర్ణయించబడింది.



# ★ ఆంధ్రప్రదేశ్ జనాభా ★

●

ఆంధ్రప్రదేశ్‌లోని ఇరవై జిల్లాల జనాభా 322 లక్షలు. మూడు జిల్లాల్లో తప్ప మిగిలిన అన్ని జిల్లాల్లో స్త్రీలకంటె పురుషులే ఎక్కువగా ఉన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రతి 1054 మంది స్త్రీలకు 1000 మంది, విశాఖపట్నం జిల్లాలో 1031 మంది స్త్రీలకు 1000 మంది, నిజామాబాదు జిల్లాలో 1021 మంది స్త్రీలకు 1000 మంది పురుషులున్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో అక్షరాస్యులు నూటికి 15 మంది ఉన్నారు. అయితే పురుషులలో 22శాతం మంది అక్షరాస్యులున్నారు. మూడుకోట్ల ఇరవై రెండు లక్షల జనాభాలో 66.9 శాతం మంది వ్యవసాయం పైన ఆధారపడివున్నారు. 1941-51 మధ్య జనాభా 13.88 శాతం పెరిగింది.


దక్షిణాపథం ఒకప్పుడు దట్టమైన కారడవులతో నిండి ఉండేది. ఈ ప్రాంతమంతా అనేక తెగల కొండజాతుల ప్రజలకు నిలయమై ఉండేది. ఇది చరిత్ర కందని రోజుల నాటి మాట. నేటికికూడా ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని అడవుల ప్రాంతాలలో కొండజాతులవారు నివసిస్తున్నారు. ఇప్పటికీ వారు పురాతన పద్ధతులనే అవలంబిస్తున్నారు. అయితే మధ్యభారతం నుంచీ, ఇతరచోట్ల నుంచి ప్రజలు ఇక్కడికి రావడంతో కాలక్రమేణా ఈ కొండజాతుల ప్రజలకు వారితో సంబంధం ఏర్పడింది. తత్ఫలితంగా కొన్ని తెగలవారు పాతపద్ధతులకు స్వస్తిచెప్పి, నాగరిక జీవనానికి అలవడి పోయినారు. అయినా మిగిలిన తెగలవారు మాత్రం నాగరిక ప్రపంచానికి దూరంగా ఉన్నారని చెప్పక తప్పదు. వీరే చెంచులు, భిల్లులు, కోయలు, కొండ రెడ్లు, గోండులు, ప్రధానులు, తోటీలు, సవరులు, ఎరుకలు, దొమ్మరులు, ఏనాదులు, లంబాడీలు. వీరు ద్రవిడజాతికి చెందినవారని చెప్పుటకు నిదర్శనము ఉంది. వీరిలో కొంతమంది ఉత్తర హిందూదేశము నుంచి వలసవచ్చినవారి సంతతియై ఉండ వచ్చును. ద్రవిడజాతికి చెందినవారు నల్లని శరీరఛాయగల వారు, మరుగుజ్జులు, పెద్దదవడలు, విశాలమైన ఛాతీ, చప్పిడి ముక్కు, చిన్నపాలం గలవారు. మరికొంతమంది గోధుమ వర్ణ శరీరులు, కోలముఖులు. బహుశా వీరు మధ్యభారతం నుంచి వలసవచ్చినవారై ఉండవచ్చును. ఈ కొండజాతు లలో కొంతమంది దేశద్రిమ్మరులుగా ఉన్నారు. అందుకనే వారికి శాశ్వతమైన నివాసస్థానాలు లేవు. ఒంటిమింటి పుట్ట, తాటియాకులు, వెదుళ్లతో నిర్మించిన గుడిసెలు, పూరిండ్లలో నివసిస్తారు. చాపలు, బుట్టలు, కుండలు ఇవే వారు తమ గుడిసెలలో ఉపయోగించే సామగ్రి.

గోండులు గోండీ అనే భాష మాట్లాడుతారు. వీరిది ప్రగతి చెందిన జాతి. ఇతర కొండజాతులవారికన్నా ఆకర్షణీయ మైన ఆభరణాలు, దుస్తులు ధరిస్తారువీరు. వ్యవసాయమే వీరి ప్రధానవృత్తి. విడాకులిచ్చుకోవడానికి, వితంతువివాహం చేసుకోవడానికి వీరి సంఘఆచారం అనుమతిస్తుంది. కొండ రెడ్లు తెలుగు మాట్లాడుతారు. వీరు కూడా ఒకవిధమైన దేశ ద్రిమ్మరులని చెప్పవచ్చును. ఒక ప్రదేశంలో కొంతకాలం పాటు సేద్యం చేసినతరువాత భూమి సారవంతంగా లేనట్ల యితే ఇంకోచోటికి వలసపోయి అక్కడ కొత్తగా సేద్యం ఆరంభిస్తారు. వీరు బుట్టలు అల్లుతారు. పశువులను పెంచు తారు.

కోలములు మాట్లాడే భాషను కొలమ తెలుగు అని అం టారు. అయితే వీరు గోండుల ఆచార వ్యవహారాలను ఎక్కువగా పాటిస్తారు. వీరు గోండీ, తెలుగు భాషలు కూడా మాట్లాడుతారు. కోలములు నాటురకం పద్ధతులతో సేద్యంచేస్తారు. కందమూల ఫలములను కూడా ఆహారంగా తీసుకొంటారు.

భిల్లులలో చాలమంది హిందూమతానికి చెందినవారు. అయితే కొంతమంది ఇస్లాంమతాన్ని స్వీకరించినవారున్నారు వీరు మాట్లాడే భాషను భిల్లీభాష అని అంటారు. వేట వీరి ప్రధాన వృత్తి. అయినా కొంతమంది వ్యవసాయదారులు గాను, వాచ్‌మెన్‌లుగాను ఉన్నారు. వీరు సాధారణంగా దుబారా ఖర్చుకు అలవాటుపడినవారు. వినోదాలంటే మక్కువ ఎక్కువ వీరికి.

చెంచులు ఆదిమవాసులు, బీదవారు. వీరు ఎక్కువగా మహబూబునగరు జిల్లాలో దక్షిణంగాఉన్న కొండ ప్రాంతా లలోను, కర్నూలుకు ఉత్తరంగా ఉన్న ప్రాంతాలలోను నల్లమల కొండల ప్రాంతాలలోను నివసిస్తున్నారు. ఇటీవలి వరకు వీరు ఆకులను దుస్తులుగా ధరిస్తూఉండేవారు. అడవి దుంపలు, పండ్లు, పక్షులు, జంతువులు, తేనె మున్నగువాటిని



కేరళరాష్ట్ర గవర్నరుగా నియమితులైన డా. బి. రామకృష్ణారావుగారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో స్నాతకోపన్యాస మిస్తున్న దృశ్యం. విశ్వవిద్యాలయ ఛాన్సలర్ శ్రీ యస్. సంజీవరెడ్డి, వైస్ ఛాన్సలర్ శ్రీ భగవంతం, పద్మభూషణ్ శ్రీ మాడపాటి హనుమంతరావు గారలు ఈ చిత్రంలో కన్పిస్తున్నారు.


ఆహారంగా తీసుకొంటారు. వీరు ఉడుతలు, ఎలుకలు, కడపటికి పాములను కూడా తింటారు. వీరు వట్టి అమాయకులు. అబద్ధాలు చెప్పడం, మోసం చేయడం వీరికి తెలియదు. వీరి నివాస స్థానాలకు వచ్చువారికి విధేయతతో అతిథి సత్కారం చేస్తారు.

చెంచులు అనాగరికులు. అయితే పశువులను పెంచుతారు సాధారణంగా అందరూ కుక్కలను పెంచుతారు. వారు సూర్యచంద్రులను, భూమ్యాకాశాలను పూజిస్తారు. ఎదిగిన ఆడపిల్లలకుమాత్రమే పెండ్లిచేయడం వీరి సాంఘికఆచారం. ఇప్పుడిప్పుడు వీరు వివాహాలు చేయించుటకు బ్రాహ్మణ పురోహితులను ఆహ్వానిస్తున్నారు. వితంతు వివాహానికి వీరి సంఘం అనుమతిస్తుంది. వీరు తెలుగుభాష మాట్లాడుతారు.

పౌరాణిక గాథలలో మనం తరచుగా వినే శబరజాతికి చెందినవారే సవరులు. వీరు కొండప్రాంతాల్లోను, మైదానాలలోను నివసిస్తారు. మైదానాలలో నివసించేవారు నాగరిక జాతుల వారితో సంబంధాలు కలిగిఉండడం వల్ల వారికీ కొండప్రాంతాల్లో నివసించే సవరులకూ ఆచార వ్యవహారాల్లో తేడా ఉంది. సవరుల భాషకు ఒక వ్యక్తిత్వం ఉంది. వీరిది వ్యాకరణయుక్తమైన భాష. వీరి సాహిత్యంలో అనేక పాటలు కథలు ఉన్నాయి. సవరులకు నక్షత్రాల విషయమై బాగా తెలుసు. నీళ్లల్లో మునిగి ఈదడంలో వీరికి ఒక ప్రత్యేకత ఉంది. రోగాల చికిత్సకు వీరు అనుసరించే పద్ధతి నాగరిక ప్రజల్లో కూడా వాడుకలో ఉంది. ఒక కాలంలో సవరులు తమ దేవతలకు నరబలి ఇచ్చేవారు. కానీ ఇప్పుడు లేదు.

దొమ్మరులు ఎక్కువగా నేరాలుచేస్తారు. వీరు మోటు రకమైన దొమ్మరి విద్యలు, ఆటలు ప్రదర్శించి, తద్వారా జీవనోపాధిగడిస్తారు. వీరు తరచుగా దేశద్రిమ్మరులు.

ఎరుకలు-వీరినే కొరవలు అని కూడా అంటారు. ఎరుక భాష మాట్లాడుతారు. వీరిభాష సాధారణంగా వారు నివసించే ప్రాంతాలలో ఉండే భాషతో మిశ్రమమై ఉంటుంది. వీరు సోదె చెప్పడంలో ప్రసిద్ధులు. వనమూలికలు, వెదురుబుట్టల



షాద్‌నగర్‌లో పిల్లల ఆటస్థలానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఈ చిత్రంలో డా. బి. రామకృష్ణారావు, మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరు శ్రీ జి. బక్, మ్యునిసిపాలిటీ చైర్మన్ శ్రీ యం. సుదర్శన్‌రావు కలరు.

వ్యాపారంచేస్తారు. వీరు భిక్షకవృత్తి కూడా అవలంబిస్తారు. ఎరుకలలో పురుషులను పుంజులని, స్త్రీలను పెట్టలని పిలుస్తారు.

ఏనాదుల ప్రధాన వృత్తి వేట, చేపలు పట్టడం. వారిలో అనేక ఉపతెగలున్నాయి. వీరు సాధారణంగా పంటవాండ్లుగాను, వాచ్‌మెన్‌లు గాను పనిచేసి జీవనం గడుపుతారు. వీరు గుడిసెలలో నివసిస్తారు. నైతికంగా వీరి స్థాయి తక్కువది.

లంబాడీ స్త్రీలు ( వీరినే బంజారాలని కూడా అంటారు ) ధరించే దుస్తులు చాలా ఆకర్షణీయంగా వుంటాయి. వీరు చౌకరకమైన సొమ్ములు విశేషంగా ధరిస్తారు. సేద్యం, పశువులను పెంచడం, కాయకష్టం చేయడం వీరి వృత్తులు. వివాహితులు మరణిస్తే వారిని దహనంచేయడం, అవివాహితులు మరణిస్తే వారిని భూమిలో పూడ్చడం వీరి సాంఘిక ఆచారం.

మూడు కోట్లకు పైగా ఉన్న ఆంధ్రప్రదేశ్ జనాభాలో ఆదిమవాసులు చాలా అల్పసంఖ్యాకులుగా ఉన్నారు. ఈ ఆదిమవాసులు గాక మిగిలిన ఆంధ్రులందరూ నాగరికులు. ఆంధ్రులు మాట్లాడే భాషలో ఒక ప్రాంతానికీ మరో ప్రాంతానికీ కొంత భేదముంది. వీరంతా నగరాలలోను, పట్టణాలలోను, గ్రామాలలోను వివిధ వృత్తులు అవలంబిస్తున్నారు. ఆర్థిక రీత్యా ప్రజలను అనేక భాగాలుగా వర్గీకరించవచ్చు. ఒక వర్గ ప్రజలకూ మరో వర్గ ప్రజలకు ఎంతో తేడావుంది. పురాతన కాలంలోని రాజులు, బ్రిటిష్ పరిపాలకులు ప్రవేశపెట్టిన భూమి అమరకపు విధానాలవల్ల కొంతమంది వ్యవసాయదారులు, జమీందార్లు, ఇనాందార్లు, జాగీర్దార్లు ఐనారు. ఈ వర్గానికి చెందినవారు అసలు భూమి దున్ను రైతులకు దూరమైపోయినారు. తత్ఫలితంగా అనేక క్లిష్ట సమస్యలు తలెత్తినాయి. దేశంలోని ప్రజాస్వామ్య ప్రభుత్వాలు యీ సమస్యలను పరిష్కరించాల్సి వచ్చింది. ఇతర ఆర్థికరంగాలలో కూడా తీవ్ర విభేదాలున్నాయి. కాని అవి ఇంతవరకు ఇట్టి సమస్యలకు తావివ్వలేదు. ప్రజలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో అక్షరాస్యత చాలా స్వల్పంగా ఉంది. పొరుగురాష్ట్రాలలో ఉన్నట్లుగానే ఇక్కడ కూడా వార్తాపత్రికలు చదివే అలవాటు బహుళ వ్యాప్తిలో లేదు. గాంధీజీ ప్రభావం వల్లను, ఆంధ్రనాయకుల ఉద్యమ ఫలితాలవల్లను

ఆంధ్రులు సాంఘికంగా చాలవరకు ముందంజ వేశారు. పట్టణ ప్రాంతాల్లో వర్ణాశ్రమ ధర్మములు, అస్పృశ్యత పూర్తిగా మటుమాయమైనాయని చెప్పవచ్చును. అయితే గ్రామీణప్రాంతాల్లో ఇవి అంతరించిపోవుటకు ఇంకా కొంత కాలం పట్టుతుంది. వివాహాలు, ఇతర సాంఘిక ఆచార వ్యవహార విషయాల్లో ప్రజలు సాధారణంగా వారి వారి మత సాంప్రదాయాలను అనుసరిస్తారు. జానపదవాసులు నేటికి కూడా సాంప్రదాయికపు దుస్తులు ధరిస్తారు. ధోవతి, తలపాగా వారు ముఖ్యంగా ధరిస్తారు. అయితే పట్టణ ప్రాంతాల్లో మాత్రం ఫేషన్ ఎలాఉంటే దాన్ని వెంటనే అనుసరిస్తారు. ఆంధ్రులు చాలా ఉద్రేక స్వభావం గలవారు. ఏదైనా మహదాశయానికి తోడ్పడాలంటే ముందు వెనకలా చూడకుండా వెంటనే అందుకు పూనుకొంటారు. ఆంధ్రులు కళారాధకులు. తమకు జానపద పాటలనుంచి పౌరాణిక గ్రంథాల వరకూ గల విశేష సాహిత్య సంపదను చూసి ఆంధ్రులు గర్వపడతారు. కొంతమంది ఆంధ్రులు ఆధునిక ఆటల్లో పేరెన్నిక గాంచారు. సాధారణ ప్రజలు లోకాభిరామాయణము చెప్పుటతో విరామ కాలాన్ని వెళ్లబుచ్చుతారు. సినిమాలు, రేడియోలు అందరికీ అందుబాటులో ఉన్నప్పటికీ అనాది కాలంనుంచి వాడుకలో ఉంటున్న వినోదపు పద్ధతులను, నూతన పంథాలోకి మార్చుటకు ప్రయత్నించడంలేదు.

* * *



---


## * అల్పసంఖ్యాక వర్గములకు ముఖ్యమంత్రి అభయం *

[ 17 వ పేజీ తరువాయి ]

మిస్తున్నాను. ఏకీకరణ సూత్రాలు చర్చించినప్పుడు జరిగిన ఒప్పందం అక్షరాలా అమలుజరపగలమని నేను మరొక సారి వాగ్దానం చేస్తున్నాను. ఆ ఒప్పందంలో మార్పులు వస్తే అవి అందరి అంగీకారం మీదనే గాని రాజాలవు; రావు.

అల్ప సంఖ్యాకుల అభివృద్ధికి కూడా ఆంధ్ర ప్రదేశంలో ఏవిధమైన ఆటంకాలువుండవని నేను అభయంఇస్తున్నాను. భారతదేశ రాజ్యాంగంలో వున్న ప్రాథమిక హక్కులన్నీ అందరికీ వుండగలవు. కుల, మత, జాతి, భాషా భేదాలు లేకుండా పరిపాలన జరగాలి. ఈ సూత్రానుసరణమే ప్రభుత్వోద్యోగులకి నేను ఇచ్చే ఆదేశం.

అచిర కాలంలో నేను తెలంగాణజిల్లాలలో పర్యటించి విషయాలు తెలుసుకుందామని కుతూహలపడుతున్నాను. తెలంగాణ ప్రజానీకం సుస్నేహం కోసం నేను ఉవ్విళ్లూరుతున్నాను. మంగళప్రదమైన ఈ తరుణంలో తెలుగు తల్లులు దేశమంతా పల్లె పల్లెలలో, వాడ వాడలలో దీపాలు వెలిగిస్తున్నారు. దేదీప్యమానమైన ఈ దీపావళి మనకు మార్గదర్శిని. శోభాయమానమైన ఆ వెలుగే మనకి శ్రీరామ రక్ష.



# రాష్ట్రంలో వివిధమతోద్యమాల వ్యాప్తి సర్వమతస్థుల సామరస్యపూర్వక సహజీవనం

రాష్ట్రంలో ప్రధానంగా వ్యాప్తంలో ఉన్నది హిందూమతమే. దానిలోని వివిధ శాఖల అనుయాయులకు రాష్ట్రజీవితంలో తగిన ప్రాతినిధ్యం వున్నది. రాష్ట్రంలో ఎక్కువగా వ్యాప్తిలోవున్న యితర మతములు క్రైస్తవమతము, ఇస్లాం. అక్కడక్కడ స్వల్పసంఖ్యలో బౌద్ధులు, జైనులు, పార్సీలు, ఇతర మతానుయాయులుకూడా నివసిస్తున్నారు. రాష్ట్రజీవితంలో ఎప్పుడుకూడా మతోద్రేకాలు ప్రజ్వలించి, హింసాత్మక సంఘటనలకు దారితీయలేదు. వివిధ మతాలను అనుసరిస్తున్న ప్రజానీకంలోని విభిన్నవర్గాలవారు సామరస్యంతో, పరస్పర సహన భావంతో జీవిస్తున్నారు.

రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో వ్యాపించి, హిందూ మతస్థులు మొత్తం జనాభాలో నూటికి 72 వంతుల వరకు వున్నారు. హిందువులు వ్యవసాయం, ఇంటిపనులు మొదలుకొని పెద్దపెద్ద ప్రభుత్వోద్యోగాలవరకు వివిధ వృత్తులలోనూ వ్యాపించివున్నారు. వీరందరిలోనూ హిందూమత ప్రభావం, మత సంబంధమైన నమ్మకాలు, ఆచారాలు, సంప్రదాయాలు వగైరా రూపాలలోనే కాక, వారు ధరించే దుస్తుల్లోనూ, వారి ఆకారంలోనూ సైతం ప్రస్ఫుటంగా కనిపిస్తూనే వుంటుంది. బ్రిటిషువారి పరిపాలనకాలంలో హిందువుల ఆచార వ్యవహారాల్లో, ముఖ్యంగా విద్యాధికులైన వర్గాల ప్రజలకు సంబంధించినంతవరకు,కొన్ని స్వల్పమైమార్పులు జరిగినవి. అధిక సంఖ్యాకులైన హిందువులలో కలిగిన మార్పు జుట్టుకు సంబంధించినది. దీనిలో పాశ్చాత్యపద్ధతి అనుసరించబడి, మారుమూల కుగ్రామాలకుసైతం ప్రాకింది. విద్యాధికులలో చాలామంది నుదుటిమీద తిలకం (బొట్టు) పెట్టుకునే అలవాటును వదిలేశారు. అంతేకాక దేవాలయాలను సందర్శించే అలవాటు కూడా చాలావరకు వెనుకబడిపోయింది.

మతాచారాలతో పెనవేసుకుని వున్న కొన్ని ముఖ్యమైన కర్మకాండలకు సంబంధించిన వ్యవహారాలలో మాత్రం యిప్పటికీ హిందువులలోని అన్ని వర్గాలవారు వాటిని అనుసరిస్తూనే వున్నారు. ఆ యా కులాలను బట్టి వీటిని నిర్వహించే పద్ధతిలో కొంతవరకు తేడాలు ఉన్నవి. ఇటువంటి శాస్త్రవిహితమైన కర్మకాండకూ, మోక్షప్రాప్తికీ సంబంధం గలదనే విశ్వాసంవల్లనే నేటికీ యివి ఆచరించబడుతున్నవి. వివాహం, జనన మరణాలు వగైరా జీవితంలోని ప్రధాన సంఘటనలకు సంబంధించిన కర్మకాండ యావత్తూ నిర్వహించటానికై హిందువులలో బ్రాహ్మణులని పిలువబడే ఒకవర్గంవారు నియుక్తులై పనిచేస్తున్నారు. ఇటీవలికాలంలో కొన్ని కులాలవారు యీ పనులను కూడా తమలో తాము నిర్వహించుకునే ఏర్పాట్లు చేసుకొనటం జరిగింది. ప్రధానమైన మత విశ్వాసం విషయంలో, అంటే చైతన్యానికి స్వయం వ్యక్తత, నిర్ణీత కర్మమార్గగమనం కలదనే విషయంలో, హిందువు లందరూ బ్రహ్మపదార్థం, లేక ఆత్మ అని పిలువబడుతున్న సర్వ సత్తాకమైన ఒక స్వతంత్రశక్తి స్వరూపాన్ని ప్రతిపాదిస్తున్న ఉపనిషత్సిద్ధాంతాలను నమ్ముతున్నారు, బ్రహ్మ పదార్థ నిర్వచన సందర్భంలో అనేక వ్యాఖ్యానాలు, అనేక భావనారీతులు వెలసినవి. అనేక విశ్వాసాలు, మూఢనమ్మకాలు కూడా ప్రబలినవి. వీటన్నిటి సమాహార స్వరూపమే హిందూధర్మము. సముద్రంలా విశాలమూ, గంభీరమూ అయిన యీ హిందూమతములోని వివిధ శాఖలను, జీవిత విధానాలను అనుసరిస్తూ, నిరక్ష

రాస్యులైన గ్రామీణ ప్రజానీకం మొదలు విజ్ఞానవంతులైన వేదాంతులు, తత్త్వవేత్తల వరకూ వివిధాభిప్రాయాలకు లోనైయున్నారు. అన్నివర్గాల ప్రజలకు వారివారి అంతస్థుల ననుసరించి, హిందూమతంవారికి ఒక ధ్యేయంగా, జీవిత విధానంగా ఉపకరిస్తున్నది.

కాలాంతరాల తరబడిగా జరిగిన సత్య పదార్థ జిజ్ఞాసా చర్చల పర్యవసానంగా ఉపనిషత్కాలంనుండి వివిధ భావనారీతుల ప్రభావాలకు లోనైన అనేక వ్యాఖ్యానాలు ఉద్భవించినవి. వీటన్నిటి ప్రభావం ప్రజల్లోని ఆయా వర్గాలమీద ప్రసరించింది. అద్వైతము, ద్వైతము, విశిష్టాద్వైతము, వీర శైవము, వైష్ణవము వగైరా అనేక శాఖలు దేశంలోని వివిధ ప్రాంతాలలో అనుయాయులను సేకరించుకొన్నవి. విద్యావంతుల మీద మాత్రం అధునాతన హిందూమత నాయకుల ప్రభావం బాగా పడింది. కాగా బ్రహ్మసమాజం, దివ్య జ్ఞాన సమాజం, యింకా మరికొన్ని యిటీవలనే ప్రారంభమైన మతోద్యమాలకు విద్యాధికులైన అనుయాయులు ఏర్పడినారు.

మత వ్యాప్తికీ, తత్సంప్రదాయాల అనుసరణకు ప్రధాన చిహ్నాలుగా దేశం నలుమూలలా దేవాలయాలు, ఇతర పూజామందిరాలు నెలకొన్నవి. దేవుని గుడి లేని ఒక్క కుగ్రామం కూడా లేదంటే అతిశయోక్తికాదు. సంఘ వ్యవస్థలో తక్కువ కులాలవారు మాత్రం, తమ అభిమాన దేవతలకు దేవాలయాలు నిర్మించుకోలేకపోయినా, పొలాలలో చెట్లక్రిందనే రాతి విగ్రహాలను పెట్టుకుని అక్కడే జాతరలు, తిరునాళ్ల వగైరా ఉత్సవాలు జరుపుకుంటుంటారు. యాత్రా స్థలాలుగా ప్రసిద్ధిచెందిన పుణ్యక్షేత్రాలు అధికసంఖ్యాకంగా వున్నవి. హిందువులందరూ వీటిని పవిత్ర క్షేత్రాలుగా భావించుకుంటూ వాటిని సందర్శిస్తుంటారు. ఆ యా స్థలాలలో, ఏటేటా భక్తులు సమర్పించుకునే కానుకలు ముడుపుల రూపంలోనూ, ధాన ధర్మాల రూపంలోనూ చాలా ఆదాయం లభిస్తున్నది.

హిందూమత సంప్రదాయ కేంద్రాలుగా వర్ధిల్లుతున్న సంస్థలలో మఠాలు ప్రత్యేక వ్యక్తిత్వాన్ని రూపొందించుకున్నవి. పురాతన కాలంలోని ఆశ్రమాలను పోలిన యీ మఠాలలో ఒక గురువును ఆశ్రయించుకుని అనేక శిష్యులు విజ్ఞాన సముపార్జన చేస్తుంటారు. కొన్ని కొన్ని చోట్ల వీటికి అనుబంధంగా విద్యాశాలలు వగైరా సంస్థలు కూడా పనిచేస్తుంటవి.

మన రాష్ట్రంలో ప్రతి జిల్లాలోనూ యిటువంటి మఠాలు ఉన్నవి. రాష్ట్రంలో ప్రసిద్ధమైన హిందూ దేవాలయాలలో, తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర దేవాలయం, కాళహస్తి దేవాలయం, భద్రాద్రి రామాలయం, శ్రీకాకుళం మల్లిఖార్జునాలయం, మాచెర్లలోని చెన్నకేశవస్వామివారి దేవాలయం, కోటప్పకొండ కోటీశ్వరాలయం, విజయవాడలో కనకదుర్గాలయం, మంగళగిరి పానకాల నృసింహస్వామి ఆలయం, ద్రాక్షారామంలోని భీమేశ్వరాలయం, సింహాచల నృసింహస్వామి ఆలయం. ముఖలింగంలోని మధుకేశ్వరాలయం. శ్రీ అన్నవరపు సత్యనారాయణస్వామి ఆలయం, దక్షిణ వారణాసిగా ప్రసిద్ధిచెందిన అలంపురంలోని బ్రహ్మేశ్వరాలయం, పాపనాశన దేవాలయాలు, యాదగిరిగుట్టపై వేంచేసిన నృసింహస్వామివారి ఆలయం వగైరా ప్రధానమైనవి. ఈ దేవాలయాలను సంవత్సరంపొడుగునా యాత్రికులు సందర్శిస్తూనే వుంటారు. ఈ ఆలయాలకు ప్రతి సంవత్సరం ఆదాయం రూపంలో చాలాధనం సమకూరుతున్నది.

## క్రైస్తవ మతం

18 వ శతాబ్ది ప్రథమ భాగంలో మన రాష్ట్రంలో క్రైస్తవ మతం ప్రప్రథమంగా తల ఎత్తింది. మతాంతరీకరణ ప్రధాన ఆశయమైనప్పటికీ, మిషనరీలు మామూలుగా శాంతియుతమైన ప్రచారం ద్వారానూ, సాంఘిక సదుపాయాలు, సౌకర్యాల కల్పన ద్వారానూ దీనిని ప్రారంభించారు. గ్రామీణ ప్రజానీకానికి దీనివల్ల చాలా వరకు మేలు జరిగింది. ముఖ్యంగా క్రైస్తవ మిషనరీలు, హిందూ సంఘంలోని తక్కువ వర్ణాలవారు, సంఘ బహిష్కృతులు, అంటరాని వారిపై తమ దృష్టిని కేంద్రీకరించారు. తమకు వాగ్దానం చేయబడుతున్న ఆర్థిక, విద్యా సౌకర్యాలకు బదులుగా తాము క్రైస్తవ మతాన్ని స్వీకరించటానికి వీరిలో అనేకులు ముందుకు వచ్చారు.

వికలాంగులకు, కుష్ఠు రోగులకు నివాస కేంద్రాలు, ప్రజలందరికీ సేవ చేయగల ఆసుపత్రులు వగైరా సదుపాయాలను దేశంలోని వివిధ ప్రాంతాలలో క్రైస్తవ మిషనరీలు కల్పించారు. కొన్నికొన్ని ప్రసిద్ధమైన విద్యా సంస్థలనుకూడా వారే ప్రారంభించి, నిర్వహించారు.

దక్షిణాది జిల్లాలలో క్రైస్తవ మత ప్రచారం కొరకు ఫాదిరీలు మొట్టమొదటి సారిగా కర్నాటక మిషను స్థాపించారు. కడప, నెల్లూరు, అనంతపురం జిల్లాల్లోనూ యితర జిల్లాల్లోనూ అనేక కేథలిక్ చర్చీలు నెలకొల్ప బడినవి. తక్కువ కులాలకు చెందిన హిందువులను అధికసంఖ్యలో క్రైస్తవ మత స్వీకరణ చేయించటం ప్రారంభమైనది. 1743 లో నైజాం సైన్యాలు కంబాల దిన్నెలోని చర్చిని

విధ్వంసం చేయటం వల్ల క్రైస్తవ మిషనరీల ప్రచారానికి గట్టి దెబ్బ తగిలింది. ఈ సంఘటన తర్వాత యింకా అనేకచర్చీలు ధ్వంసంచేయబడి 1773 లో 'జీసస్ సంఘం' రద్దుచేయబడింది. కాని యీ పరిణామాలకు ఏ మాత్రం లొంగిపోకుండా, ధైర్యంతో సహనంతో కృషి చేస్తూ, క్రైస్తవ మతప్రచారం కొనసాగించుకుంటూ పాశ్చాత్య రాజ్యాల పలుకుబడితో, సహాయంతో క్రైస్తవ మిషనరీలు తమ ప్రాబల్యాన్ని క్రమంగా ఉత్తర ప్రాంతంలోని జిల్లాలకు కూడా వ్యాపింప జేసుకోగలిగారు. విద్యావంతులు, నిశిత బుద్ధులైన కొందరు భారతీయులు కూడా క్రైస్తవ మతాన్ని స్వీకరించారు. వీరివల్ల క్రైస్తవ మతప్రచారానికి బలం చేకూరింది. తద్వారా, అనేకజిల్లాలలో గ్రామాలకుగ్రామాలు క్రైస్తవ మతప్రభావానికి లోనై, తన్మత వ్యాప్తికి కేంద్ర పీఠాలుగా పనిచేయటం ప్రారంభించినవి. ఈనాడు ఒక్క చర్చి అయినా లేని తాలూకా లేదు. క్రైస్తవ మిషనరీల నిర్వహణలో గల విద్యా సంస్థ గానీ, వైద్యసంస్థ గానీ లేని జిల్లా లేదు. క్రైస్తవ మిషనరీలచే స్థాపించబడి ఉచ్ఛ స్థాయిలో అభివృద్ధి చెందుతూ నేటికీ కొనసాగుతున్న పెద్ద సంస్థలలో గుంటూరులో కుగ్లర్ ఆస్పత్రి, ఆంధ్ర క్రిష్టియన్ కాలేజి, ఒక శతాబ్దం క్రితం హైదరాబాదులో ఏర్పరచబడిన గ్రామర్ స్కూలు, రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో అనేకంగా వున్న ఉన్నతపాఠశాలలు, ఆస్పత్రులు మొదలైనవి ముఖ్యమైనవి. దేశంలోనుండి క్రైస్తవ పరిపాలకులు వెళ్లిపోయినప్పటికీ, ఆర్యసమాజం వగైరా దేశీయ సంఘాలు ఎంతగా ఎదుర్కొంటున్నప్పటికీ, క్రైస్తవ మిషనరీలు ప్రశాంత చిత్తంతో, ఓర్పుతో వీటిని తట్టుకుంటున్నారు. వారు నిర్మించిన సంస్థలన్నీ దినదిన ప్రవర్థమానమవుతూ, భారతీయ సాంఘిక జీవితంలో భాగస్వాములై ప్రముఖపాత్ర నిర్వహిస్తున్నవి. ఈ దేశంలో క్రైస్తవ మతవ్యాప్తికై కృషిచేసిన మిషనరీ సంఘాలలో యునైటెడ్ లూథరన్ చర్చి మిషన్, శాల్వేషన్ ఆర్మీ, గోదావరి డెల్టా మిషను, లండన్ మిషనరీ సొసైటీ, గాస్పెల్ ప్రచార సమితి, కెనడియన్ బాప్టిస్ట్ మిషను, చర్చి మిషనరీ సొసైటీ, సెవెన్త్ డే ఎడ్వెన్టిస్ట్ మిషన్, అమెరికన్ లూథరన్ చర్చి మిషను, అమెరికన్ బాప్టిస్ట్ మిషను, అమెరికన్ ఆర్కాట్ మిషన్, వెస్లీ మిషన్ వగైరా ముఖ్యమైనవి.

## ఇస్లాం

భారతదేశం మీద మహమ్మదీయ రాజుల దండయాత్రకు పూర్వమే ఇస్లాం మతం మనదేశానికి వచ్చింది. కాని ఉత్తర హిందూస్థానంలోలాగా దక్షిణాపథంలో యిస్లాం మతం త్వరితగతిని వ్యాప్తి చెందలేదు. మతాంతరీకరణ జరిగినప్పటికీ, మతం మార్చుకున్నవారు తమ హిందూ ఆచారములనుండి పూర్తిగా వేరుచేసుకోలేదు సరికదా, తమ పూర్వాచారాలు, అలవాట్లను పాటించటం మానుకోనూలేదు. అనేక పండుగలు హిందువులు, ముస్లింలు కలిసి జరుపుకునేవారు. ఈ ఉభయమతస్థుల మధ్య మనస్పర్థలు పొరపొచ్చెములు లేకుండా సహజీవనం ఆచరణలో సిద్ధించటంలో మన ప్రాంతం చెప్పుకోదగినది. ఇటీవలి రాజకీయ పరిణామాల సందర్భంలో మత కలహాల ప్రేరేపకశక్తులు ఉద్భవించినప్పటికీ. అవి అక్కడక్కడ చెదురుగా జరిగిన సంఘటనలుగా మాత్రమే సమసిపోయి, కొద్ది స్వల్ప కాలాలకు మాత్రమే పరిమితమైనవి. వీటివల్ల నిత్య జీవితంలో వర్ధిల్లుతున్న సహృదయ పూర్వక సామరస్య వాతావరణం చెక్కుచెదరలేదు,

ఆంధ్ర ప్రాంతాలలో క్రీస్తు తర్వాత 8 వ శతాబ్దంలోనే ముస్లింలు నివసించినట్లు చెప్పబడుతున్నది. అజ్మీరు నుంచి చాలామంది సూఫీ ఫకీర్లు వచ్చి దక్షిణాపథంలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. వీరిలో గుల్బర్గాలో స్థావర మేర్పరచుకున్న క్వాజా బందే నవాజ్, కర్నూలులోని షాహుశేన్, విశాఖపట్నంలోని హిస్మక్ మదీనా, పిఠాపురంలో నివాస మేర్పరుచుకున్న అఖల్ ఆలీషా, నాగూర్‌లో నివసించిన మీర్జా ఆలీషా వగైరా ముస్లిం ఫకీర్లు ముఖ్యులు. వీరు గాక యింకా అనేకమంది సూఫీలు వచ్చి మతప్రచారం సాగిస్తుండేవారు. వీరిలో ఖాదర్‌వలీ వంటి అనేకుల గోరీలు యీనాటికీ యాత్రాస్థలాలుగా ప్రసిద్ధిజెందివున్నవి. దేశంలో జరిగిన అనేక యుద్ధాల సందర్భంగా మహమ్మదీయ సైనిక కుటుంబాలు ఎన్నోవచ్చి తెనుగుదేశంలో స్థిరపడిపోయినవి. ఈనాటికీ వారి సంతతివారికి ఉర్దూ మాతృభాషగా వుంటున్నది. ఈ ప్రాంతాలలోని రాజులు, నవాబుల వద్ద నుంచి, వారిలో కొందరు యీనాములు, జాగీర్లుకూడా సంపాదించుకున్నారు.

దక్కన్‌లో మహమ్మదీయ పరిపాలన ప్రారంభం కావడంతో, సహజంగా మహమ్మదీయ మతవ్యాప్తికి కూడా కొంతవరకు ప్రోద్బలం కలిగింది. కాని మొగల్ సామ్రాజ్యం మీద తిరుగుబాటు దారులైన యిక్కడి మహమ్మదీయ రాజులకు స్థానిక ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకొనుట అవశ్య కర్తవ్యమైంది. అందువల్ల వారు బలవంతపు మతాంతరీకరణను అనుమతించలేదు. అంతే కాక వారు, ముస్లిం సంస్థలతోబాటు హిందూదేవాలయములకు ధర్మ

సంస్థలకు కూడా దాన ధర్మాలు చేశారు. తద్వారా మత సహనాన్ని, సమానత్వాన్ని నిలబెట్టగలిగారు. కాని ఆర్థిక దృష్ట్యా పరిశీలిస్తే, హైదరాబాదులో ముస్లిం పరిపాలన సరిగంగా. ముస్లింలకు సంఘంలో ఒక ప్రత్యేక గౌరవ స్థానం కల్పించబడి, ప్రభుత్వోద్యోగాలలో వారికే ప్రాధాన్యత ఏర్పడినదని చెప్పక తప్పదు. ప్రతిచోటా రెండు గాని, మూడు జిల్లాలలోను ముస్లింలు, హిందువులలోని తమ సహచరులతో పాటు వివిధవృత్తులను అవలంబిస్తుండేవారు. వారి వృత్తులలో ముఖ్యమైనవి, అత్తరు వగైరా పరిమళ ద్రవ్యాలు తయారుచేయుట, చాపల అల్లకం, చేనేత, తివాసీల తయారీ, కాగితం పరిశ్రమ, ఫర్నిచరు తయారుచేయుట మొదలైనవి. ప్రసిద్ధిచెందిన వరంగల్లు, తంగెళ్లమూడి తివాసీ నేతపనిలో ఆరితేరిన ముస్లిం కుటుంబాలవారు, పర్షియా నుండి వచ్చిన ముస్లిం షేకుల సంతతివారే.


ముస్లింలలో అనేక మంది ప్రభుత్వోద్యోగులుగానూ, ఇంజనీర్లు, డాక్టర్లు వగైరా యితర వృత్తులలోనూ ప్రసిద్ధి చెందటమే కాక, వారిలో కొందరు తెలుగులో పండితులు గానూ, మహా విద్వాంసులుగానూ కూడా అభివృద్ధిచెందారు.

## బౌద్ధము

క్రీస్తుశకం ప్రారంభంలో, బీహారు లాగానే, ఆంధ్ర ప్రాంతం కూడా బౌద్ధమత వ్యాప్తికి ప్రధాన రంగమైంది. దేశంలోని వివిధ ప్రాంతాలలో బయల్పడిన అనేక బౌద్ధ స్తూపాలు, చైత్యాల వల్ల యీ విషయం రుజువవుతున్నది. ఆ రోజుల్లో బౌద్ధమత ప్రభావం బాగా వ్యాపించినది శ్రీ పర్వత ప్రాంతం. దీనినే యిటీవల నాగార్జునకొండ అని వ్యవహరిస్తున్నారు. బౌద్ధమతంలోని మహాయాన శాఖకు ఆదిపురుషుడైన నాగార్జునాచార్యుని కృషికి యీ ప్రాంతం కేంద్రస్థానమై విలసిల్లింది. అప్పటి చైనా రాయబారి హ్యూయాన్ త్సాంగ్ రచనలను బట్టి, 7 వ శతాబ్దం మధ్యకాలంలోనే శ్రీ పర్వతంలో బౌద్ధ సంఘారామాలు, విహారాలు కలవని తెలుస్తున్నది.

1926 లో భూగర్భ పరిశోధకశాఖవారి త్రవ్వకాలలో నాగార్జునకొండ ప్రాంతం బయల్పడింది. అక్కడ ఒక మహా స్తూపం, 8 చిన్న స్తూపాలు, నాలుగు విహారాలు, నాలుగు మండపాలు, నాటకశాల, రెండు విగ్రహాలు, శ్రీలంక దేశపు భిక్షువులకు చెందిన ఇక్ష్వాకుల శాసనాలు బహిర్గతమైనవి. మహా చైత్యములో లభించిన ఒక శిధిలము స్వయంగా బుద్ధునిదే నని విశ్వశించబడు తున్నది. పోతే అమరావతి, భట్టిప్రోలు, వగైరా యితర కేంద్రాలలో కూడా బౌద్ధమత వ్యాప్తి చిహ్నాలు, శిథిలాలు, బౌద్ధ కళా శిల్ప సంపదలు, చాలావరకు బయల్పడినవి. ఈ ప్రాంతాలను మొట్టమొదట పరిపాలించిన శాతవాహన రాజులు బౌద్ధ మతపోషకులుగా ప్రసిద్ధిచెందారు. ఇతర వంశీకులైన రాజులు, తాము వేదమతావలంబులైనప్పటికీ బౌద్ధమతవ్యాప్తిని కూడా సహించి, ప్రోత్సహించారు, అనంతరకాలంలో యావద్భారతదేశంలో హిందూమతం మళ్లీ ఒక్కసారి విజృంభించటంతో, ఆంధ్రలోని బౌద్ధ మతం కూడా సింహళ ద్వీపానికి, యింకా తూర్పుదేశాలకు ప్రాక వలసివచ్చింది. ఇప్పుడు బౌద్ధమతాన్ని అవలంబిస్తున్నవారు చాలా స్వల్ప సంఖ్యలో వున్నారు. జైన, పారశీక మతస్థుల కంటే కూడా వీరి సంఖ్య తక్కువ.


ఇతర ధర్మ సంస్థలన్నిటితో పాటు, ప్రధానమైన మత సంస్థలన్నీ కూడా దేవ-ధర్మాదాయ శాఖవారి అజ్మాయిషీలో వుంటున్నవి. ఇందులో కొన్నింటిని దేవాదాయశాఖవారు నేరుగా నిర్వహిస్తున్నారు. ముఖ్యమైన పుణ్యక్షేత్రాలు, మత సంబంధమైన కేంద్రాలలో యాత్రికులకు కావలసిన సౌకర్యాలు కల్పించుట, ఆయా క్షేత్రాల మహాత్మ్యన్ని గురించి ప్రచారం చేయుట వగైరా వ్యవహారాలను యీ శాఖవారే నిర్వహిస్తున్నారు.




# ★ రాజధాని ★

*హైదరాబాదు నగరం మధ్యయుగపు పాతతరహా కట్టడాలతో, ఆధునిక కాలపు నవీనరీతి భవనాలతో కేంద్రంగా అలరారుతున్నది. ఎక్కడ చూచినా చారిత్రక కట్టడముల అవశేషాలు, మసీదులు, సమాధులూ కన్పిస్తాయి. నేత్రోత్సవంచేసే సుందర ప్రదేశాలు, పుర జనులను రంజింపజేసే వినోద సౌకర్యాలు ఇక్కడ ఎన్నో వున్నాయి. ఇప్పు డీ నగరం ఒక పెద్దరాష్ట్రానికి రాజధాని అయింది కాబట్టి ఇంకా విస్తృతమై మహానగరంగా అభివృద్ధి చెంద డానికి అవకాశాలున్నవి.*

హైదరాబాదు నగరం ఆంధ్రప్రదేశ్ రాజధాని. దీనిజనాభా దాదాపు 11లక్షలు. 1951 లెక్కలను బట్టి జనాభా 10,85,722. ఇది మరీ ప్రాచీననగర మనీ అనడానికి వీలులేదు. చక్కని సిమెంటురోడ్లు, ఉద్యానవనాలు కొత్తతరహా భవనాలూ వున్నవి కాబట్టి ఆధునిక నగరమనికూడా అనలేము. కారణమేమంటే ఇవన్నీ కొద్ది భాగాలలోనే వున్నవి. మూసీనదికి ఇరుప్రక్కలా వున్న పట్టణము అక్కడక్కడా ఒక క్రమం అంటూ లేకుండా పెరుగుతూ వచ్చింది. నగరంలో పలుచోట్ల మురికి పేటలూ, శిథిలమయిన ఇండ్లూ, గుడిసెలూ వున్నాయి. టౌన్‌ప్లానింగు చాలాకాలం క్రిందటనే ఆరంభమై నప్పటికీ ఇంతవరకూ కొన్ని పేటలలో మాత్రమే సక్రమమయిన ప్లానులప్రకారం వీధులూ, ఇండ్లూ, నిర్మింపబడ్డవి. ఈలోగా పట్టణం అన్నివైపులా పెరుగుతూ పోయింది. ఆ పెరుగుదలను అరికట్టడం



రాజ్‌భవన్, హైదరాబాదు.




ఆంధ్రప్రదేశ్ హైకోర్టు.

సాధ్యం కాకపోయింది. పర్యవసానం ఏమిటంటే రాజవీథుల ప్రక్కనే ఇరుకైన సందుగొందులు, ఆధునికమైన చక్కని కట్టడములమధ్య మట్టితో కట్టిన పూరిళ్ళూ కన్పిస్తున్నవి.

ఈ నగరాన్ని గోలకొండ నాల్గవ ఖుతుబ్‌షాహీ రాజు మహమ్మద్ ఖులీ 1589 లో నిర్మించాడు. ఒకనాడాయన మూసీనది దక్షిణతీరంలో వేటాడుతూ ఎదురుగా పచ్చపచ్చగా కన్పిస్తున్న ప్రదేశాన్ని చూచి ముగ్ధుడయిపోయి అక్కడ కొత్తరాజధానిని నిర్మింప సంకల్పించాడని ప్రతీతి వున్నది. ఆ ప్రదేశం గోలకొండ కోటకు సుమారు ఆరుమైళ్ళ దూరంలో వున్నది. సుల్తాన్ ఖులీ ప్రసిద్ధ నిర్మాత. ప్రఖ్యాత చారిత్రక కట్టడమైన చార్మినార్ నిర్మాణానికి ఇతడే బాధ్యుడు. చార్మినార్ నాలుగు శిఖరములుగల కట్టడము. దీని చిత్రమే హాలీ సిక్కా నాణెములపై ముద్రింపబడింది. ఈ కొత్తనగరమున కాతడు మొదట తన ప్రియురాలయిన భాగమతి పేరట భాగ్యనగరమని నామకరణం చేశాడు. తరువాత తన భార్యయైన హైదర్ మహల్ పేరట హైదరాబాదు అని మార్చాడు.

ఆదిలో ఈ పట్టణం మూసీనదికి కుడివైపునే వుండేది. దాదాపు రెండున్నర చ. మైళ్ళ విస్తీర్ణంలో పట్టణంచుట్టూ పెద్ద రాతిగోడ నిర్మింపబడింది. అయితే కొత్త భవనాలు కట్టవలసిన అవసరం కలగడంచేత ఆ గోడకు అక్కడక్కడా గండ్లుకొట్టారు. ఆ పాత పట్టణంలోనే చార్మినార్ గాక ముస్లిం సంస్కృతికి చిహ్నాలైన చార్ కమాన్, మక్కామసీదు, సాలార్ జంగ్ మేడ, చౌ మహల్లామేడ, మహారాజా చందూలాల్ మేడ ఉన్నవి.

నదికి ఎడమవైపునగల పట్టణం తరువాత నిర్మింపబడింది. ఈ భాగంలో కొన్ని అందమైన పేటలు, పురోద్యానవనములు. ఫతేమైదాన్ మొదలైన ప్రసిద్ధ స్థలాలున్నవి. నగరానికి రెండు రైల్వే స్టేషనులు కలవు. ఒకటి బ్రాడ్ గేజి స్టేషను. ఇది నాంపల్లి అని వ్యవహరింపబడుతున్నది. రెండవది మీటర్ గేజి స్టేషన్. దీనిని కాచీగూడా అంటారు. ఇవిగాక బేగంపేట శివారులో హైద్రాబాదునుంచి వాడీకి గల బ్రాడ్ గేజి రైలుమార్గంపై మరొక చిన్న స్టేషను ఉన్నది. అయితే సికింద్రాబాదే పెద్ద రైలుస్టేషను. ఇది సెంట్రల్ రైల్వేకు ప్రాంతీయ కేంద్రమైవున్నది. ఈ స్టేష




*ఆంధ్రప్రదేశ్ శాసనసభాభవనం.*

ములో ఎన్నో ప్లాటుఫారాలు, విశ్రాంతి గదులు, భోజన ఫలహారశాలలు కలవు. హైదరాబాదు, సికింద్రాబాదు నగరాల మధ్యగల బ్రాడ్ గేజి, మీటర్ గేజి మార్గాలపై అక్కడక్కడా చిన్న స్టేషనులున్నవి. ఈ మార్గాలలో పౌరుల సౌకర్యార్థమై లోకల్ ట్రెయిన్స్ అంటే స్థానికంగా నడిచే రైలుబండ్లున్నవి. మీటర్ గేజి మార్గంపై జామై ఉస్మానియా, అడిగ్ మెట్టు, సితాఫల్ మండీ, మలక్ పేట స్టేషనులున్నవి. బ్రాడ్ గేజి మార్గంపై జేమ్సుస్ట్రీట్, హుసేన్‌సాగర్ జంక్షన్, ఖైరతాబాదు స్టేషనులున్నవి.

## రవాణా సౌకర్యాలు

హైదరాబాదు నగరంలో ప్రధాన రవాణా సౌకర్యము బస్సు సర్వీసులు. రాష్ట్రీ రోడ్డు రవాణాశాఖ అధ్వర్యంక్రింద ఈ సర్వీసులు నడుస్తున్నవి. ముఖ్య మార్గాలన్నిటిపై బస్సు సర్వీసులు కలవు. చార్మినార్



హైదరాబాదులో 1956 నవంబరు 2వ తేదీన ప్రధానమంత్రి నెహ్రూ సరోజినీదేవి స్మారకమందిరానికి ప్రారంభోత్సవం చేశారు. ఆ సందర్భంలో వారు జ్యోతిని వెలిగిస్తున్న దృశ్యం.



*సరోజినీనాయుడుహాలు ప్రారంభోత్సవ సందర్భంలో ప్రధానమంత్రి, రాష్ట్రముఖ్యమంత్రి, తదితరులు.*

మొదలు రాణీగంజివరకూ, సికింద్రాబాదు స్టేషను వరకూ డబుల్ డెక్ బస్సులున్నవి. ఇతర మార్గాలపై చిన్న బస్సులున్నవి.

హైద్రాబాదు సికింద్రాబాదు నగరాలలో ఆటో రిక్షాలు, టాక్సీలు, టాంగాలు ఉన్నవి. పేదవారి కొరకు సైకిలు రిక్షాలు బహుళంగా ఉన్నవి. అయితే సికింద్రాబాదులో మాత్రం సైకిలు రిక్షాలు నడవడానికి అనుమతిలేదు.

హైద్రాబాదు విమానాశ్రయం బేగంపేటలో ఉన్నది. ఇక్కడ చాలా పెద్ద విమానాలు దిగడానికీ, బయలుదేరడానికీ తగు సదుపాయాలున్నవి. ఈ విమానాశ్రయంనుంచి ఢిల్లీ, బొంబాయి, మద్రాసు, కలకత్తా, బెంగుళూరు పట్టణాలకు విమాన సర్వీసులు నడుస్తున్నవి. విమానాశ్రయానికి అనుబంధంగా ఒక సివిలియన్ ఫ్లైయింగ్ క్లబ్బు కలదు.

హైద్రాబాదునగరం, దీని శివారుల విస్తీర్ణం 79 చదరపు మైళ్ళు. సికింద్రాబాదు నగర విస్తీర్ణం 19 చదరపు మైళ్ళు. ఈ రెండు నగరములకు మధ్య హుసేన్‌సాగర్ చెరువు వున్నది. దాదాపు 11 మైళ్ళ చుట్టుకొలతగల ఈ తటాకం కుతుబ్‌షాహీ రాజుల కాలంలో నిర్మింపబడింది. ఇది విలాసార్థం పోవు పడవ షికారులకుపయోగింపబడుతున్నది. ఈ చెరువుకట్టపొడవు ఒక మైలు. ఈ కట్టపై చక్కని సిమెంటు రోడ్డు వేయబడింది. ఈ రోడ్డు హైద్రాబాదు, సికింద్రాబాదు నగరములను కలుపు రహదారిగానూ, సాయంవేళల వాహ్యాళికి వెళ్ళేందుకు అనువైన మార్గంగానూ వున్నది. ఈ రోడ్డుపై అచ్చటచ్చట ప్రత్యేకంగా నిర్మింపబడిన మంటపములు కలవు. రోడ్డుప్రక్కన కడ్డీలువేసి బందోబస్తుచేసిన కాలిబాటకూడా కలదు. మంటపములలో కూర్చొని లేదా కాలిబాటపై నడుస్తూ ఒకవైపు సుదూరంగా వ్యాపించివున్న తటాకపునీటినీ, రెండవైపు కన్పించే పచ్చనిచెట్లుచేమలను చూచి ఆనందించవచ్చును. వర్షాకాలంలో ఈ చెరువు పూర్తిగా నిండి, పొరలి ఒక వాగుగుండా ప్రవహిస్తుంది. ఈవాగు నగర మధ్యభాగంనుంచి ప్రవహిస్తూ కూరగాయలు మొదలగు కొద్దిపాటి పైరులకు నీటి సరఫరా చేస్తూవుంది.

హైదరాబాదు నగరమును మూసీనది రెండు భాగాలుగా విభజిస్తుంది. నదికిఒకవైపుపాతపట్టణం. రెండవవైపు ఉత్తరపు భాగపు శివార్లు వుంటాయి.

నగరంలో ఈనదిపై నాలుగువంతెనలుకలవు. తూర్పు చివరవున్నవంతెన అలిఫాంట్ బ్రిడ్జి లేక చాదర్ ఘాట్ పుల్ అనబడుతుంది. దీనిని మద్రాసు ఇంజనీర్లదళానికి సంబంధించిన కర్నల్ జేమ్సు అలిఫాంట్ 1831లో నిర్మించాడు. ఇతడు ఈస్టిండియా కంపెనీ డైరెక్టరుగాగూడా పనిచేసినవాడు. దీని తరువాతది అఫ్జల్ గంజ్ వంతెన లేదా న్యూబ్రిడ్జి అనబడుతుంది. ఈ వంతెనపై రాకపోకలు ముమ్మరంగా వుంటాయి. పడమటివైపున ముసల్లంజంగ్ బ్రిడ్జి కలదు. హైద్రాబాదు ప్రధానమంత్రులలో ఒకరయిన నవాబ్ లాయకుద్దౌలా దీనిని 1898 లో నిర్మించాడు. నాల్గవ వంతెన పురానా పుల్ లేక ఓల్డు బ్రిడ్జి అని వ్యవహరింపబడుతున్నది.

1908 లో మూసీకి పెద్దవరదవచ్చి నగరంలో చాలా భాగం జలమయం కావడంచేత 3 వేలమంది ప్రజలు ప్రాణాలు గోల్పోయారు. 24,000 ఇండ్లు నీట మునిగినవి. ఇట్టి విపత్తు మళ్లీ రాకుండా చేయడానికై మూసీపైనను, దాని ఉపనది అయిన ఈసీపైనను నగరానికి 13 మైళ్ళ దూరంలో రెండు ఆనకట్టలు కట్టబడినవి. ఈ రెండు ఆనకట్టలు వరద రెగ్యులేటర్లుగా ఉపయోగపడటమేగాక వీటివల్ల ఉస్మాన్ సాగర్, హిమాయత్‌సాగర్ అను రెండు పెద్దజలాశయము లేర్పడ్డవి. ఉస్మాన్‌సాగర్ విస్తీర్ణం 18 చదరపుమైళ్లు. ఇది 50 లక్షల వ్యయంతో నిర్మింపబడింది. హైదరాబాదు సికింద్రాబాదు నగరములకు దీనినుంచే త్రాగేనీరు సరఫరా చేయబడుతున్నది. హిమాయత్‌సాగర్ విస్తీర్ణం 33 చదరపు మైళ్ళు. ఇది రూ. 93 లక్షల వ్యయముతో నిర్మింపబడింది. దీని నీరు పైరుల కుపయోగించబడుతున్నది. ఈ రెండు తటాకములవద్ద అతిథి గృహములు, చక్కని ఉద్యానవనములు కలవు. ఇది పిక్నికులకు, వనభోజనాలకు, విలాసార్థం పడవలపై పోవుటకు, చేపలు పట్టుటకు, బాతులను వేటాడుటకు తగివున్నవి. హిమాయత్ సాగర్ చెరువువద్ద ప్రభుత్వ వ్యవసాయ ప్రయోగక్షేత్రం, పాడికేంద్రం కలవు.

నగరం పడమర పొలిమేరలో మీర్ ఆలం చెరువు కలదు. దీనిని నిజాముకు మంత్రిగా వుండి, 1799 లో నిజాం సేనలను టిప్పుసుల్తాను పైకి నడిపించిన



ప్రధానమంత్రి ఆ సందర్భంలో ప్రసంగిస్తున్నారు.



*నవంబరు 1 వ తేదీన హైదరాబాదు సికింద్రాబాదు మునిసిపల్ కార్పొరేషనులు ఇచ్చిన గార్డెన్ పార్టీకి విచ్చేస్తున్న ప్రధానమంత్రి.*

మీర్ ఆలం నిర్మించాడు. శ్రీరంగపట్నం పతనం తరువాత తనకు బహుమతిగా లభించిన పెద్ద మొత్తమును మీర్ ఆలం ఈ తటాక నిర్మాణానికి వినియోగించాడు. దీని కట్టపొడవు 1120 గజములు. ఇది ఫ్రెంచి ఇంజనీర్లచే 80 వేల పౌనుల వ్యయంతో నిర్మింపబడింది. చెరువుగట్టు 21 కమానులతో కూడి వున్నది. చెరువు పడమటి చివరన సుమారు 80 అడుగుల ఎత్తుగల గుట్టవున్నది. ఆ గుట్టపై మీర్ మహమ్మద్ దర్గా (సమాధి) వున్నది. తూర్పువైపున హైదరాబాదులోకల్లా పెద్ద ఈద్‌గాహ (ముస్లిముల ప్రార్థనాస్థలం) వున్నది.

## ఉద్యానవనములు

1908 వరదల తరువాత మూసీనదికి పాత పట్టణాన్ని, ఉత్తరపు భాగాన్ని విభజిస్తూ పొడ్యో మార్గంపొడవున రెండువైపుల కట్టలు నిర్మింపబడినవి. నదికి రెండుతీరముల రోడ్లు, ఉద్యానవనములు వేయబడ్డవి. ఒక ఉద్యానవనం ముసల్లం జంగ్ వంతెన నుంచి అఫ్జల్‌గంజ్ వంతెనవరకు 16 ఎకరాల విస్తీర్ణంలో కలదు. ఈ ఉద్యానవనంలోనే 1908 లో వరదలు వచ్చినప్పుడు దాదాపు 200 మంది ప్రాణాలను కాపాడినట్టి పెద్ద చింతచెట్టు కలదు. వారంతా ఆచెట్టు ఎక్కి దాని నంటిపెట్టుకొని వున్నారట. ఈ విషయాన్ని తెలిపేరేకు ఆ చెట్టుపై వున్నది.

పౌరుల వినోద వాహ్యాళికొరకు గల మరొక ఉద్యానవనం పబ్లిక్ గార్డెన్స్. ఇది మూసీకి ఉత్తర భాగంలో కొత్తపట్టణం మధ్యన వున్నది. దీనిచుట్టూ గోడవున్నది. దీనికి రెండు గేట్లు వున్నవి. ఈ ఉద్యానవనంలో అనేక పబ్లికు భవనా లున్నవి. శాసనసభా భవనము, హైదరాబాదు మ్యూజియం మృగశాల, హెల్తు మ్యూజియం, అజంతా పెవిలిఎన్, సిల్వర్ జూబ్లి పెవిలియన్, బాలలగ్రంథాలయం,

ఒక మసీదు ఇందులో ఉన్నవి. కలువతామర పూపులతో అందంగా కన్పించే చిన్న చిన్న సరస్సులు, పిల్లలాడుకొనే మైదానములు, కంటికింపుగొల్పే చక్కని పచ్చికబయళ్లు, వివిధ రకముల వృక్షములు ఉద్యానవనంలో ఉన్నవి.


నగరంలోని అనేక పేటలలో పౌరుల సౌకర్యార్థమై చిన్న చిన్న పార్కులున్నవి.

నగరం పాతభాగంలో పత్తర్ ఘట్టీ పెద్దవ్యాపార కేంద్రము. ఈ రోడ్డు ఈ మధ్యనే వెడల్పు చేయబడింది. ఈ రోడ్డులో చక్కని రాతి పంచపాళీలుగల షాపు బిల్డింగులున్నవి. అన్నివిధములైన సరుకులు ఈ షాపులలో, అంగళ్లల్లో లభిస్తాయి. కొత్తపట్టణంలో సుల్తాన్‌బజారు పెద్ద వ్యాపార కేంద్రం. దీనినిపూర్వం రెసిడెన్సీబజారు అని వ్యవహరించేవారు. ఆబిద్ రోడ్డు కూడా ప్రసిద్ధ వ్యాపారకేంద్రమే. ఈ రోడ్డులో బ్యాంకు కార్యాలయాలు, సినిమాలు ఉన్నవి.

పత్తర్ ఘట్టీకి దక్షిణభాగంలో చార్మినార్ వున్నది. దానికి నాలుగువైపుల నాలుగు పాత కమానులున్నవి. ఇవే చార్ కమాన్ అని అనబడుతున్నవి. చార్మినార్ ఎందుకు నిర్మింపబడిందో సరిగా తెలియదు. ఇది సమకోణ చతురస్రాకారపు కట్టడము. దీనికి నాలుగు కమానులు, నాలుగు శిఖరాలు ఒకదానికొకటి అనురూపంగా నిర్మింపబడి ఉన్నవి. దీని నిర్మాణం ముస్లిం రీతిలో ఉన్నది. యం. బస్సీ అనునాతడు, అతని సేనలు చార్మినార్‌ను 1756 జులైలో ఆక్రమించుకొన్నవి. నిజాం ప్రభుత్వం ఈ కట్టడంవద్ద ఎల్లప్పుడూ పోలీసు పారా ఉంచేది. శ్రీ సి. రాజగోపాలాచారి భారత గవర్నర్ జనరల్ హోదాలో 1949 లో ఈ నగరానికి విచ్చేసినప్పుడు ఆయనకు చార్మినార్ వద్దనే పౌర సన్మాన మివ్వబడింది.

చార్మినార్‌కు నైఋతి దిశన యూనానీ ఆసుపత్రి తిబియ్యా కాలేజీ ఉన్నవి. ఈ కాలేజీలో యూనానీ వైద్యవిధానపు శిక్షణ ఇవ్వబడుతుంది.

ఈ స్థలానికి కొంచెందూరంలో చౌమహల్లా మేడ ఉన్నది. ఇది టెహరాన్‌లోని ఇరాన్ రాజు మేడనమూనాలో నిర్మింపబడింది. ఈ మేడకు అనేక చతుష్కోణ



విందులో పాల్గొన్నవిదప వెళ్ళిపోతున్న ప్రధానమంత్రి.

ములు, రెండువైపులా చక్కని ప్రాంగణములుగల భవనాలు వున్నవి. దీనిలో ఒక ఉద్యానవనము, చలవరాతితో నిర్మింపబడిన నీటిమడుగు, దర్బారు హాలు వున్నవి. ఈ దర్బారు హాలులో నిజాం రాజ స్వాగత సభలు జరిపెడివారు.

హైదరాబాదు నగరంలోని మసీదులలో జామా మసీదు అతిపురాతనమైనది. దీనిని సుల్తాన్ మహమ్మద్ ఖులీ ఖుతుబ్‌షా 1598 లో నిర్మించాడు. చార్మినారుకు తూర్పుగాపోయే రోడ్డున కొంత దూరం వెళ్ళి అక్కడినుంచి ఒక చిన్న వీధిగుండా పోతే ఈ మసీదు కన్పిస్తుంది. మసీదు ఆవరణలో టర్కీ స్నానవాటిక తాలూకు శిథిలములు కలవు.

చార్మినారుకు దక్షిణంగా ఫర్లాంగుదూరంలో మక్కామసీదు ఉన్నది. నాలుగు శిఖరాలు, రెండు బురుజులతో ఈ కట్టడం గంభీరంగా కన్పిస్తుంది. దీని నిర్మాణాన్ని రూ. 8 లక్షల వ్యయంతో సుల్తాన్ మహమ్మద్ ఖులీ ఖుతుబ్‌షా ఆరంభించాడనీ, ఒక పారశీక భవననిర్మాణ నిపుణుడు దీని డిజైనును తయారుచేశాడనీ చెప్పబడుతున్నది. ఖుతుబ్‌షా తరువాత తానాషా దీనినిర్మాణాన్ని కొనసాగించాడనీ, ఔరంగజేబు 1687 లో దాన్ని పూర్తిచేసినాడనీ, తెలుస్తున్నది. ఈ మసీదులో ఒక ఆవరణలో రెండవ నిజాం అగు నిజాం అలీఖాన్ సమాధి, ఆయన తరువాత రాజ్యాధిపతులైనవారి సమాధులు ఉన్నవి. హైదరాబాదు ముస్లిములకు ఈ మసీదు ముఖ్యమైన ప్రార్థనాస్థలంగా ఉన్నది.

ఇక్కడికి కొంచెందూరంలో బారాదరీ ఉన్నది. ఇది మహారాజా చందూలాల్ మేడ. ఈయన 1806 నుంచి 1843 వరకు హైదరాబాదు మంత్రిగా పనిచేశాడు. ఈ మేడ అంత ఉన్నతమైనదికాదు. కాని చక్కగా అలంకరింపబడివున్నది.

మొదటి షమ్సుల్ ఉమ్రా అయిన నవాబ్ తేగ్ జంగ్ ఆరడుగుల ఆరంగుళాల మనిషట! ఈయన పట్టణం పడమటి గోడకు దగ్గరగా విశాలమైన ఒక మేడ కట్టించాడు. అందులో ఆయన కవచములు, ఖడ్గములు కలవు. తేగ్‌జంగ్ పాత పోర్చుగీసు ప్రాంతంగా ఉండినట్టి సమీప ప్రదేశంలో జహానుమా మేడ కట్టించాడు. ఆ ప్రదేశంలో 'అవర్ లేడీ ఆఫ్ సారోస్' అను పోర్చుగీసు చర్చికలదు. ఆ చర్చిలో ఇప్పటికీ ప్రార్థనలు, వార్షికోత్సవాలు జరుగుతున్నవి.

నగరానికి దక్షిణపు భాగంలో ఒక చిన్న కొండమీద సర్ వికారుల్ ఉమ్రా ఫలక్‌నుమా భవనం కట్టించాడు. ఈయన ఒకప్పుడు రాష్ట్ర ప్రధానమంత్రిగా పనిచేశాడు. ఈ భవనాన్ని కీ. శే. నిజాం మహబూబ్ అలీ పాషా 1897 లో రూ. 35 లక్షలకు కొన్నాడు. దీని సింహద్వారంవరకు పోవు రోడ్డు వంపులు తిరిగి ఉంటుంది. రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ హైదరాబాదునగరానికి విచ్చేసినప్పుడు ఒకపర్యాయం ఈ మేడలో మకాం చేశారు. ఇందులో అమూల్యమైన గ్రంథభండారం ఒకటి కలదు. ఈ గ్రంథ భండారంలో అనేక ముద్రిత గ్రంథాలు, దీపాలుపెట్టి ప్రకాశింపజేయబడిన లిఖిత గ్రంథాలు ఉన్నవి. ఈ మేడలో ఒక చిత్రశాల, అందమైన స్వాగత మందిరం కలవు. ఈ మందిరంలో స్ఫటికములు, వజ్రములు, పచ్చలు పొదగబడిన పేటికలు కలవు.

పత్తర్‌ఘట్టీ వీధిలో నవాబ్ సాలార్జంగ్ మేడ, ఆర్టు మ్యూజియం ఉన్నవి. సాలార్జంగు మేడలో చీనాఖానా ఉండేది. అందులో అపురూపమైన పింగాణీ వస్తువులు గోడకు అతికించబడి ఉండేవి. అయితే మూసీ వరదలవల్ల ఇది ధ్వంసమైంది. సాలార్జంగు మ్యూజియం ప్రాచ్యఖండంలో అత్యుత్తమ మయిన మ్యూజియం. నగరానికి వచ్చినవారు తప్పక చూడ వలసినది. సాలార్జంగ్ అను ఒక్క వ్యక్తి దీనిలోని వస్తువులనన్నిటినీ సేకరించాడంటే ఎవరికైనా ఆశ్చర్యము కలుగుతుంది.

సమీపంలోనే ఆషూర్‌ఖానా ఉన్నది. దీనిని సుల్తాన్ మహమ్మద్ ఖులీ కుతుబ్‌షా 1597 లో నిర్మించాడు. దీని గోడలు రంగు రంగుల పారశీక పింగాణీతో అలంకరింపబడి ఉన్నవి.

నగరంయొక్క ఈశాన్యదిశలో పురానా హవేలీ (పాతమేడ) ఉన్నది. దీనిని మొదటి నిజాం నిర్మించాడు. దీనికి పశ్చిమోత్తర దిశలో దారుష్షఫా ఆసుపత్రి ఉన్నది. దీనిని సుల్తాన్ ఖులీ ఖుతుబ్‌షా నిర్మించాడు. అయితే ఇప్పుడిది ఆసుపత్రిగా ఉపయోగింపబడడం లేదు.

## కొత్తనగరం

మూసీకి ఉత్తరముననున్న కొత్తపట్టణంలో అనేక ఆధునిక భవనాలు, నాగరికమైన నివాసప్రాంతాలు,

ప్రభుత్వ కార్యాలయాలు వున్నవి. సిటీ కాలేజీ, హైకోర్టు మూసీకి అవతలివేపు వున్నవి. కాని ముఖ్యమైన ఇతర విద్యాసంస్థలన్నీ నగరంయొక్క కొత్త భాగంలోనే వున్నవి. బంజారా లేక జూబ్లీ హిల్స్ చాలా మంచిప్రాంతం. ఇక్కడినుంచిచూస్తే హుసేన్ సాగర్ తటాకదృశ్యం కన్పిస్తుంది. సోమాజీగుడా, సైఫాబాద్, హిమాయత్‌నగర్, హైదర్‌గూడా, బర్కత్‌పూరా, నారాయణగూడా చక్కని నివాస ప్రదేశాలు. అడిక్మేట్‌లో ఉస్మానియా విశ్వవిద్యాలయంవున్నది. ముషీరాబాదు పారిశ్రామికప్రాంతం. ఈ ప్రాంతములో అనేక ఫ్యాక్టరీలున్నవి.

సోమాజీగూడాలో షామంజిల్ వున్నది. ఇప్పుడిది రాష్ట్ర గవర్నరు నివసించే రాజభవన్‌గావున్నది. దీనికి సమీపముననే 'లేక్ వ్యూ' అతిథిగృహం, 'బెల్లావిస్తా' సౌధం, ఇతర పెద్ద భవనా లున్నవి. హుసేన్‌సాగర్ అవతల టాంక్‌బండ్‌కు పరిసరాలలో సిటీ పవర్‌హౌస్, పాత మింట్‌భవనాలు, సచివాలయము వున్నవి. నౌబత్ పహాడ్ అనే చిన్న కొండ మీదనుంచి చూస్తే, హుసేన్‌సాగర్ దక్షిణపు ఒడ్డు కనిపిస్తుంది. ఈ కొండను ఆనుకొని ఫతేమైదాన్ వున్నది. విజయం పొందిన ఔరంగజేబు సేనలు గోలకొండపైకి దండయాత్రకుపోతూ ఈ మైదానంలోనే విడిదిచేశాయి. పబ్లిక్ గార్డెన్సు ఈ ప్రాంతంలోనే వున్నవి. ఈ గార్డెన్సు వెనుకగా రైలుమార్గంవున్నది. అది నాంపల్లి స్టేషనువరకుపోయి అంతటితో నిలిచిపోతుంది. రైలుమార్గం అవతలివైపునవున్న నివాస ప్రాంతం రెడ్ హిల్స్. ఇది ఎత్తయిన ప్రదేశము.

ఖైరతాబాదులో ఆలిండియా రేడియో స్టేషను కార్యాలయాలు, హైద్రాబాదు పోలీసు ప్రధాన కార్యాలయం వున్నవి. పబ్లిక్ గార్డెన్సునుండి ఖైరతాబాదుకు వెళ్ళే మార్గంలో లక్డీకా పుల్ ప్రాంతం వున్నది. ఈ ప్రాంతంలోనే అకౌంటెంట్ జనరల్ కార్యాలయం, కొత్తగా నిర్మింపబడిన టెలిఫోన్ ఎక్స్ఛేంజీ కలవు. ఆబిదురోడ్డునుంచి బషీర్ బాగ్ ప్యాలెస్, లేడీ హైదరీక్లబ్బు, నిజాంకాలేజి, మదర్సే ఆలియా, ప్రభుత్వ కుటీరపరిశ్రమల విక్రయశాల సేంట్ జార్జి గ్రామర్ స్కూలుమీదుగా టాంక్‌బండ్ వరకు పెద్దరోడ్డుకలదు. మరొకప్రాంతం చాదర్ఘాట్. ఇక్కడ హెచ్చుగా జనం నివసిస్తారు. యం. రేమాండ్ ఇక్కడే గన్ ఫౌండ్రీ నిర్మించాడు. ఇప్పుడది శిథిలావస్థలో వున్నది. సేంట్ జోసెఫ్ కేతలిక్ కెథీడ్రల్ ఆల్ సేంట్స్ హైస్కూలు, ఇంకా ఇతర పాఠశాలలు ఇచ్చట వున్నవి.

ఆబిద్‌రోడ్డునుంచి ఇరుకయిన సిమెంటురోడ్డు గుండా నారాయణగూడాకు మార్గం కలదు. ఈ రోడ్డుకు ఒకప్రక్క నిజాం నివాసగృహమైన కింగ్ కోటీ మేడవున్నది, రెండవప్రక్క రంబోల్డు కోటీ వున్నది. ఇది విలియం పామర్ అండ్ కంపెనీ అను బ్యాంకింగ్ సంస్థలో భాగస్వామిగా వున్నట్టి సర్ విలియం రంబోల్డుకు నివాసగృహంగా వుండేది. కింగ్‌కోటీకి తూర్పుదిక్కున ఈడెన్‌గార్డెన్సు వున్నవి. ఇందులో నిజాం చిన్న కుమారులు చాలామంది నివసిస్తున్నారు. ముషీరాబాద్ పారిశ్రామిక ప్రాంతంలో ప్రభుత్వ గ్రామీణ పరిశ్రమల శిక్షణకేంద్రం వున్నది. మలక్‌పేటలో పాతరేస్‌కోర్సు, దాని గ్రౌండ్స్ స్టాండు వున్నవి. ఇప్పుడీ రేసుకోర్సు ఉపయోగింప బడడం లేదు.

కొత్తనగరం మధ్యభాగంలోవున్న రెసిడెన్సీ భవనంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం తాలూకు మహిళా కళాశాల వున్నది. ఈ భవనంచుట్టూ ఎత్తైన గోడ వున్నది. దీని సింహద్వారం జనసమ్మర్దం బాగా వుండే సుల్తాన్ బజారులోకి చొచ్చుకొనివచ్చి అవరోధంగా వుండడంచేత ఇటీవలనే పడగొట్టబడింది. రెసిడెన్సీభవన నిర్మాణం 1800 లో ఆరంభమైంది. దీని నిర్మాణాన్ని రాయల్ ఇంజనీర్సుకు చెందిన మిస్టర్ పి. రస్సెల్, సర్‌సాలార్జంగుకూ, బ్రిటిషు రెసిడెంటుకూ అనుసంధానోద్యోగిగా పనిచేసినట్టి రాజా కందస్వామి మొదలియారుగారలు పర్యవేక్షణ చేశారు. ఈ భవనంలో ఒక దర్బారుహాలు వున్నది. 1857 లో జరిగిన సిపాయీల తిరుగుబాటులో రోహిల్లాలు, ఇతరులు రెసిడెన్సీపై దాడిచేశారు. దాడితరువాత చుట్టూవుండేగోడ దృఢపరచబడింది.

ఈ రెసిడెన్సీకి సంబంధించిన ప్రేమగాథ ఒకటి వున్నది. సాలార్జంగ్ కుటుంబంలో ఖైరున్నిసాబేగం అనే ముస్లిం యువతి వుండేది. ఈవిడ పూర్వీకులు పారశీకదేశంవారు. సర్ సాలార్జంగు తన సౌధంలో ఒక పర్యాయం బ్రిటిషు రెసిడెంటు కెప్టెన్ అచిల్లిస్ కిర్క్ పాట్రిక్ గౌరవార్థం విందూ, నృత్యం ఏర్పాటు

చేశాడట. కెప్టెన్ కిర్క్‌పాట్రిక్ యువకుడు, అందగాడు. ఖైరున్నిసాబేగం పర్దాచాటునుంచి అతనిని చూచి ముగ్ధురాలై అతగాణ్ణి ప్రేమించి ఒకనాటి రాత్రి ఒక స్త్రీని వెంటబెట్టుకొని రెసిడెన్సీలోకి రహస్యంగా ప్రవేశించి తన ప్రేమను రెసిడెంటుకు స్వయంగా వెల్లడి చేసింది. ఈ ప్రేమ వివాహం కలకత్తాలోని వైస్రాయి ప్రధాన కార్యాలయంలో పెద్ద అలజడి కలిగించిందట.

రెసిడెన్సీ గేటుకు ఫర్లాంగు దూరంలో ప్రతాప్ గిర్జి కోటి వున్నది. అందులో బహిరంగ సభలూ అవీ జరుగుతూ వుంటాయి.

## సికింద్రాబాదు

జనసంఖ్యా మిక్కుటమై, క్రిక్కిరిసివున్న హైదరాబాదుతో పోల్చినప్పుడు సికిందరాబాదు నగరంలో గమనార్హమైన వ్యత్యాసం కనబడుతుంది. ఈ నగరానికిప్పుడు విడిగా కార్పొరేషన్ ఉంది. సికిందరాబాదు జనసంఖ్య రమారమి లక్షా యాభై వేలు. సికింద్రాబాదులోని విశాలమైన రోడ్లు హైదరాబాదు రోడ్లకంటె ప్రశాంతంగా, పరిశుభ్రంగా ఉంటాయి. ప్రస్తుతం యీ నగరపు పెద్దరోడ్డు అయిన రాష్ట్రపతి రోడ్డు టాంక్‌బండ్ నుండి పెరేడ్ మైదానమువరకూ విస్తరించివుంది. మహాత్మాగాంధీ రోడ్డు, సర్దార్ పటేల్ రోడ్డు, సరోజినీదేవి రోడ్లు ఈ నగరంలోని యితర పెద్ద రోడ్లు. ఇక్కడగల మారేడ్‌పల్లి లేక నెహ్రూనగరం (నివాసస్థావరం) నిర్మాణక్రమం పరిశుభ్రతలలో యీ జంట నగరాలలో అద్వితీయమైనది. ఇతర సుందరమైన ప్రదేశాలలోకి జీరా, హైదర్‌బస్తీలు వస్తాయి. రాష్ట్రపతి రోడ్డు, సరోజినీదేవి రోడ్డుల కూడలిలో యిటీవల కేంద్ర పబ్లిక్‌వర్క్సు శాఖ నిర్మించిన టెలిఫోన్‌ఎక్స్చేంజి సికింద్రాబాదులో మిక్కిలి మనోహరమైన భవనాలలో ఒకటి. దీని సమీపములోనే ఉన్న పాత మహబూబ్ కళాశాల హైస్కూలు అనేకమైన చిన్న చిన్న కట్టడాలతో కూడియున్నది. కింగ్ ఎడ్వర్డు మెమోరియల్ ఆస్పత్రి రాష్ట్రంలో సాధనసంపత్తి విషయంలో ఉత్తమోత్తమమై నిర్విరామంగా పనిచేసే సంస్థలలో ఒకటి. సికిందరాబాదులో, అది బ్రిటిష్ పరిపాలిత ప్రాంతంగా వ్యవహరింపబడి నప్పుడు అక్కడ స్థిరపడిపోయిన క్రైస్తవ మిషన్లచే నడుపబడే చర్చీలు, విద్యాసంస్థలు చాలా ఉన్నవి. పెరేడ్ మైదానం సమీపంలో గల పందెముల ప్రదేశం (రేస్‌కోర్సు) లో నేటికీ పందెముల వార్షిక సమావేశాలు జరుపబడుతవి. సర్ రొనాల్డురాస్ మలేరియాకు ఆధారభూతాన్ని కనుగొన్న భవనం సికిందరాబాదు పొలిమేరలో ఉన్నది. సంవత్సరం పొడుగునా ఆటల కార్యక్రమాలు జరిగే యీ నగరంలో అనేకమైన క్లబ్బులున్నాయి.

సికిందరాబాదు నగరాన్ని తిర్మలగిరి, బొలారం, బవెన్‌పల్లిలతో కూడిన కంటోన్మెంట్ ప్రాంతంనుండి సర్దార్ పటేల్ రోడ్డు విడదీస్తున్నది. తిర్మల్‌గిరిలో సైన్యపు బారకాసులు, ఒక పెద్ద మిలిటరీ ఆస్పత్రీ 'డిటెన్షన్ బారక్సు' అని వ్యవహరింపబడే పాత మిలిటరీ ఖైదు ఉన్నవి. భారత అధ్యక్షుని దక్షిణాపథ నిలయం బొలారంలో ఉన్నది. ఇది 'రాష్ట్రపతి నిలయము' అని వ్యవహరింపబడుతున్నది. బవెన్‌పల్లి ఒక రౌతును, అతని గుర్రాన్ని ప్రక్క ప్రక్కనే పూడ్చబడిన చిన్న శ్మశానవాటికకు పేరొందినది. లెఫ్టినెంట్ జాన్ మూరే అనే బ్రిటిషు అశ్వదళాధికారొకడు అక్కడవున్న దిగుడుబావికిగల 15 అడుగుల వెడల్పు మార్గాన్ని అశ్వారూఢుడై దాటుతూ ఉండేవాడట. ఒకసారి జనరల్ ఆఫీసర్ తనిఖీకి వచ్చిన సమయంలో అలా చేయబోయి విఫలుడై బావిలో పడిపోయాడట. అతని చివరికోరిక ననుసరించి, అతను అతని గుర్రము ఒకరిప్రక్క నొకరు పాతిపెట్టబడ్డారు.

సుమారు పదివేలమందికి పనికల్పించే రైల్వే వర్కుషాపులు సికింద్రాబాదు రైలుస్టేషనుకు రమారమి మైలున్నరదూరంలోగలలాలాగూడాలో వున్నాయి. వీటిలో పనిచేసేవారికి గృహవసతి మొదలైన సౌకర్యాలు కలిగించబడినవి, రైల్వే ఆస్పత్రి, ఒక చక్కని వినోదపు క్లబ్బు కూడా ఉన్నాయి.

## గోల్కొండ

1507 - 1687 మధ్య పరిపాలనచేసిన కుతుబ్‌షాహీ వంశపు రాజుల ఆవాసమైన గోల్కొండకోట హైదరాబాద్ నగరానికి 5 మైళ్ళ దూరంలో వుంది. మొగలాయి దర్బారు చరిత్రకారులు చెప్పిన ప్రకారం ఈస్థలం పాతపేరు మౌకులీ లేక మంకాల్. అక్కడ రాజా దేవరాజు పూర్వీకులు ఒక మట్టి

కోటను నిర్మించారు. వరంగల్లు రాజా ఈ కోటను బహమనీ రాజులకు యిచ్చివేశాడు; ఖులీ ఖుతుబ్‌షా స్వాతంత్ర్యం ప్రకటించినపిమ్మట అది అతని రాజ ధాని అయింది. ఆతడు అక్కడ అదనంగా పెక్కు భవనాలను నిర్మించి, దానికి మహమ్మద్‌నగరం అని పేరు పెట్టాడు. కాని గోల్కొండ అనే పాతపేరే నిలిచిపోయింది. ఇబ్రాహిం కుతుబ్‌షా దానిని మరి కొంత బలపరచాడు. ఔరంగజేబు 8 నెలల పాటు గోలకొండనుముట్టడించి, చివరకు సుల్తాన్ తానాషా సేనలకు లంచమిచ్చి దాన్ని జయించాడు.

ఈ కోటకు యెనిమిది సింహద్వారాలుండేవి. కాని ఇప్పుడు మిక్కిలి ముఖ్యమైనవి రెండుమాత్రమే. అందులో ఒకటి 1687 లో మొగలు సైన్యాలు కోటలో ప్రవేశించినఫతేదర్వాజా. రెండవది బంజారా గేటు. కోటను చూడటానికి వచ్చినవారు సాధారణ ముగా యీ ద్వారంగుండా ఆ ప్రాంతంలో గల కుతుబ్‌షాహీ వంశపు రాజుల సమాధులను చూడ డానికి వెడతారు. కొండమీద కోటమధ్య భాగంలో పెక్కు పాతభవనా లున్నవి. బాలాహిసార్ లేక దుర్గం వాటిలో అన్నిటికంటె యెత్తైనది. సమాధులు కోటకు వాయవ్యంగా రమారమి 3 ఫర్లాంగుల దూరంలో ఉన్నాయి. వీటి నిర్మాణం వింతపద్ధతిలో ఉంటుంది. నలుచదరపు దిమ్మెపై గుమ్మటం ఆకారం గల నిర్మాణంచుట్టూ కొనలుదేలిన ఆర్చిగేలరీ ఉం టుంది. సమాధుల గేలరీ ఒక అంతస్థు, పెద్ద సమా ధుల గేలరీ రెండు అంతస్థులు ఉంటుంది. ప్రతి పెద్ద సమాధికి ఒక్కొక్క మసీదు లేక ముసల్లా వుంది. ఏడవ కుతుబ్‌షాహీ రాజు తల్లి అయిన హాయత్ బక్షీ బేగం సమాధికి చెందిన ఒక మసీదు నిర్మాణంలో హిందూ సాంప్రదాయం, దానికి సంబంధించిన అలం కరణ పద్ధతులు స్వేచ్ఛగా అవలంబింపబడినవి. చివరి రాజైన తానాషా దౌలతాబాదు కోటలో మరణిం చినందున యిక్కడ పూడ్చబడలేదు. కుతుబ్‌షాహీలు అవలంబించిన షియామతంపట్ల గౌరవంలేని ఔరంగ జేబు తన ఆఖరిముట్టడి సమయంలో రాజుల సమా ధులపై తుపాకు లెత్తించాడు.

గోలకొండలో యిప్పుడు వజ్రాలు లేవు. కాని పూర్వం అవి యిక్కడ కోసి, సానపెట్టబడేవి. అవి యిక్కడికి, రాష్ట్రానికి నైరుతి సరిహద్దునగల పరి టాలనుండి కృష్ణానదీతీరానగల కొల్లూరునుండి వచ్చేవి.

హైదరాబాదునగరానికి ఆగ్నేయంగా రెండు మైళ్ళ దూరానగల సరూరునగరం శివారులో సాహసి యైన ఒక ఐరోపా దేశస్థుని-ఎమ్. జోచిం రేమాండ్ సమాధి వున్నది. ఇతనికి మూసా రహీం మోసెస్ కుమారుడు అనే నామధేయం యివ్వబడింది. ఇతడు 25-3-1798 న మరణించేవరకూ మిక్కిలి పలుకు బడి కలిగి వుండేవాడట. ఈ సమాధికి సమీపంలోనే మరొక సమాధి వున్నది. దానిపై వ్రాతనుబట్టి అది ఆనీ జేన్ ఎలిజబెత్ జెంకిన్స్ అనే యువతిది. ఆమె 21 స్సర సంవత్సరాల వయస్సులోనే 26-11-1809 న మరణించినదని తప్ప ఆమెను గురించిన యితర వివరా లేమీ తెలియవు.

రేమండ్సు సమాధికి రమారమి 100 గజాల దూరంలో పిల్ల ప్రతిధ్వని ప్రదేశమున్నది. ఈ ప్రదే శంలో రాతివద్దనుండి వేసిన కేక యేదయినా, దాని అవతలకొస ముందుభాగంలోని గుట్టలోగల చిన్న లోయగుండా స్పష్టంగా ప్రతిధ్వనిస్తుంది. ఈ ప్రక్కనే నవాబ్ మోయినుద్దౌలా నిర్మించిన రాజప్రాసాద మున్నది. దర్బారు పరిసరాలలో వెంకటేశ్వరస్వామి ఆలయమున్నది. సరూరునగరంలో విక్టోరియా మెమోరియల్ అనాథ శరణాలయము, సాంకేతిక విద్యాసంస్థలుకూడా వున్నాయి. అనాథ శరణాల యంలో సుమారు 400 అనాథ బాలబాలికలకు వసతి వుంటుంది.

నగరానికి రమారమి రెండుమైళ్ళ దూరానగల ఉస్మానియా విశ్వవిద్యాలయం యెత్తైన ప్రదేశంలో వున్నది. ఈ ప్రదేశం ఒక చిన్న పట్టణంగా అభివృద్ధి చెందుతున్నది. పూర్తి అయిన భవనాలలో ఆర్ట్సు కళాశాల వున్నది. దీని నిర్మాణంలో హిందూ మహమ్మదీయ శిల్పాల రీతులు హృద్యంగా మేళ వింపబడినవి. మోటార్లు నడవడాని కనువైన చక్కని రోడ్లు, తోటలు, పార్కులు యీ చిన్నపట్టణం సౌందర్యాన్ని యినుమడింపజేస్తున్నవి. దీనికి ప్రత్యేకం రైలుస్టేషనున్నది.

హైదరాబాదు నగరపు మిక్కిలి పాతశివారు కారవాన్ అని చెబుతారు. పూర్వం నగరానికి వ్యాపారపు సరుకును తెచ్చేవర్తకులు యిక్కడ విడిసే

[తరువాయి 58 వ పేజీలో]

# నీటిపారుదల - విద్యుచ్ఛక్తి

ఇటీవల ప్రధానంగా పంచవర్ష ప్రణాళిక కార్యక్రమాలక్రింద, నీటిపారుదల, విద్యుచ్ఛక్తి, సౌకర్యాల కల్పన చురుకుగా కొనసాగుతున్నది. నాగార్జున సాగరం, తుంగభద్ర, పెన్నా ఆనకట్ట, పులిచింతల, వంశధార, కడం వగైరా పెద్ద ప్రాజెక్టులు మాత్రమేకాక, అనేక చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులు తలపెట్టబడి, కొన్ని ప్రాజెక్టులు పూర్తి అయినవికూడా. గ్రామీణ ప్రాంతాలకు కూడా విద్యుచ్ఛక్తి సప్లయి ఇతోధికంగా చేయబడుతున్నది.

మన రాష్ట్రంలో ప్రవహిస్తున్న నదీ జలాలలో కొద్ది భాగం మాత్రమే సేద్యపు నీటి వనరులకై వినియోగించుకో బడుతున్నవి. అయినా యిటీవల యీ విషయంలో మనం సాధించిన అభివృద్ధి స్వల్పమైనదని అనటానికి వీల్లేదు. ప్రకృతి మాతనుండి మనకు సంక్రమించిన యీ దివ్య జలసంపదను మరింతగా సద్వినియోగం చేసుకునే ఉద్దేశంతో యితోధికంగా ప్రాజెక్టుల నిర్మాణానికై ప్రయత్నాలు జరుగుతున్నవి.

మన రాష్ట్రంలో ఓం ప్రథమంగా నిర్మించబడిన ఆనకట్ట గోదావరి ఆనకట్ట. ఇది 1857 లో ధవళేశ్వరం వద్ద కట్టబడింది. దీనిమీద పెట్టుబడి రూ. 2.20 కోట్లు. రాబడి నూటికి 18.22 వంతులు. 8,80,500 యకరాలలో మొదటి పంటకూ, ఇదికాక అదనంగా 2,50,000 యకరాలలో రెండో పంటకూ సేద్యపు నీటి సౌకర్యాలను కలిగిస్తున్న యీ ప్రాజెక్టు ఆంధ్రావనికి ఎంతో ప్రయోజనకారిగా ఉపయోగపడుతున్నది. ఈ పదిలక్షల యకరాల ఆయకట్టు క్రింద పండించబడుతున్న పంటల మొత్తము విలువ రూ. 11.7 కోట్ల వరకు ఉంటుందని అంచనా. అంతేకాక సంవత్సరంలో 11 నెలల పాటు కాలువలో నీరుండుటచేత అది వర్తక వాణిజ్యాలలో రహదారీ సౌకర్యాలను కూడా కలిగిస్తున్నది. నీటి ద్వారా ఏటేటా సుమారు రూ. 27.11 కోట్ల విలువ గల వ్యాపారం జరుగుతున్నది.

## ఇప్పూరు వద్ద గోదావరిమీద రామపాదసాగర ప్రాజెక్టు

తూర్పు గోదావరిజిల్లా ప్రాజెక్టు ఖర్చు రు. 71.16 కోట్లు.

ప్రయోజనాలు: మొదటిపంట య. 11,86,000 లు
రెండోపంట య. 29,66,000 లు

ఈ ప్రాజెక్టు క్రింద ఇప్పూరు వద్ద 653 టి. యం. లేక 15 యం. ఎ. ఘనపు అడుగుల నీరు నిల్వగల ఒక ఆనకట్ట, పోలవరంవద్ద, నీటి మట్టాన్ని 145 అడుగులు ఎత్తు లేపుటకై ఒక బ్యారేజి, ఉత్తరపు దిశగానూ, దక్షిణ దిశగానూ వెళ్ళే కాల్వలు నిర్మింపబడుతవి. ఉత్తరపు కాల్వ 17 అడుగులలోతున ఉండి, నావికాయానానికి అనువుగా వుంటుంది. ఈ కాల్వ విశాఖపట్టణం హార్బరు వరకు వెళ్ళి సముద్రంలో కలుస్తుంది. దక్షిణ దిశగా వెళ్ళే కాలువలో కూడా నౌకాయానం జరగటానికి వీలుంటుంది. ఇది ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. ఈ రెండు కాల్వలు విశాఖపట్టణం, గోదావరి కృష్ణాజిల్లాల్లోని అన్ని ప్రాంతాలకూ వ్యాపించి 1953లో సంభవించి నటువంటి వరద ఉధృతాలు కలగటానికి అవకాశాలనుసన్నగిల జేస్తవి. ఈ ప్రాజెక్టుపై మొత్తం ఖర్చు రు. 71.16 కోట్లు. ఇందులో ఆనకట్ట నిర్మాణపు ఖర్చు రు. 27 కోట్లు, బ్యారేజి నిర్మాణానికి రు. 18.00 కోట్లు, కాలువలకు రు. 26.16 కోట్లు ఖర్చు యిమిడి వున్నది. ఈ ప్రాజెక్టు క్రింద 1,50,000 కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేయటానికి అవకాశం కలుగుతుంది.

ఆదిలాబాద్ జిల్లాలోని కుష్టాపురం వద్ద గోదావరి నదిమీద ఒక రిజర్వాయరు నిర్మించడానికి ప్రయత్నాలు జరుగుతున్నవి. ఇక్కడి ఉత్తరపు కాల్వ ఒక రిజర్వాయరు సహాయంతో గోదావరి ఉపనది అయిన కడం మీదుగా తీసుకుపోబడుతుంది. ఈ రిజర్వాయరు, కాలువ ఇప్పుడు నిర్మాణంలో వున్నవి. ఈ కాలువ 48 మైళ్ళ పొడవున త్రవ్వబడుతుంది. కడం నదీ జలాలతో యీ కాల్వ 67,000 యకరాలకు నీటి సప్లయి చేయటానికి వినియోగ పడుతుంది.

మరొక బహుళార్థ సాధక ప్రాజెక్టు క్రింద, గోదావరి నదిమీద యింకా రెండు రిజర్వాయర్ల నిర్మాణం కూడా ఆలోచనలోవుంది. ఇక్కడినుండి రెండు కాల్వలు నది రెండు వైపులా ప్రవహిస్తూ అదిలాబాదు, నల్లగొండ ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామాబాదు జిల్లాల, లోను, బొంబాయి రాష్ట్రంలోని నాందేడు జిల్లాలోనూ

మొత్తం 20 లక్షల యకరాల భూమిని సాగులోకి తీసుకుని వస్తవి. ఈ పథకం క్రింద ఖర్చు అంచనా రు. 85 కోట్లు. దీని క్రింద 1,44,000 కిలోవాట్ల జలవిద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుంది.

## కృష్ణానది

కృష్ణానదిపై విజయవాడ వద్దగల ఆనకట్ట రు. 2.28 కోట్ల ఖర్చుతో నిర్మించబడింది. దీనిపై రాబడి నూటికి 16.3 వంతులు. ఆనకట్ట పొడవు 6 ఫర్లాంగులు. దీని క్రింద 95,000 చ. మై. విస్తీర్ణంలోని పొలాలకు సేద్యపు నీటి సౌకర్యాలు లభిస్తున్నవి. విజయవాడనుండి వస్తున్న కృష్ణ కాల్వ ఏలూరువద్ద గోదావరి పడమటి కాలువతో కలుస్తున్నది. ఈ విధంగా గోదావరి కాలువ, గుంటూరు నుండి మద్రాసుకు వెళుతున్న బకింగ్‌హాం కాలువతో కలుపబడుతున్నది. కృష్ణానది కాలువలో సంవత్సరంలో 10 నెలలపాటు పడవలు ప్రయాణము చేయవచ్చు. ఈ పడవలద్వారా రు. 44.59 లక్షల విలువగల కలప వ్యాపారం, రు. 16.35 లక్షల విలువగల ఇతర వ్యాపారము ప్రతి సంవత్సరం జరుగుతున్నది.

1935 లో పులిగడ్డ అని పిలువబడుతున్న కృష్ణ పాయ మీద కాంక్రీటుతో మరొక అడ్డకట్ట నిర్మించబడింది. దీనిక్రింద 77,000 యకరాలు సాగవుతున్నది. ఈ ఆనకట్ట నిర్మాణానికి అయినఖర్చు రు, 58,00,000. దీని క్రింద రాబడి నూటికి 7.76 వంతులు.

## కృష్ణా బ్యారేజి

ఖర్చు రు. 230.00 లక్షలు

(నీటి పారుదల ఖర్చుమాత్రమే)

ప్రయోజనాలు-46,000 యకరాలు-కృష్ణాజిల్లాలో-

71,000 యకరాలు గుంటూరు జిల్లాలో

ఆంధ్రప్రభుత్వం ఆమోదించిన వాటిలో యిదే మొట్టమొదటిప్రాజెక్టు. ప్రథమ పంచవర్ష ప్రణాళికను సవరించటముద్వారా యీప్రాజెక్టు దానిలోచేర్చబడింది. విజయవాడ వద్దగల ఆనకట్టపై యిప్పటితలుపులకు పైభాగంలో ఒక బ్యారేజి నిర్మాణం యీ ప్రాజెక్టుద్వారా ఉద్దేశించబడింది. ఇక్కడి రెగ్యులేటర్‌లో ఒక్కొక్కటి 40 అడుగుల వెడల్పుగల 70 ద్వారాలు వుంటవి. ఒక్కొక్క ద్వారంలో ఒకవైపు 6, రెండోవైపు 8 సందులువుంటవి. ఈ పథకములోనే 24 అడుగుల వెడల్పుగలిగి, యిరువైపుల 5 అడుగుల కాలిబాటలుగల రోడ్డు వంతెన నిర్మాణం కూడా చేర్చబడింది. ఈ నిర్మాణము అంతా 1957 లో పూర్తి అవుతుందని అంచనా.

## నాగార్జునసాగర్ ప్రాజెక్టు

ఇది- ఆంధ్ర ప్రదేశ్ అవతరణా త్పూర్వమున్న-ఆంధ్ర హైదరాబాదు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టును ప్రథను పంచవర్ష ప్రణాళికలో చేర్చటానికి ప్రణాళికా సంఘంవారు అనుమతించారు. దీని నిర్మాణం ప్రారంభమయింది కూడా.

ఈ ప్రాజెక్టుక్రింద కృష్ణానదిమీద నందికొండవద్ద ఒక రిజర్వాయర్ నిర్మాణము, ఆనకట్టకు యిరువైపులా రెండు కాల్వల నిర్మాణమూ ఉద్దేశించబడింది. కుడి కాల్వ క్రింద మొత్తం 21.83 లక్షల యకరాలు సాగవుతుంది. ఇందులో, యీ కాల్వక్రిందగల ఆయకట్టు 14.70 లక్షల యకరాలుకాక అదనంగా పులిచింతల కుడి కాల్వ క్రింద 2 లక్షల యకరాలు, బాపట్ల, కనుపూరు కాల్వల క్రింద 1.88 లక్షల ఎకరాలు, కృష్ణా డెల్టాలోని 3.25 లక్షల యకరాలుకూడా చేరివున్నవి. పోతే ఎడంవైపు కాలువ, ఆంధ్ర రాష్ట్రంలోని నందిగామ తాలూకాలో 2.05 లక్షల యకరాలలో మొదటిపంట కేకాక, అదనంగా హైదరాబాదు రాష్ట్రంలో 6.75 లక్షల యకరాల్లో మొదటిపంటకూ, 1.20 లక్షల ఎకరాల్లో రెండో పంటకూ సాగు నీటి సప్లయి సౌకర్యాలు కలుగజేస్తుంది. ఈ ప్రాజెక్టుక్రింద సాగు సౌకర్యాలు కలిగే మొత్తము ఆయకట్టు విస్తీర్ణం 31.83 లక్షల యకరాలు.

ఈ పథకంక్రింద మొత్తం ఖర్చు రు. 122.02 కోట్లు. ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన పనులను, ఇండియా ప్రభుత్వంచే నియమించబడిన నాగార్జున సాగర్ బోర్డు వారు నిర్వహిస్తున్నారు. పోతే, కాలువలు, మట్టిపనులు వగయిరా, ఆంధ్ర, హైదరాబాదు రాష్ట్ర ప్రభుత్వాలే, ఆయాచోట్ల నిర్వహిస్తున్నవి. ఈ ప్రాజెకు రెండు దశలుగా నిర్మించబడుతున్నది.

తుంగభద్రనది మీద ఒకబహుళార్థ సాధక ప్రాజెక్టుతలపెట్టబడింది. దీని క్రింద హొస్పేటవద్ద ఒక రిజర్వాయరు, రెండు పంటకాల్వలు నిర్మించబడుతున్నవి. ఈ ప్రాజెక్టు క్రింద 1945 లో పనిప్రారంభమయింది. ఆనకట్ట నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. సాగుకు నీటిసౌకర్యం మొట్టమొదటిసారిగా 1953 లో కల్పించబడింది. ఈ ప్రాజెక్టు క్షామపీడిత ప్రాంతంగా ప్రసిద్ధిచెందిన రాయలసీమకు సస్యసమృద్ధి వరప్రదాతగా ఉపకరించగలుగుతుంది. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే, దీని క్రింద 10 లక్షల యకరాల భూమి సాగులోకి వస్తుంది.

## తుంగభద్ర దిగువ కాలువ

తుంగభద్ర ప్రాజెక్టుక్రింద బళ్ళారిజిల్లా మల్లాపురం వద్ద ఆనకట్ట నిర్మింపబడు తుంది. సుమారు రెండుమైళ్ళ పొడవుగల యీ ఆనకట్ట మూడు భాగాలుగా వుంటుంది. 5942 అడుగుల పొడవున మట్టికట్ట, యిందులో మధ్యభాగాన 23,00 అడుగులమేర నీటిమార్గం, ఎడంవైపున 450 అడుగుల పొడవున కొద్ది ఎత్తులో మట్టికట్ట, ఎడంవైపు చివరిలో 1550 అడుగుల పొడవున ఆనకట్ట. కుడి

వైపునగల దిగువకాల్వ మైసూరు రాష్ట్రంలోని హాస్పేట బళ్ళారి, సిరిగుప్ప తాలూకాలలో 91,838 యకరాలు, ఆంధ్రరాష్ట్రంలోని ఆలూరు, ఆదోని, ప్రత్తికొండ, కర్నూలు తాలూకాల్లో, 1,56,913 యకరాల భూమిని సాగులోకి తెస్తుంది. యిది కాక 45,000 కిలోవాట్ల విద్యుచ్ఛక్తి రెండు గనలలో ఉత్పత్తి చేయ బడుతుంది. ఈ పథకం క్రింద అయ్యేఖర్చు ఆంధ్రరాష్ట్రం వంతుకు రు. 12·44 కోట్లు వస్తుంది.

## తుంగభద్ర ప్రాజెక్టు - ఎగువకాలువ

తుంగభద్ర ఆనకట్టకు కుడివైపునవదలిన 10 తూముల గుండా నీరు తీసుకుని తుంగభద్ర ఎగువకాల్వ, రాయల సీమలోని బళ్ళారి, అనంతపురం, కడపజిల్లాలలోని ప్రాం తాలను సాగుచేస్తుంది. ఈ కాలువ 116 మైళ్ళ పొడ వున ప్రవహించి, గుంతకల్లు బ్రాంచీలో కలుస్తుంది. అక్కడినుండి, మిగిలిన నీరు ఒక కాల్వగుండా పోయి 250 అడుగుల ఎత్తున పెన్నానదిలో పడుతుంది. ఇక్కడ 20,000 కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి అవకాశం ఉంది. పెన్నానదిలోని నీరు, తుంగభద్ర నుండి వచ్చిన నీరు కలిసి ప్రవహించగా ఈనీరు కొనమనాయనిపల్లి - పోనకోచెర్ల - వద్ద గల పెన్నానది రెగ్యులేటర్ద్వారా సాగుకు వినియోగించబడుతున్నది. ఇక్కడినుండి పెన్నకు యిరువైపుల రెండుకాల్వలు త్రవ్వబడినవి. దక్షిణపు కాల్వలోని నీటిలో కొంతభాగం చిత్రావతి నదిలో కలు స్తుంది. గొడ్డుమారి వద్దగల ఆనకట్టద్వారా యీ నీటిని కడపజిల్లాలోని పులివెందల ప్రాంతాలకు వినియోగిం చటం జరుగుతున్నది. పెన్న చిత్రావతి నదుల్లోని మిగిలిన భాగం నీరు మైలవరంవద్దగల గండికోట ఆనకట్టవద్ద నిలుపబడి, అక్కడినుండి యిరువైపులగల రెండు కాల్వల ద్వారా సేద్యానికి వినియోగించబడుతున్నది.

ఈ కాల్వలన్నిటి క్రింద కలిసి మొత్తం ఆయకట్టు 3,80,000 యకరాలు సాగవుతుంది. యిందులో 1,02,900 యకరాలు మైసూరు రాష్ట్రానికి చెందిన భూమి. ఈ ప్రాజెక్టు క్రింద మొత్తం ఖర్చు అంచనా రు. 21 4 కోట్లు.

## చిన్న, మధ్యతరహా, ప్రాజెక్టులు

మహబూబ్నగర్ జిల్లాలోని పెద్దవాగుమీద రిజర్వా యర్ నిర్మాణమై, కోయిల్సాగర్ ప్రాజెక్టు క్రింద అప్పుడే నీటిపారుదల ప్రారంభమయినది. ఇక్కడ మట్టితో ఆనకట్ట, కంపోజిట్ ఆనకట్ట, యిరువైపుల కాల్వలుగల నీటిమార్గం ఏర్పాటుచేయబడుతవి. ఈ ప్రాజెక్టుక్రింద రు 88 లక్షలు ఖర్చు అవుతుంది. దీనిక్రింద సాగుఅయ్యే భూమి 12,000 ఎకరాలు. మహబూబ్నగర్ జిల్లా లోని చిన్న వాగుమీద రిజర్వాయరు నిర్మాణం సర్లసాగర్ ప్రాజెక్టుక్రింద జరుగుంది. ఇక్కడ రెండు చివరలలో మట్టికట్ట, మధ్యలో సైఫిన్ నీటిమార్గం నిర్మించబడుతవి. దీనిఖర్చు రు. 30 లక్షలు; సాగు 4,800 యకరాలు.

నల్లగొండ జిల్లాలో మూసీనది మీద రు.118·14 లక్షల వ్యయంతో రిజర్వాయరు నిర్మాణం జరుగుతున్నది. చివర లలో మట్టికట్ట, ఓగి నీటిమార్గం ఇక్కడ ఏర్పరచబడు తున్నది. ఇది పూర్తి అయితే 42,000 యకరాలభూమి సాగులోకి వస్తుంది.

నల్లగొండజిల్లాలో భీమనపల్లి ప్రాజెక్టు క్రింద గండ్లు పడి పూడిపోయిన ఒక పురాతన చెరువుకు రు. 8 లక్షల ఖర్చుతో మరమ్మతు సాగుతున్నది. దీని క్రింద 18,600 యకరాలు సాగవుతుంది.

ఇదికాక యింకా వివిధజిల్లాలలో అనేక చెరువులు- వీటిలో కొన్ని చాలా పురాతనమైనవి- క్రింద సేద్యపు నీటి సౌకర్యం లభిస్తున్నది. ఈ నీటి వనరులను మరమ్మతు చేసి, బాగు చేయటంతోపాటు, నీటిపారుదల సౌకర్యాల శాఖవారు అనేక రిజర్వాయర్లను కొత్తగా నిర్మించారు. వీటిలో - నిజాంసాగర్, పోచారం, పాలేరు, పెండ్లి పాకల, బైతపల్లి, సింగభూపాలం, దిండి, చంద్రసాగర్, మానేరు రిజర్వాయర్లు ముఖ్యమైనవి. మూసీనది వరదల నిరోధానికై దీనిరెండుపాయలమీదకట్టిన ఉస్మాన్సాగర్, హిమాయత్సాగర్ చెరువులు హైద్రాబాదు, సికింద్రా బాదు జంటనగరాలలో నీటి సప్లయి నిమిత్తం వినియో గించబడుతున్నవి. నిజాంసాగర్ అనకట్టకు 94 మైళ్ళ ఎగువన మంజీరా నదిమీద సిర్వార్ గ్రామంవద్ద కట్టబో తున్న దేవనూరు ఆనకట్ట నిర్మాణంతో జంటనగరాల నీటి సప్లయి యింకా 15 క్యూసెక్కుల వరకు పెరగ డానికి అవకాశం ఏర్పడుతుంది.

ఆదిలాబాదు జిల్లాలో పెంగంగమీద ఒక ప్రాజెక్టు యింకా పరిశీలన చేయవలసివుంది.

1860 లో పెన్నానదిమీద నెల్లూరు, సంగం వద్ద ఆనకట్టలు నిర్మించబడినవి. సంగం వద్దనుండి కనిగిరి, దువ్వూరు చెరువుల్లోకి కాలువలు ప్రవహిస్తవి. మరొక కాల్వ నెల్లూరు చెరువులకు నీటి సప్లయిచేస్తుంది. నెల్లూరు ఆనకట్టకు 20 మైళ్ళ దిగువన ఇంకొక కాలువ సర్వేపల్లి వగయిరా ప్రాంతాల చెరువులకు నీరు సప్లయిచేస్తుంది. ఈ రెండు ఆనకట్టలక్రింద 1,67,500 యకరాల సాగు అవుతుంది. వీటికి అయిన ఖర్చు రు. 71 లక్షలు. వీటిపై అదాయము నూటికి 5.88 వంతులు. మోపాడువద్ద 1921 లో రు. 24 లక్షల ఖర్చుతో ఒక రిజర్వాయరు నిర్మించబడింది. దీనిక్రింద ఆయకట్టు 7 వేల యకరాలు. ఈ పెట్టుబడిమీద 1951-52 లో ఆదాయం నూటికి 0.61 వంతులు.

## సోమసిలవద్ద పెన్నానది ఆనకట్ట

ఖర్చు : రు. 2222.00 లక్షలు

ప్రయోజనాలు : మొదటి పంట 6,50,000 ఎకరాలు
రెండోపంట 1,75,000 ఎకరాలు

దీనిక్రింద పెన్నానదిమీద సోమసిలవద్ద నదీ మట్టానికి 345 అడుగుల ఎత్తున 199 టి. యం. ఘనపు అడుగుల నీరు నిల్వగల ఒక రిజర్వాయరు నిర్మించబడుతుంది. ఆన కట్టకు ఒకమైలు దిగువన ఒక గ్యారేజి నిర్మింపబడి, దాని ద్వారా నెల్లూరు దక్షిణ కాల్వలోకి నీరు పోతుంది. ఈ కాల్వక్రింద నెల్లూరుజిల్లాలో 3.33 లక్షల యకరాలు సాగవుతుంది. కావలి కాలువ—1.10 లక్షల యకరాలు— కనుపూరు కాలువ 0.78 లక్షల యకరాలు—పెన్నానది మీద సంగం ఆనకట్టనుండి ప్రారంభమవుతుంది. సోమసిల ఆనకట్ట పూర్తి అయ్యేలోగా, కావలి కనుపూరు కాల్వ లకు నాగార్జునసాగరు కుడివైపు కాల్వగుండా నీరు సప్లయి చేయబడుతుంది. సోమసిల ఆనకట్ట నిర్మాణం వల్ల పెన్నా డెల్టాలో ప్రస్తుతం సాగులోవున్న 1.29 లక్షల యకరాల ఆయకట్టుకు నీటి సౌకర్యం స్థిరంగా లభిస్తుంది. అంతేకాక 1.75 లక్షల ఎకరాలలో రెండో పంటకు నీటి సప్లయి జరుగుతుంది. ఈ ఆనకట్ట వరద నిరోధక సాధనంగా కూడా వుపయోగపడుతూ ఇప్పుడు వరదల ద్వారా సంభవిస్తున్న కష్ట నష్టాలకు స్వస్తిచెప్ప గలుగుతుంది. ఈ ప్రాజెక్టు మీద మొత్తం ఖర్చు రు. 2,222 లక్షలు.

కడప-కర్నూలు కాల్వను 1870 లో ఒక ఇంగ్లీషు కంపెనీ వారు నిర్మించి దానిని రు. 3.02 కోట్లకు ప్రభుత్వం వారికి విక్రయించారు. దీని క్రింద ఈ రెండు జిల్లాలలో 75,500 యకరాలు సాగవుతున్నవి. ఈకాల్వ తుంగభద్ర మీదగల సుంకేశుల ఆనకట్టవద్ద ప్రారంభమై నదికి సమానాంతరంగా 50 మైళ్లు ప్రయాణంచేసి, తర్వాత కడపజిల్లా వైపుకు తిరిగి పోతుంది.

## కడప-కర్నూలు కాలువ అభివృద్ధి

ఖర్చు : రు. 394 లక్షలు

ప్రయోజనాలు : 3,00,000 యకరాలు మెట్ట మాగాణి.

తుంగభద్రపైగల సుంకేశుల ఆనకట్టవద్ద 3 అడుగుల పట్టర్లు నిర్మించి, కట్టను యింకా బలపరచి, క్రొత్తగా ఒక స్లూయిజ్ నిర్మించడం యీ కార్యక్రమంలో ప్రధా నాంశాలు. అంతేకాక యీ పథకం క్రింద కాలువను మొదటి 74 మైళ్ళ వరకు పునర్నిర్మించటం, వెడల్పు చేసి 8.5 అడుగులనుండి 9 అడుగుల వరకు లోతు పెంచుట, కాలువ లోపలిభాగం ప్రక్క భాగాలు 4 అంగుళాల కాంక్రీటుతో చదును చేయుట మొదలైన కార్యక్రమం కూడా చేరివున్నది. ఈ పనులన్నీ 1957-58 సంవత్సరానికి పూర్తి అవుతవి.

విశాఖపట్నం జిల్లా నాగవల్లి డెల్టాలో తోటపల్లి వద్ద 1909 లో ఒక రెగ్యులేటరు నిర్మించబడింది. 22 మైళ్ళ పొడవున త్రవ్వబడిన యిక్కడి కాలువక్రింద 27,900 యకరాలు సాగవుతున్నది. దీనికిగాను అయిన ఖర్చు రు. 18 లక్షలు. రాబడి నూటికి 2.3 వంతులు.

గుంటూరుజిల్లాలోని భవనాసి ప్రాజెక్టు క్రింద 700 యకరాల భూమి సాగవుతున్నది. దీనిపై జరిగిన ఖర్చు రు. 2.65 లక్షలు. రాబడి నూటికి 0.31 వంతులు.

గోదావరి డెల్టాలో నిర్మించబడిన పోలవరం ప్రాజెక్టు క్రింద 17,500 యకరాలు సాగుచేయబడుతున్నది, దీనికి అయిన ఖర్చు రు. 1.7 లక్షలు. రాబడి నూటికి 5.5 వంతులు.

1900 లో పూర్తి అయిన శ్రీకాకుళం ప్రాజెక్టు క్రింద 68,000 యకరాలు సాగవుతున్నది. దీనిపై జరి గిన ఖర్చు రు. 2,89,000 లు, రాబడి నూటికి ఒక వంతు. 1866 లో పూర్తి అయిన కంభం చెరువు క్రింద 6000 యకరాలకు నీటి సప్లయి జరుగుతున్నది. దీనికి అయిన ఖర్చు రు. 86,000 లు.

రూ. 1,29,000ల ఖర్చుతో 1909లో నిర్మించబడిన మార్కాపురం చెరువు క్రింద 1701 యకరాల భూమి సాగవుతున్నది.

మునియేరు మీద 1898 లో రు. 6,09,600 ఖర్చుతో కట్టబడిన ఆనకట్ట క్రింద 10,580 యకరాల విస్తీర్ణం సాగవుతున్నది.

మద్రాసునుండి కాకినాడ వరకుగల బకింగ్‌హాం కాలువలో ప్రతి సంవత్సరం 20 కోట్ల విలువగల వ్యాపారం జరుగుతున్నది. దీనిపై జరిగిన ఖర్చు రు. 95.72 లక్షలు.

ఈ కాల్వ 5 జిల్లాలగుండా ప్రవహిస్తూ, వాటిని ఒక దానితో ఒకటి కలుపుతున్నది.

క్రొత్తగా తలపెట్టబడిన నీటిపారుదల పథకాలలో భైరవానితిప్ప, ఎగువ పెన్నారు ప్రాజెక్టులు అనంతపురం జిల్లాకూ, రొంపేరు మురుగుపథకం గుంటూరు జిల్లాకూ, రాళ్ళపాడు ప్రాజెక్టు - ద్వితీయదశ - నెల్లూరుజిల్లాకూ ఉపయోగపడతవి. ఈనాలుగు ప్రాజెక్టులు పూర్తి అయి నప్పుడు వీటిక్రింద మొత్తం 34,000 యకరాలు సాగ వుతుంది.

## భైరవానితిప్ప ప్రాజెక్టు

ఖర్చు : 130 లక్షలు.

ప్రయోజనాలు : 8,500 యకరాలు - అనంతపురం జిల్లాలో.

1951లో ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం యీపథకాన్ని ప్రారంభించింది. కాని మైసూరు రాష్ట్రంతో ఒడంబడిక కుదుర్చుకొనేవరకూ యీ ప్రాజెక్టు క్రింద కార్యక్రమ నిర్వహణ నిలుపుచేయబడింది. ఆంధ్రప్రభుత్వం మైసూరుతో యీ ఒడంబడికను సాధించింది. ఈ ప్రాజెక్టుక్రింద హగరి అని పిలువబడుతున్న వేదవతినదిమీద ఒక రిజర్వాయరు నిర్మాణం జరుగుతుంది. దీనిలో 2,000 యం. సి. క్యూబిక్ అడుగుల నీరు నిల్వచేసే సౌకర్యం ఉంటుంది. రాయదుర్గం కల్యాణదుర్గం తాలూకాల్లో 8,500 యకరాలకు నీరు సప్లయి చేయడానికై ఒక మట్టిఆనకట్టకూడా యిక్కడ నిర్మించబడుతుంది. ఈపని అంతా 1956-57 లో పూర్తి అవుతుంది.

## ఎగువ పెన్నా ప్రాజెక్టు

ఖర్చు : రు. 144 లక్షలు.

ప్రయోజనాలు : 9500 య. అనంతపురం జిల్లాలో.

ఈపథకంక్రింద పేరూరు గ్రామంవద్ద పెన్నానది మీద 2330 యం. సి. ఘనపు అడుగుల నీరు నిల్వచేయగల ఒక రిజర్వాయరు నిర్మాణం జరుగుతుంది. 1951 లో ఈపథకాన్ని ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ప్రాంతంలో కరువునివారణ కార్యక్రమంగా యిక్కడి కార్మికులచేత, పథకం క్రింద ముఖ్యమైన కాలువ త్రవ్వబడింది. కాలువకట్టడం పనులుకూడా నిర్వహింపబడినవి. 1956 చివరకు యీ కార్యక్రమం పూర్తి అవుతుంది.

## వంశధార ప్రాజెక్టు

ఖర్చు : రూ. 1256·63 లక్షలు.

ప్రయోజనాలు: మొదటి పంట 2,06,750 ఎకరాలు
రెండోపంట 50,000 ,,
శ్రీకాకుళం జిల్లా.
జనుము 36,000 ,,

ఈ పథకం శ్రీకాకుళం జిల్లాలోని కరువు ప్రాంతాలకు ఉపయోగిస్తుంది. ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో చేర్చబడిన క్రొత్తపథకాలలో ఇది ఒకటి. దీనిక్రింద గొట్టవద్ద ఆనకట్ట నిర్మింపబడుతుంది. ఇక్కడ ఏర్పడే రిజర్వాయరులో 19,173 యం. సి. ఘనపు అడుగుల నీరు నిలుస్తుంది. కుడివైపు కాలువ పొడుగు $33\frac{1}{4}$ మైళ్లు, దీనిక్రింద ఆయకట్టు 72,750 యకరాలు. ఎడంవైపు కాలువ పొడుగు60 మైళ్లు, ఆయకట్టు 1,34,000 యకరాలు.

## పులిచింతల ప్రాజెక్టు

ఖర్చు : రు. 3220 లక్షలు.

ప్రయోజనాలు : మొదటిపంట 3,91,000 యకరాలు.
రెండోపంట 1,50,000 గుంటూరుజిల్లాలో

ఈ పథకం క్రింద పులిచింతల వద్ద కృష్ణానదిపై ఆనకట్ట నిర్మాణం తలపెట్టబడింది. 187 మైళ్ళ పొడవున పారే కుడివైపు కాల్వక్రింద 391 లక్షల యకరాలకు నీటి పారుదల లభిస్తుంది. తిరువూరు, నూజివీడు, గన్నవరం తాలూకాలలో, నందికొండ, రామపాదసాగర కాలువల ద్వారా నీరు అందిన ప్రాంతాల ప్రయోజనార్థం పులిచింతల ఎడంకాల్వ త్రవ్వబడుతుంది. ఈ పథకం రెండు దశల్లో జరుగుతుంది. 1. యఫ్. అర్. యల్. 196.5 2. యఫ్. ఆర్. యల్. 224.5 కృష్ణాడెల్టాలోని ప్రాంతాలకు నీటి సప్లయి యీ ఆనకట్ట నిర్మాణంవల్ల స్థిరపడడమే కాక 1.5 లక్షల యకరాలలో కృష్ణాడెల్టాలో రెండు పంటలకు నీటి సప్లయి జరుగుతుంది. 30,000 కి. వా. విద్యుచ్ఛక్తి 1.21 లక్షల కి. వా. సీజనల్ విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి కూడా అవకాశం కలుగుతుంది. ఈ ప్రాజెక్టు ప్రాథమిక పరిశీలన పూర్తి అయింది.

## సిద్ధేశ్వరం ప్రాజెక్టు

ఖర్చు : 33,94,000 లక్షలు

ప్రయోజనాలు: మొదటిపంట 3,63,000యకరాలు
రెండోపంట 3,00,000ఎ. కర్నూలుజిల్లా

ఈ పథకం క్రింద కృష్ణానది మీద సిద్ధేశ్వరం వద్ద 160 అడుగుల ఎత్తున ఆనకట్ట నిర్మించ బడుతుంది. 190 టి. యం. ఘనపు అడుగుల నీరు నిల్వచేయగల రిజర్వాయరు ఏర్పడి, కర్నూలు, కడప జిల్లాలలో 2.63 లక్షల యకరాలకు సేద్యపు నీటి సౌకర్యం లభిస్తుంది. ఇక్కడ 30,000 కి. వా. విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయటానికి కూడా ప్రతిపాదనలు జరిగినవి. ఈ ప్రాజెక్టు ప్రారంభమైనప్పటినుండి పూర్తికావడానికి ఏడు సంవత్సరాలు పడుతుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను సమగ్రంగా పరిశీలన జరుపవలసి ఉన్నది.

# విద్యుచ్ఛక్తి

థర్మల్, జల విద్యుచ్ఛక్తులు రెండూ మన రాష్ట్రంలో కొంతవరకు అభివృద్ధి చేయబడినవి. అయినా ఇంకా సాధించవలసిన అభివృద్ధి చాలా వున్నది. పంచవర్ష ప్రణాళిక క్రింద, విద్యుచ్ఛక్తి అవకాశాలను క్రమక్రమంగా పెంచుకోవాలనే ఆశయంతో కృషి జరుగుతున్నది.

మంజీరా నదీజలాలనుండి విద్యుచ్ఛక్తి ఉత్పత్తిచేసే పథకంలో ప్రథమ దశగా నిజాంసాగర్ జల విద్యుత్కేంద్రము స్థాపించబడింది. నిజాం సాగర్ రిజర్వాయరులోకి నీటిని తీసుకునే కర్మాగారాలకు దిగువలో యీ స్టేషను నిర్మించబడింది. ఈ విద్యుత్కేంద్రం 65 అడుగుల నీటి ప్రవాహాన్ని గ్రహించి, 720 నుండి 3000 క్యూసెక్కుల నీటిని వదలివేస్తుంది. 5,000 కి. వా. 11,000

వోల్టుల ఎ. సి. జెనరేటర్లకు నేరుగా కలుపబడిన మూడు నిడుపు రకం కప్లాన్ టర్బైన్లు యిక్కడ స్థాపించబడినవి. ప్రధాన విద్యుత్ సరఫరా యంత్రాలకు వీటిని యూనిట్ విధానంమీద కలిపివేయటంజరిగింది, దీనిద్వారా 66,000 వోల్టులవరకు సరఫరా హెచ్చించబడి, 64 మైళ్ళ పొడవున గల జంట విద్యున్మార్గం ద్వారా హైదరాబాదుకు విద్యుచ్ఛక్తి సరఫరా జరుగుతున్నది. హుసేన్ సాగర్ థర్మల్ విద్యుత్కేంద్రంతో యీ కేంద్రము అనుబంధించబడింది.

అజమాబాదు థర్మల్ విద్యుత్పథకం క్రింద, కాజీపేట బల్హార్షా మధ్య గ్రాండ్ ట్రంక్ మార్గం మీదగల రామగుండంవద్ద 37,500 కి. వా. థర్మల్ విద్యుత్కేంద్రమొకటి నిర్మింపబడింది. ఈ కేంద్రానికి 20 మైళ్ళ దూరములో గల బెల్లంపల్లి బొగ్గుగనులనుండి యిక్కడికి అవసరమయిన బొగ్గు సప్లయి జరుగుతుంది. ఈ కేంద్రానికి సమీపంలోనే బొగ్గు గనులను త్రవ్వటానికి కూడా అవకాశాలు వున్నవి. ఒక్కొక్కటి 12,500 కి. వా. శక్తి గల మూడు టర్బో-ఆల్టర్నేటర్లు, వాటికి అవసరమయిన బాయిలర్లు, యితర యాంత్రిక పరికరాలతో సహా యిక్కడ స్థాపింపబడినవి. ముందుముందు 12,500 కి. వా. లేక 20,000 కి.వాట్ల శక్తిగల యాంత్రిక సామగ్రి కూడా యిక్కడ ఏర్పరబడవచ్చు. ఇక్కడి పవర్ హౌస్ విద్యుత్ సరఫరా ప్రారంభించింది.

ఇక్కడి విద్యుచ్ఛక్తి, హైదరాబాదు నగరంలో విద్యుచ్ఛక్తి సప్లయికి వినియోగ మవటమే కాకుండా, కరీంనగరు, నల్లగొండ, మెదక్, ఆదిలాబాదు, వరంగల్లు జిల్లాలకుకూడా సరఫరా చేయబడుతుంది. ప్రారంభంలో 21 పెద్ద పట్టణాలు, గ్రామాలకు విద్యుచ్ఛక్తి సప్లయి చేస్తూ, సిమెంటు, బొగ్గు వగయిరా ప్రధాన పరిశ్రమలకు కూడా యీ విద్యుచ్ఛక్తి అందించబడుతుంది. రామగుండంనుండి హైదరాబాదుకు 125 మైళ్ళ పొడవున 66,000 వోల్టుల జంట విద్యున్మార్గం నిర్మింపబడి, మార్గమధ్యములో పెద్దపల్లి, కరీంనగర్, సిద్దిపేట గ్రామాలకు విద్యుచ్ఛక్తి సప్లయి జరుగుతుంది. ఇదికాక రామగుండం నుండి మంచిర్యాలకు 66,000 వోల్టుల జంట విద్యున్మార్గం మరొకటి నిర్మింపబడుతుంది. ఈ మార్గం ముమ్ముందు సిరిపూర్ కాగజ్నగర్ వరకు పొడిగింపబడడానికి అనువుగా వుంటుంది. యింతేకాక గ్రామీణ ప్రాంతాలకు విద్యుచ్ఛక్తి సప్లయి చేయటానికై అనేక 33,000 కి. వా. విద్యున్మార్గాలు, వీటికి అనుబంధంగా 11,000 కి. వా. 440 కి. వా. మార్గాల నిర్మాణానికి కూడా భవిష్యత్తులో అవకాశం ఉంటుంది. ఈ పథకం క్రింద మొత్తం రు. 406 లక్షలు ఖర్చు జరుగుతుంది. ఒక బాయిలరు, కూలింగ్ టవరు, అదనంగా యింకా సరఫరామార్గాలు, ముమ్ముందు రు. 75 లక్షల ఖర్చుతో ఏర్పాటు చేయబడతవి.

మంచిర్యాల, అజమాబాదు, పెద్దపల్లి, కరీంనగరు, ములుగు, కమ్యూనిటీ ప్రాజెక్టుప్రాంతాలకు విద్యుచ్ఛక్తి సప్లయి నిమిత్తం అయిదు పథకాలు ప్రారంభింపబడినవి. లిఫ్టులద్వారా సేద్యపు నీటి పారుదల కల్పించే విధానాలకుగాను యీ ప్రాంతాలలో అవసరమయ్యే విద్యుచ్ఛక్తి గరిష్ట మొత్తం 32,00 కి. వా. వరకు వుండవచ్చునని అంచనా వేయబడుతున్నది. దీనివల్ల 20,000 యకరాల భూమికి సేద్యపు నీటి పారుదల సౌకర్యాలు లభిస్తవి.

హుసేన్సాగర్ థర్మల్ విద్యుత్కేంద్రంలో 24000 కి. వా. విద్యుచ్ఛక్తి ఉత్పత్తిచేయగల యంత్రాలు స్థాపించబడినవి. దీని క్రింద 22[illegible] సబ్స్టేషన్లు, 223 మైళ్ళ పొడవున విద్యుత్ సరఫరా మార్గాలు నిర్మించబడినవి. రామగుండం, నిజాంసాగర్ స్టేషన్లను హైదరాబాదుతో అనుబంధించటంద్వారా, ఎనిమిది కీలక సబ్స్టేషన్లు, 44 కి. వా. మెయిన్లు, 6.6 కె. వి. పద్ధతితో సరఫరా విధానాన్ని పునర్నిర్మించుట వగయిరా సౌకర్యాలతో నగర విద్యుచ్ఛక్తి సప్లయి పథకాన్ని పునర్నిర్మించవలసియున్నది.

ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన అనంతరం సవరించబడిన రాష్ట్ర విద్యుచ్ఛక్తి పథకాల ప్రథమ పంచవర్ష ప్రణాళికలో రు. 24.53 కోట్లు కేటాయించబడింది. రాష్ట్ర ప్రథమ పంచవర్ష ప్రణాళిక మొత్తం కేటాయింపు రు. 66.42 కోట్లలో విద్యుత్ప్రణాళికల మొత్తం నూటికి 37 వంతులు.

ప్రథమ ప్రణాళిక ప్రథమార్థంలో, ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం హయాంలో, ఆంధ్రరాష్ట్ర ప్రాంతాలలో విద్యుత్పథకాల క్రింద అంతగా అభివృద్ధి సాధింపబడలేదు. నూతన ఆంధ్రరాష్ట్రంలో అభివృద్ధికి మార్గం చక్కబరచబడింది. ప్రణాళిక లక్ష్యాలు పూర్తిగాసిద్ధించినవి. కొన్ని సందర్భాలలో లక్ష్యాలకు మించిన ఫలితాలుకూడా లభ్యమైనవి.

మొదటి రెండు సంవత్సరాలకాలంలో ఒక్కొక్క సంవత్సరానికి విద్యుత్ప్రణాళికల క్రింద పెట్టుబడి ఖర్చు రు. 3 న్నర కోట్లవరకు జరిగింది. ప్రణాళిక ద్వితీయార్థంలో యీ పెట్టుబడి ఖర్చులు దాదాపు రెండింతలైనవి. కాగా మొదటి భాగంలో, ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో జరిగిన జాప్యానికి బదులుగా నూతనాంధ్ర రాష్ట్రంలో యీ రంగంలో అభివృద్ధి యితోధికంగా సాధించబడింది. విద్యుచ్ఛక్తిమీద ప్రణాళికలో జరిగిన కేటాయింపుకంటే కొంచెం ఎక్కువగానే ఖర్చుచేయబడింది.

## మాచ్ఖండ్ జల విద్యుత్ప్రణాళిక

ఆంధ్ర రాష్ట్రంలో ఉద్యమించబడిన జల విద్యుత్ పథకాలలో యిదే మొదటిది. ఇది ఆంధ్ర, ఒరిస్సా రాష్ట్రాల

ఉమ్మడి పథకం. దీనిపైన జరిగే ఖర్చు, ఉత్పత్తి అయ్యే విద్యుచ్ఛక్తి యీ ఉభయ ప్రభుత్వాలు 70:30 నిష్పత్తిలో పంచుకుంటవి. ఈ పథకం మీద మొత్తం ఖర్చు షుమారు రు. పదమూడున్నర కోట్లు. రాష్ట్రాలలో విద్యున్మార్గాల నిర్మాణాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించి పూర్తిచేసుకుంటవి. ఆంధ్ర రాష్ట్రంలో విద్యున్మార్గాల నిర్మాణానికి రు. 10 కోట్లు ఖర్చు అవుతుంది. మాచ్‌ఖండు స్టేషన్ విద్యుదుత్పాదన శక్తి 1,14,750 కి. వా. మొదటి పంచవర్ష ప్రణాళిక కాలంలో ఇందులోసుమారు సగంఉత్పత్తి చేయగలయంత్రాలస్థాపన జరిగింది. ఈ ప్రాజెక్టుస్థలం విశాఖపట్టణం రైలు స్టేషనుకు 130 మైళ్ళ దూరంలో ఉన్నది. ఈ ప్రాంతానికి దుర్గమ ప్రదేశాలగుండా ఒకరోడ్డు ఉన్నది. ఇక్కడి పనుల నిమిత్తం కార్మికులను బహుళ సంఖ్యలో యితర ప్రదేశాలనుండి తీసుకు రావలసి ఉంటుంది. వాతావరణం పరిస్థితులనుబట్టి సంవత్సరంలో 9 నెలలు మాత్రమే పనులు సాగటానికి అవకాశం ఉన్నది. ప్రకృతి సిద్ధమైన యీకష్టనష్టాలేకాక, పెన్‌స్టాకుల ఉత్పత్తి పోలెండు మారుగా ఆస్ట్రియాలో జరుపవలసి వచ్చిన కారణంగా, వాటి సప్లయిలో ఆలస్యమై పనులు చాలా మందకొడిగా మాత్రమే జరిపించవలసి వస్తున్నది. రోడ్డు రవాణా సౌకర్యాలను అభివృద్ధి పరచి, నిర్మాణపు కార్యక్రమాలను చురుగ్గా సాగించి, సిబ్బందిని రెట్టింపుచేసి, పని గంటలను పెంచుకొని, యీకష్టనష్టాల నన్నిటిని ఎలాగో అధిగమించి, 17,000 కి. వా శక్తిగల మొట్టమొదటి విద్యుదుత్పాదన యంత్ర స్థాపన కార్యక్రమం ఒక సంవత్సరం ముందుగా సాధించడానికి అవకాశం కల్పించబడింది. ది. 19-8-1955న యీ పథకానికి రాష్ట్రపతి ప్రారంభోత్సవం చేశారు.

## తుంగభద్ర జల విద్యుత్పథకం

ఇదికూడా ఉమ్మడి ప్రాజెక్టే. దీనిపై జరిగే పెట్టుబడి ఖర్చులు, దీనివల్ల కలిగే విద్యుచ్ఛక్తి ప్రయోజనాలను ఆంధ్ర, మైసూరు రాష్ట్రాలు 80:20 నిష్పత్తిలో పంచుకుంటవి. ఇక్కడి నిర్మాణాల్లో రెండు విద్యుదుత్పాదక యంత్రాలు, ఒకటి తుంగభద్ర ఆనకట్టవద్ద, రెండవది హంపీవద్ద తుంగభద్ర కాలువ ప్రక్కన స్థాపించబడతవి. ఈ రెండూ చరమదశలో 36,000 కి. వా. శక్తిని కలిగి ఉంటవి. ప్రస్తుతం ఒక్కొక్క దానిలో 18,000 కి. వా. శక్తిగల యంత్రాలు సమకూర్చ బడుతున్నవి. బళ్ళారి వరకు విద్యున్మార్గాల నిర్మాణంతో సహా యీ ఉమ్మడి కార్యక్రమాలకు అయ్యే ఖర్చు సుమారు రు. 7 కోట్లు. ఆంధ్ర రాష్ట్రంలో విద్యున్మార్గ నిర్మాణాలకు రు. 4.86 కోట్లు ఖర్చు అవుతుంది. ఉభయులకు సంబంధించిన కార్యక్రమ నిర్వహణ తుంగభద్ర బోర్డు అనే సంస్థవారి ఆధ్వర్యంలో కొనసాగుతున్నది. బోర్డు తరఫున పనిచేస్తున్న ఒక ఉపసంఘానికి ఆంధ్ర విద్యుచ్ఛక్తి చీఫ్ ఇంజనీరు సమావేశకర్త. తుంగభద్ర జలవిద్యుత్పథకంక్రింద నిర్మాణ కార్యక్రమాలుకూడా చాలా చురుకుగా కొనసాగించబడుతున్నవి. ఆనకట్టవద్దగల పవర్ హౌస్ లో మొదటి ఉత్పాదక యంత్రం యీ సంవత్సరము డిసెంబరు నుండి విద్యుత్ సరఫరా ప్రారంభింపవలసివున్నది. ఈపవర్ హౌస్‌లోనూ, హంపీ పవర్ హౌస్‌లోనూ గల మిగిలిన మూడు యంత్రాలు, ఆ తరువాత 4 లేక 6 నెలలకాలంలో సరఫరా ప్రారంభిస్తవి.

## విద్యుదుత్పాదకశక్తి - వినియోగం

ప్రథమ పంచవర్ష ప్రణాళిక ప్రారంభంకాలంలో, స్థాపించబడినయంత్రాల విద్యుదుత్పాదకశక్తి 21,000 కి. వా. మాత్రమే. ఇందులో 16,000 కి. వా. ఆవిరి ద్వారానూ, 5,000 కి. వా. డీసెల్ ఉత్పత్తి కేంద్రాల ద్వారానూ జరుగుతుండేది. ప్రణాళిక చివరకు ఉత్పాదక శక్తి 62,000 కి. వా.కు పెరిగింది. ఇందులో 24,000 కి. వా జలవిద్యుత్తు, 24,000 కి. వా. ఆవిరిద్వారా, 14,000 కి. వా. డీసెల్ ఉత్పత్తి. ప్రణాళిక ప్రారంభంలో విద్యుత్ వినియోగావకాశాలు 12,000 కి. వా. కు పరిమితం కాగా, ప్రణాళికాంతానికి యీ సంఖ్య 38,000 కి. వా. కు పెరిగింది.

## ఆంధ్ర గ్రిడ్

ప్రథమపంచవర్ష ప్రణాళిక ప్రారంభ కాలంలో ఆంధ్ర రాష్ట్రంలో అక్కడక్కడ చెదురు చెదురుగా ఆవిరి, డీసెలు ఉత్పత్తి కేంద్రాలు ఉండేవి. వీటన్నిటికీకలిపి, 2,9000 హెచ్. టి., యల్. టి. మైళ్ళ పొడవున విద్యున్మార్గాలు ఉండేవి. తరువాత కాలంలో సుమారు 2,900 మైళ్ళ లైను నిర్మాణమయినది. కాగా ప్రారంభ కాలానికంటే విద్యున్మార్గాల మైలేజీ రెట్టింపు అయింది. ప్రస్తుతం ఒక వైపు ఒరిస్సా సరిహద్దునుండి, మరొక వైపున మైసూరు రాష్ట్ర సరిహద్దువరకు వ్యాపిరిచి, ఆంధ్రలో విద్యున్మార్గం నిర్మింపబడివున్నవి. ఇది విజయవాడకు 132 కె. వి. తదనంతరం 66 కె. వి. పద్ధతిలో పనిచేస్తున్నది. దీనివల్ల థర్మల్ స్టేషనులు, జల విద్యుత్కేంద్రాలు సమన్వయ విధానంతో కలసి పనిచేయటానికి అవకాశం ఏర్పడి, ఆర్థికంగా పొదుపు సమకూరుతున్నది. ఆంధ్రలో విద్యుచ్ఛక్తి వినియోగదారుడెవరయినా సరే, పెద్దగా వినియోగించేవారుగానీ, స్వల్పంగా వినియోగించుకునేవారుగానీ, ఏ ప్రాంతంలోవున్నా సరే సకాలంలో విద్యుచ్ఛక్తి సప్లయిని సాధించుకోవడానికి అవకాశం ఉన్నది.

# గ్రామీణ ప్రాంతాలకు విద్యుచ్ఛక్తి

ప్రథమపంచవర్ష ప్రణాళికకు పూర్వం 12 సంవత్సరాల కాలంలో, 205 పట్టణాలకు గ్రామాలకు మాత్రమే విద్యుచ్ఛక్తి సరఫరా అవుతుండేది. విద్యున్మార్గాలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించటం ద్వారానూ, మారుమూల ప్రాంతాల్లో కూడా చిన్న చిన్న పైలెట్ డీసెల్ కేంద్రాలు స్థాపించటం ద్వారానూ, గ్రామీణ విద్యుచ్ఛక్తిలో మిత వ్యయ విధానాలను అనుసరించటంద్వారానూ, గ్రామీణ విదున్మార్గాలకు అవసరమైన సామగ్రిని ప్రమాణీకరించి, విద్యుచ్ఛక్తిశాఖ ద్వారానే ఉత్పత్తి కొనసాగించటం ద్వారానూ, గ్రామీణ ప్రాంతాలకు విద్యుచ్ఛక్తి సరఫరా విషయంలో ప్రత్యేక శ్రద్ధతో కృషి చేయటం జరిగింది. ప్రణాళిక కాలంలో 426 పట్టణాలు, గ్రామాలకు సరఫరా సౌకర్యాలు కలిగించ బడినవి. వీటితో సహా మొత్తం విద్యుచ్ఛక్తి సరఫరా అవుతూన్న పట్టణ గ్రామాల సంఖ్య 681 కి పెరిగింది.

ప్రణాళిక ప్రారంభ కాలంలో 620 వ్యవసాయంలో వినియోగించే పంపు సెట్లకూ 350 గ్రామీణ పరిశ్రమలకూ, విద్యుచ్ఛక్తి లభిస్తుండేది. ఈ సంఖ్యలు వరుసగా, ప్రణాళిక చివరకాలానికి 4300, 3800లకు పెరిగాయి.

ప్రథమ పంచవర్ష ప్రణాళిక మొదట్లో ఆంధ్ర రాష్ట్రంలో విద్యుచ్ఛక్తి తలసరి సగటు వినియోగం 2.5 యూనిట్లు. ప్రణాళిక ఆసాంతానికి యీ సంఖ్య 8 యూనిట్లు వరకు పెరిగింది.

రాయలసీమ ప్రాంతాలకు అనంతపురంలోనూ, సర్కారుజిల్లాల వారికై విజయవాడలోనూ రెండు లైన్ మెన్ల సాంకేతిక శిక్షణ పాఠశాలలు ప్రారంభించబడినవి.

కొలంబో పథకం, చతుస్సూత్ర కార్యక్రమం, మిత్ర రాజ్యసమితి ఫెలోషిప్ పథకాల క్రిందగల అంతర్జాతీయ సాంకేతిక విద్యాశిక్షణ ప్రణాళికల ప్రయోజనాలను పూర్తిగా వినియోగించుకోటం కూడా జరిగింది. అంతే కాక యంత్రాల సప్లయి, యంత్రాల స్థాపనకు సంబంధించిన కంట్రాక్టుల సందర్భంలో విద్యుచ్ఛక్తి శాఖలోని యింజనీర్లకు యంత్రాల ఉత్పత్తిదార్ల కర్మాగారాలలో శిక్షణ యిచ్చి యంత్రాల స్థాపనకై కంట్రాక్టర్లు వినియోగించుకొనే సిబ్బందిలో వీరిని కూడా చేర్చుకొని తద్వారా వారికి అనుభవం కలిగించే ఏర్పాట్లు కూడా చేయబడినవి.

అందువల్లనే ఆర్. యస్. జాయింటులను విద్యుచ్ఛక్తి శాఖవారు అమెరికా, రష్యా, యూరపుఖండ దేశాల నుండి దిగుమతి చేసుకున్నారు. ఈ దిగుమతి అయిన సరుకు ఆధారంగానే, విద్యుచ్ఛక్తి శాఖవారు 66 కె. వి. 132 కె. వి. విద్యున్మార్గాలలో ఉపయోగించే సపోర్టర్లకు నమూనాలు తయారు చేశారు. ఈ సపోర్టర్ల ఉత్పత్తికి గుంతకల్లులో ఒక కర్మాగారం స్థాపించబడింది. మరొకటి విజయవాడలో నెలకొల్ప బడింది. ఈ శాఖ వారు ఉత్పత్తి చేస్తున్న సపోర్టర్లతో విద్యున్మార్గాలు యింక ఒక సంవత్సరంలో- కంట్రాక్టుపద్ధతిలో మూడేండ్ల కాలం పడుతుంది- నిర్మించుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల విద్యున్మార్గాల సామగ్రితయారు గావటంతో, నిర్మాణాలు చురుకుగా సాగడమే కాకుండా వ్యయంలో కూడా చాలా పొదుపు సాధించబడింది. చురుకుగా కొనసాగుతున్న నిర్మాణ కార్యక్రమాలకు సహాయ భూతంగా యింజనీరింగు సామగ్రి వగైరా సమకూర్చుకో గలందులకై ఆరు ప్రాంతీయ సెంట్రల్ స్టోర్సు స్థాపించబడినవి. ఇంజనీరింగ్ సామగ్రిలో వివిధ రకాల వస్తువులను అవసర మైనంత మేరకు ఆ స్టోర్లలో నిల్వచేయటం జరుగుతున్నది. స్టోర్సులోనికి మళ్ళీ సామగ్రి చేరుటకు అవసరమైన కాలపరిమితికి సమన్వయ పరచబడి ఆయాచోట్ల కనీసమైన స్టాకు పరిమితులు సామగ్రిని విడుదలచేసే పరిమితులు కూడా నిర్ణయించబడినవి.

ఆంధ్రలో విద్యుచ్ఛక్తి పథకాల నిర్వహణకై ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో రు: 21.76 కోట్లు కేటాయించ బడింది. ప్రణాళికలోని కార్యక్రమం వివరాలు :

1. మాచ్ ఖండ్ లో మిగిలిన ఉత్పాదక యంత్రాలను 21,250 కి. వా. స్థాపించుట.

2. తుంగభద్రపథకంలో మిగిలిన నాలుగు (9000 కి. వా.) ఉత్పాదక యంత్రాలను - రెండు ఆనకట్టవద్ద, రెండు హంపీ పవర్ హౌస్ వద్ద స్థాపించుట.

3. తుంగభద్ర వద్ద ఉత్పత్తి అయ్యే సీజనల్ విద్యుచ్ఛక్తిని స్థిరీకరించి, గ్రిడ్ మార్గానికి సప్లయి పటిష్ఠంచేయుటకై నెల్లూరు వద్ద 30,000 కి. వా. థర్మల్ స్టేషన్ స్థాపించుట.

4. అదనంగా 634 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సప్లయి చేయుట.

5. రు. 50 లక్షల కేటాయింపుతో సీలేరు జలవిద్యుత్పథకానికి సంబంధించిన ప్రాథమిక కార్యక్రమం నిర్వహించుట.

ఈ పై కార్యక్రమాలు నిర్వహింపబడినప్పుడు యీ క్రింది ప్రయోజనాలు సిద్ధిస్తవి.

1. అదనంగా 130,000 కి. వా. విద్యుచ్ఛక్తి ఉత్పత్తిచేయగలిగిన యంత్రాలు స్థాపించబడుతవి.

2. పీక్ లోడ్ 80,000 కి. వా. అధికమై, మొత్తం 118,000 కి. వా. వరకు పెరుగుతుంది.

3. ఆదాయంలో రు. 1·47 కోట్లు పెరుగుదల సంభవించి సంవత్సరాదాయం మొత్తం 3·15 కోట్లకు పెచ్చుతుంది.

4. విద్యుచ్ఛక్తి సగటు తలసరి వినియోగం 8 యూనిట్ల నుండి 20 యూనిట్లవరకు పెరుగుతుంది. ★

# భూసంస్కరణలు

దున్నేవాడే భూమికి యజమాని కావాలనే ఆశయంతో హైదరాబాదులోని ప్రజాస్వామ్య ప్రభుత్వం కొన్ని అభివృద్ధికరమయిన భూ సంస్కరణలను ప్రవేశపెట్టుటకు సంకల్పించి, తదనుగుణంగా శాసనం తయారుచేసింది. ఈ శాసనాన్ని అమలు పరచడంవల్ల తెలంగాణాలోని అసంఖ్యాకరైతాంగానికి విశేషలాభం చేకూరుతున్నది. వారిలో నూతన ఆశ రేకెత్తుతున్నది. ఆంధ్రలోకూడా కౌల్దారీ చట్టం ప్రవేశ పెట్టబడింది. 1956 సం. ఆంధ్ర ఇనాముల (రద్దు మరియు రైత్వారీలోకి మార్పు) చట్టంక్రింద ఇనాములన్నీ రైత్వారీ పద్ధతిక్రిందికి వస్తున్నవి.

## తెలంగాణా

ఈ ప్రాంతంలో భూమి అమరకపు విధానం అనేక తీరులుగా ఉండేది. అందుచేత గతంలో ప్రభుత్వ విధానాలు వివిధరూపాల్లో ఉండవలసి వచ్చింది. తత్ఫలితంగా ఒకవైపు కలవారు- అంటే జాగీర్దార్లు, జమీందార్లు, పరోక్ష భూస్వాములు, మరోవైపు లేనివారు- అంటే పొలం దున్నే పేద రైతులు, భూములులేని వ్యవసాయ కూలీల మధ్య ఒక అఖాతం ఏర్పడింది. అయితే యీ రెండు వర్గాలలో దేనికీ చెందకుండా ఉన్నట్టి సొంత సేద్యం చేసుకొనే రైతులుమాత్రం నేరుగా ప్రభుత్వానికే పన్నులు చెల్లిస్తూ, తాము చేస్తున్న కష్టానికితగ్గ ఫలితాన్ని అనుభవిస్తున్నారు. దున్నేవాడు భూమి తనదే అయివుండాలని కోరడం సహజం. అతడు భూమిని అభివృద్ధిపరచుటకై సాయశక్తులా కృషిచేస్తాడు. అయితే పేదరికం, అజ్ఞానం వల్ల అతనికోరిక నెరవేరడంలేదు. ధనిక భూస్వామి విద్యావంతుడు. అందుకనే తనకు న్యాయరీత్యాగల హక్కుల బలసహాయంతో రైతుపైన పెత్తనం చెలాయించ గలుగుతున్నాడు. అందువల్ల రైతులలో అశాంతి ప్రబలడం సహజమే. ఇక్కడ ఆందోళన లేవదీయడానికి రాజకియ కార్యకర్తలకు యీ పరిస్థితివల్ల ఒక అవకాశం దొరికింది. ఋణదాతలు చిన్నరైతుల అజ్ఞానాన్ని స్వప్రయోజనానికి వినియోగించుకోవడం ఆరంభించారు. వారు పేదరైతులకు విపరీతమైన వడ్డీరేట్లపై అప్పులిచ్చారు. రైతులు అప్పు చెల్లించలేనపుడు, ఋణదాతలు వారి భూములను ఆక్రమించుకోవడం ఆరంభించారు.

హైదరాబాదు ప్రభుత్వం యీ విపత్కర పరిస్థితిని తొలగించుటకు 1933 లోనే ఒక శాసనం తయారుచేసింది. వ్యవసాయ భూములు ఋణదాతల చేతుల్లోకి పోకూడదని యీ శాసనం నిర్దేశించింది.

రాష్ట్రంలో వ్యవసాయ ఋణ పరిస్థితినిగూర్చి వివరంగా ఛోగట్టా సేకరించబడింది. ఆతరువాత 1939 సం. వ్యవసాయ భూముల తొలగింపు నిరోధకచట్టం అమలుపరచబడింది. 1938 లో కౌల్దారీ సంఘం ఒకటి నియమించబడింది. ఈ సంఘం సిఫారసులపైన 1945 సం. ఆసామీ-షిక్మీల చట్టం ప్రవేశపెట్టబడింది. అయితే యీ చట్టాలవల్ల రైతుకు అంతగాలాభం కలుగలేదు. పరోక్ష భూస్వాములపై ఋణదాతలపై ఏలాంటి నిర్బంధం లేకపోవడంవల్ల కౌల్దారులలో అశాంతి పెరుగుతూ వచ్చింది. ముఖ్యంగా తెలంగాణాలో ఈ పరిస్థితి కమ్యూనిస్టుల ఆందోళనకు రంగస్థలాన్ని కల్పించింది. 1948 లో పోలీసు చర్య తరువాత కమ్యూనిస్టుల చర్యలు ప్రభుత్వానికి ఒక సమస్యను కల్పించాయి. అందుకని కౌల్దార్ల కష్టాలను నివారించుటకు నూతన ప్రభుత్వం కొన్ని చర్యలు గైకొనవలసివచ్చింది.

1949 సెప్టెంబరులో హైద్రాబాదు రాష్ట్రంలో 6,500 గ్రామాలతో కూడిన 1500 జాగీర్లను రద్దుచేస్తూ ఒక శాసనం తయారు చేయబడింది. రాష్ట్రంలో వున్న వవ్యసాయ భూములలో 9.9 శాతం భాగం ఆక్రమించివున్న నిజాము

యొక్క 'సర్ఫె ఖాస్' భూములుకూడా ప్రభుత్వపరమైనాయి. ప్రభుత్వం జాగీర్లను స్వాధీనపరచుకొన్న తరువాత అక్కడి కౌల్దార్ల మేలుకొరకై అనేక సహాయక చర్యలు గైకొన్నది.

రైతులకు భూములపై యాజమాన్యపు హక్కులు కల్పించే లక్ష్యంతో 1950 సం. లో హైదరాబాదు కౌల్దారీ మరియు వ్యవసాయ భూములచట్టం అమల్లో పెట్టబడింది. భూసంస్కరణలు ప్రవేశపెట్టుటకు దోహదమిచ్చుటకై ఈ చట్టం ఒక కొలబద్దగా 'కుటుంబ కమతాన్ని' నిర్ణయించింది. కౌళ్ళ తగ్గింపుకు, ఫలసాయాన్ని బట్టి కౌళ్ళు నిర్ణయించుటకు, సొంత సేద్యమునకై భూముల సముపార్జనపై పరిమితి విధించుటకు, సొంత కమతాలపై గరిష్ఠ పరిమితి నిర్ణయించుటకు, మిగులు భూములను లేక సమర్థవంతంగా సాగుచేయబడని భూములను ప్రభుత్వం స్వాధీన పరచుకొనుటకు ఈ చట్టం వీలు కల్పిస్తున్నది. కుటుంబ కమత మంటే సాలుకు నికరంగా రూ. 800 ల ఆదాయం యిచ్చే భూమి అని నిర్వచించబడింది. కుటుంబ కమతాలకన్నా నాలుగన్నర రెట్లకు మించి ఎవ్వరికీ భూమి ఎక్కువగా ఉండకూడదు. ఆరు సంవత్సరాలు లేక అంతకన్నా ఎక్కువ కాలంనుంచి భూమి సాగుచేస్తున్న కొంతమంది రైతులు "రక్షిత కౌల్దార్లు" గా వర్గీకరించబడినారు. తాము సాగు చేస్తున్న భూమిని కొనుటకు వారికి హక్కుంది. నిర్దిష్ట ప్రాంతాలలో ప్రభుత్వం గైగొన్న కొన్ని చర్యల ఫలితంగా యీ రక్షిత కౌల్దార్లు భూములను కొనుక్కోగలుగుతున్నారు. ఈ సౌకర్యాలు క్రమేణా ఇతర ప్రాంతాలకు కూడా వర్తింప జేయబడుతాయి. భూసంస్కరణలను నిర్వహించుటకై ప్రభుత్వానికి సహాయపడుటకు ల్యాండ్ కమీషన్ ఒకటి ఏర్పాటు చేయబడింది. కుటుంబ కమతాల గరిష్ఠ పరిమితి, స్థానిక ప్రాంతాల పరిమితి, భూములు ముక్కచెక్కలు కావడాన్ని నిరోధించడం, కమతాల ఏకీకరణ, సమర్థవంతమైన సేద్యానికి ప్రమాణబద్ధమైన పద్ధతులు మున్నగువాటినిగూర్చి యీ ల్యాండ్ కమీషన్ కొన్ని సిఫారసులు చేసింది. ప్రభుత్వం యీ సిఫారసులను అమలు పరుస్తున్నది. ఈ సంఘం ప్రభుత్వానికి సహకార వ్యవసాయమును గూర్చికూడ నివేదిక సమర్పిస్తుంది.

హైదరాబాదు రాష్ట్రమంతటా భూకమతాల లెక్కలతో పాటు హక్కుల రికార్డు కూడా తయారుచేయుటకు చర్య గైకొనబడింది. తత్ఫలితంగా నామమాత్రపు 'పట్టేదార్లు' తొలగించబడినారు. వాస్తవంగా భూమి స్వాధీనంలో గల వ్యక్తులు మాత్రమే భూమిపై యాజమాన్యంగల వ్యక్తులుగా రిజిస్టరు చేయబడుతున్నారు. రెవిన్యూ లెక్కల నిమిత్తమై వారే శిస్తు చెల్లించువారుగా పరిగణింపబడినారు.

'ఇజారా' గ్రామాలలో భూములను కౌళ్ల కిచ్చువారందరు ఒక విధమైన జమీందార్లు అయినారు. వాళ్లక్రింద ఉన్న కౌల్దార్లందరూ చిరకాలంనుంచి భూములను తమ స్వాధీనంలో ఉంచుకున్నప్పటికీ వారికి సంఘంలో తగిన హోదా లేక పోయింది. అందువల్ల భూమ్యాదాయ చట్టం సవరణ చేయబడింది. ఈ సవరణచట్టం ప్రకారం విడువకుండా 12 సంవత్సరాలు భూములను స్వాధీనంలో ఉంచుకున్న కౌల్దార్లు లేదా సేద్యం ఆరంభమైనప్పటినుంచి, లేదా ఇజారా దారుకు పట్టా మంజూరయిన కాలం నుంచి, ఇజారాదారుతో కలసి సమిష్టిగా సేద్యంచేయు కౌల్దార్లు 'షిక్మీదార్లు'గా ప్రకటించబడినారు. 'షిక్మీదార్లు' అంటే భూములపై యాజమాన్యపు హక్కులు కలిగినట్టివారు. ఇజారాదారుకు నామమాత్రపు కౌలు చెల్లించి, అతని వద్దనుంచి భూమిని కొనుటకు షిక్మీదారుకు హక్కువుంది. అయితే యీధర, అట్టి భూములకై చెల్లించవలసిన భూమి శిస్తుకూ, కౌలుకూ మధ్య గల తేడాకు 10 రెట్లకు మించకూడదు.

రాష్ట్రమంతటా ఇట్టి సంస్కరణలను సంపూర్ణంగా అమలుపరిచినపుడు భూమి అమరకపు విధానం సంపూర్ణంగా మారిపోతుంది. దున్నేవాడే భూమికి యజమాని అవుతాడు.

## ఆంధ్ర రాష్ట్రం

ఆంధ్ర రాష్ట్రంలో రైత్వారీ, జమీందారీ పద్ధతులని రెండు రకాల భూమి అమరకపు విధానాలున్నాయి. ఇంతేగాక ఇనాములపద్ధతి, తూర్పుగోదావరిజిల్లా నూగూరుతాలూకాలో 'మాల్గుజారీ' పద్ధతి, ఏజన్సీ ప్రాంతాలలో 'ముట్టాదారీ'పద్ధతి అమల్లో ఉన్నాయి.

మద్రాసు ఎస్టేట్ల చట్టంక్రింద ప్రభుత్వం అనేక ఎస్టేట్లను తన స్వాధీనం క్రిందికి తెచ్చుకుంది. ఇనాముల రద్దు చట్టం కూడా అమల్లోకి వచ్చింది. ఈ చట్టంక్రింద ఇంకా అనేక ఇతర చర్యలు గైకొనబడుతున్నాయి. కౌలు తగ్గింపు చట్టం వల్లనూ, బంజరుభూములను భూములులేనివారికి ఇచ్చుటకు తలపెట్టబడిన పథకములవల్లనూ పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. బాపట్ల తాలూకాలో రొంపేరు భూముల అభివృద్ధి పథకం క్రింద 8,000 ఎకరాల భూమి తక్కువ ధరకు భూములులేని పేద రైతులకూ, రాజకీయ బాధితులకూ కేటాయించబడినది. (తరువాయి 64 వ పేజీలో)

# భూదానం : ప్రేమమార్గంద్వారా భూసమస్యను పరిష్కరించే విధానం

హింస, శాసనం, దానం ఈ మూడు పద్ధతులద్వారా ఏ సమస్యనయినా పరిష్కరించవచ్చును. భారతదేశంలో అతిక్లిష్టమైన భూ సమస్యను పరిష్కరించుటకై పై మూడు పద్ధతులు అనుసరించబడినాయి. కమ్యూనిస్టులు భారతదేశంలో కొన్నిచోట్ల ముఖ్యంగా తెలంగాణాలో కొంతకాలం వరకు హింసాపద్ధతిని అనుసరించుటకు ప్రయత్నించి విఫలులయినారు. ప్రభుత్వం రెండో పద్ధతిని అనుసరిస్తున్నది. భూ సంస్కరణలకై శాసనాలు తయారుచేసి వాటిని సాధ్యమయినంత త్వరలో ఆచరణలో పెట్టుటకు కృషిచేస్తున్నది. ఈ పద్ధతిద్వారా ఎంతో ప్రగతి సాధించబడింది. అయితే ఈ మార్గంవల్లనే సమస్య పూర్తిగా పరిష్కారంకాదు. దీనికి అనుబంధంగా కలవారు సంఘానికి తాము చేయవలసిన విధ్యుక్తధర్మాన్ని అవగతం చేసుకొని స్వచ్ఛందంగా ప్రేమతో భూదానంచేయడం అవసరము. ఆచార్య వినోబాభావే ఈ ప్రేమసందేశాన్ని మనకు అందజేశారు.

భూదానంద్వారా భూ సమస్యను పరిష్కరించవచ్చుని వినోబాకు అకస్మాత్తుగా ఒక ఆలోచన తట్టింది. 1951 మార్చి నెలలో హైద్రాబాదునగరానికి సమీపంలోనున్న శివరాంపల్లిలో సర్వోదయ సమావేశానికి రావలసిందని ఆయనకు ఆహ్వానమందింది. ఆయన వార్ధానుంచి హైద్రాబాదుకు 300 మైళ్లు కాలినడకతో వచ్చారు. తెలంగాణా ప్రాంతంలో కమ్యూనిస్టులు హింసకు పూనుకొని దురంతాలు చేస్తున్నారనీ, గ్రామీణ ప్రజానీకమంతా భయాందోళనలకు గురైందనీ ఆయన విన్నారు. ఈ ప్రాంతంలో శాంతి ప్రేమ సందేశాలను వ్యాపింపజేయుటకు ఆయన సంకల్పించారు. ఈ పర్యటన సందర్భంలోనే తెలంగాణాలో చరిత్రకెక్కిన భూదానోద్యమం ఉదయించింది.

వినోబా భావే తమ అనుచరులతోపాటు రోజూ ఉదయం పది పన్నెండు మైళ్లు నడిచి ఏదో ఒక గ్రామంలో మజిలీ చేసి అక్కడ బహిరంగ సభలో శాంతి సందేశాన్ని ఇచ్చేవారు. గుడిసెలను దర్శించి హరిజనులను పరామర్శించి వారి యోగక్షేమాలను విచారించేవారు. ఆయన నల్గొండ జిల్లాలోని పోచంపల్లి గ్రామానికి వచ్చిన తరువాత, ఏప్రిల్ 18 తేదీన ఇద్దరు హరిజనులు ఆయనను దర్శించి, పోచంపల్లిలో తాము ఎనభై కుటుంబాలవారమున్నామనీ తమకు సెంటు భూమికూడా లేదనీ, కొంతభూమి తమకు ఇప్పించవలసిందనీ వారు ఆయనను కోరారు. స్థానిక దేశముఖ్ అయిన శ్రీ వి. రామచంద్రారెడ్డి ఇది విని తన భూమిలోనుంచి వంద ఎకరాలు దానము ఇస్తానని అన్నారు. వినోబాజీ ఆ హరిజనుల నుద్దేశించి మాట్లాడుతూ వారు సహకార పద్ధతిపైన ఈ భూమిని సేద్యం చేయుటకు అంగీకరించినట్లయితే ఆభూమి వారికి ఇవ్వబడుతుందని అన్నారు.

## ప్రత్యేక నియమావళి

ఈ సూచనపట్ల అందరికీ శ్రద్ధాసక్తులు కలిగినాయి. అనేక గ్రామాలలో ఎన్నో ఎకరాల భూమి దానంగా ఇవ్వబడింది. దీన్నే భూదాన యజ్ఞ మన్నారు వినోబా. ఈ పర్యటన సందర్భంలో ఈ విధంగా ఆయన 14000 ఎకరాల భూమిని సేకరించారు. భూములు లేనివారికి భూములు పంచిపెట్టుటకై భూదాన యజ్ఞం ఆరంభించబడిది. ఈ ఉద్యమాన్ని కొనసాగించి భూదానాలు గ్రహించుటకై భూదాన యజ్ఞసమితి ఒకటి ఏర్పాటు చేయబడింది. భూదాన

ములను క్రమబద్ధం చేయుటకై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నియమావళి తయారుచేసింది. 1957 ఆగస్టువరకు ఈ నియమావళి అమల్లో ఉంటుంది. భూదానం చేయువ్యక్తి భూమిని విడిచిపెట్టాల్సివుంటుంది. ఆ తరువాత తహశీల్దారు అందుకు సాక్షిగా ఉంటాడు. ఈ విధంగా దానరూపంలో వచ్చిన భూములన్నిటినీ స్థానిక సంఘాల సహాయంతో కేంద్ర సంఘం భూములు లేనివారికి పంపిణీ చేస్తుంది.

వినోబాజీ యీ భూదానోద్యమాన్ని ఇతర రాష్ట్రాలలో కూడా కొనసాగించి 1956 జనవరిలో తెలంగాణాకు తిరిగి వచ్చారు. అప్పటివరకు దేశమంతటా సుమారు 5 లక్షల దాతలవద్దనుంచి 41 లక్షల ఎకరాలభూమి సేకరించబడింది. 1955 లో జగన్నాధపురిలో జరిగిన సర్వోదయ సమ్మేళనములో 1957 నాటికి 5 కోట్ల ఎకరాల భూమిని సేకరించాలని ఒక లక్ష్యం నిర్ణయించబడింది. వినోబా తెలంగాణాను రెండోసారి దర్శించేపూర్వం ఆంధ్రలో పర్యటించి 15000 ఎకరాలభూమి సేకరించారు. తెలంగాణాలో ఈ పర్యటన సందర్భంలో లక్షన్నర ఎకరాలు భూదాన రూపంలో సేకరించబడినాయి. ఈ ఉద్యమం ఇంకనూ కొనసాగుతూనే ఉన్నది.

సంపత్తిదానము, జీవనదానము భూదానయజ్ఞానికి రెండు శాఖలుగా ఏర్పడినాయి. జీవనదానమంటే ప్రజాసేవకై జీవితమును అంకితము చేయడమన్నమాట. కొంతమంది కార్యకర్తలు ప్రజాసేవకై తమ జీవితమును అంకితం చేశారు, మరికొంతమంది సంపత్తిదానములు కూడా చేస్తున్నారు. ఇటీవల 'మనుష్య దానం' అనేదికూడా ఈ ఉద్యమానికి మరో శాఖగా ఏర్పడింది. జాతిసేవకై ప్రతి కుటుంబం నుంచి ఒక వ్యక్తి కృషిచేయటమే దాని అంతరార్థం.

ఈ ఉద్యమాన్ని 'నేటి కాలమాన పరిస్థితుల కోరిక' అని అన్నారు వినోబా. ఇది స్నేహ పూర్వకమైన ప్రేమయుగం అని ఆయన అంటారు. ఇతడుయజమాని, అతడు సేవకుడు అనే భావం ఉండడం ఎంతమాత్రం పనికిరాదు. అందరి మధ్య సమానత ఉండాలి. ఒకరు పెద్ద, మరొకరు చిన్న అనే భావం ఉండకూడదు. ఈ యుగంలో భూమిపైన, సంపత్తిపైన, ఉత్పత్తి సాధనాలపైన అందరికీ సమాన హక్కులున్నాయి. భూమి సొంతంగా ఉన్న ప్రతి వ్యక్తివద్ద నుంచి ఆరోవంతు భూమి సేకరించాలని వినోబా తమ అనుచరులకు చెబుతారు. ధనవంతులైనవారు సమానతనుగుర్తించాలి, భూదాన కార్యకర్తలు భూమిని సేకరించునపుడు ప్రజలకు ఈ సందేశాన్ని వారు అందజేయాలి అని వినోబా కోరిక. ఇది స్నేహపూర్వకమైన ప్రేమ సందేశం. భూ సమస్యనే గాక ప్రజలకు గల ఇతర సమస్యలను పరిష్కరించుటకు కూడా ఈ సందేశం తోడ్పడాలి.

---

**రాజధాని** [46 వ పేజీ తరువాయి]

వారుట. ఇక్కడ (శ్రీ) బాలాజీ మహారాజు ఆలయం వున్నది.


ఖైరతాబాదు మసీదు ఆవరణలో సమాధిలేని బురుజు ఒకటున్నది. ఇది సుల్తాన్ మహమ్మదు కుతుబ్‌షా కుమార్తె ఖరియతున్నిసా బేగం గురువైన అఖుంత్‌ముల్లా అబ్దుల్ మాలిక్‌చే నాలుగు శతాబ్దాలకుపూర్వం నిర్మించబడినది. అతడు దానిని తన సమాధినిమిత్తం నిర్మించాడు. కాని ''అతడు పుణ్యనగరం, (మక్కా లేక మదీనా)లో మరణించాడు.'' ఆ బురుజు ఖాళీగా వుండిపోయింది.

గోల్కొండ చివరిరాజు తానాషా నిర్మించిన గోషామహల్ నగరానికి వుత్తరంగా రమారమి ఒక మైలుదూరంలో వుంది. ఔరంగజేబు సైన్యాలు దండెత్తివచ్చి పోరుసలుపుతున్న వార్త వచ్చేసరికి తానాషా యిక్కడ స్థానికమైన వేడుకలలో మునిగివున్నాడు. అతడు ఆవార్తను లక్ష్యపెట్టలేదు, కాని అతని ఆస్థాన ఉద్యోగులు భూగర్భ మార్గంగా తొందరగా అతనిని గోల్కొండకు పంపివేశారు.

# * స్త్రీ జనోద్యమం *

ప్రాచీనాంధ్ర చరిత్రలో నాయకత్వం వహించిన స్త్రీలు వున్నారు. కవయిత్రులున్నారు. అలాగే వారిలో యోధులు, రాజకీయవేత్తలు, పండితులు ఉన్నారు. కాని సామాన్య స్థాయిలో, దేశంలోని మిగిలిన ప్రాంతాలలోవలెనే స్త్రీలు, స్వర్గీయ శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు తీవ్రమైన సంస్కరణోద్యమాన్ని ప్రారంభించేవరకు వెనుకపడేఉన్నారు. బ్రహ్మ సమాజ ఉద్యమం ప్రభావం బెంగాలునుండి వచ్చినది. శ్రీ పంతులుగారు బ్రాహ్మమతాన్ని స్వీకరించి స్త్రీల పరిస్థితికి సంబంధించి సంఘాన్ని సంస్కరించి, వికసింపచేయడానికై తమ జీవితాన్ని అంకితం చేశారు. వితంతువులకు విద్యనేర్పి, వివాహాలు చేయడానికై ఆయన రాజమండ్రిలో ఒక వితంతు శరణాలయాన్ని స్థాపించారు. ఆయన భార్య శ్రీమతి రాజ్యలక్ష్మమ్మ మొదట్లో ఆయన సంస్కరణ భావాలను వ్యతిరేకించినా, తరువాత ఆయనకు సహాయకారిగా మారినది. ఆమె స్త్రీల నిమిత్తమొక ప్రార్థనా మందిరాన్ని స్థాపించినది. స్త్రీలు వారానికొకసారి అక్కడ సమావేశమై ఉపన్యాసాలనువిని, అందరూ కలసి ప్రార్థనలు చేసేవారు.

మద్రాసులో మిసెస్ అనీబిసెంటు స్త్రీల ఇండియా అసోసియేషన్ను స్థాపించి, దానికార్యదర్శి మిసెస్‌మార్గరెట్ కజిన్సు దేశమంతటా పర్యటించిన తరువాత ఆంధ్రదేశంలో చాల స్త్రీల సంఘాలు స్థాపించబడినవి. అవి వయోజనులైన స్త్రీల విద్యకు వినోద కాలక్షేపానికి అవకాశాలు కల్పించి, శిశుసంక్షేమ కేంద్రాలను నడిపేవి. 1928 లో అఖిల భారత మహిళా సభ స్థాపించబడిన తరువాత దాని ఆంధ్రశాఖ ఏర్పడి, ఆ సంస్థ కార్యక్రమాలను గురించి పట్టణాలలోను, పల్లెలలోను ప్రజలకు పరిచయముచేసినది. దివ్యజ్ఞాన సమాజ ఉద్యమము కూడా స్త్రీలు తమ సభలకు, సమావేశాలకు రావడాన్ని ప్రోత్సహించి, వారికి తోడ్పడినది.



*నవంబరు ౨ వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారికి, కేరళ గవర్నరుగా నియమితులైన డా. బి. రామకృష్ణరావుగారికి ఆంధ్ర యువతీ మండలిలో సన్మానం జరిగిన సందర్భంలో తీయబడినచిత్రం.*

భారత జాతీయ కాంగ్రెసుకు గాంధీజీ నాయకత్వము వహించడంతో భారత స్త్రీలు రాజకీయ, సాంఘిక రంగాలలో స్వేచ్ఛగా పనిచేయడానికి అవిరళమైన అవకాశము లంభించింది. తత్ఫలితంగా ఆంధ్ర స్త్రీలనుండి సాహసోపేతులైన పెక్కురు నాయకులు పైకివచ్చి, జాతి స్వాతంత్ర్యము నిమిత్తం త్యాగంచేసి, కష్టాలను అనుభవించారు. వారిలో ఈనాడుకొందరు ఉన్నతపదవులను ఆక్రమించారు. గాంధీజీ ప్రారంభించిన ఖాదీ ప్రచారము, హరిజనోద్ధరణ, తదితరమైన సంస్కరణల విషయంలో కూడా స్త్రీలు ముందుకు వచ్చారు.

స్త్రీలకు సాంఘిక సేవలో శిక్షణనిచ్చి, వివిధమైన ఇతర రంగాలకు సంబంధించిన విషయాలను బోధించే నిమిత్తం రాష్ట్రమంతటా అతిత్వరితంగా అనేక సంస్థలు ఏర్పడినవి. చాల పట్టణాలలో సేవాసదనాలు, విద్యాలయాలు, సంక్షేమ కేంద్రాలు, వినోదపు క్లబ్బులు ఏర్పాటు చేయబడినవి. రాజమండ్రిలోని వైద్య సేవాసదనం. గుంటూరులోని శారదా నికేతనం, కాకినాడలోని విద్యార్థి సమాజము. చెన్నపురిలోని ఆంధ్ర మహిళా సభ, నెల్లూరులోని కస్తూర్బా పాఠశాల, అనేకమైన తదితర సంస్థలు స్త్రీల పురోభివృద్ధికి నూతన మార్గాలను చూపినవి.

శారదా చట్టం అమలులోనికి వచ్చిన పిమ్మట వివాహానికి సంబంధించిన పాత అభిప్రాయాలు మారినవి. ఇందువల్ల బాలికలు ఉన్నత విద్య నభ్యసించడానికి అవకాశమేర్పడింది. ఆవిధంగా వారు వివిధ వృత్తులకు అర్హత సంపాదించి, పరిపాలనారంగంలోకూడా ప్రవేశించగలిగారు. స్త్రీలలో డాక్టర్లు ఉపాధ్యాయినులు ఎక్కువమంది ఉన్నారు. న్యాయవాద వృత్తిని స్వీకరించినవారుకూడా ఉన్నారు. వారు పురపాలక సంఘాలు, జిల్లా బోర్డులు ఆఖరికి శాసన సభ సభ్యులుగా కూడ పనిచేస్తున్నారు.

కొన్ని పత్రికలు ప్రత్యేకం స్త్రీల నిమిత్తం నడుపబడుతున్నందున రచయిత్రులకు, కవయిత్రులకు జర్నలిజంలో కొత్త అవకాశాలు ఏర్పడినవి. వీటిలో 'హిందూ సుందరి', 'గృహలక్ష్మి', 'ఆంధ్ర మహిళ' ఉన్నవి. ప్రోత్సాహం లభించడం వల్ల చాలమంది యువతులు సృజనాత్మకమైన కళ నారాధిస్తున్నారు. కొందరు ఆంధ్ర మహిళలు రంగస్థలాన్నాశ్రయించి ప్రఖ్యాతిజెందారు. కన్నాంబ, కాంచనమాల, సూర్యకుమారి, భానుమతివంటివారికి చలనచిత్రాలు విఖ్యాతి గణించినవి.

స్త్రీల ఉన్నత విద్యకు పిఠాపురం మహారాజా చాల ప్రోత్సాహాన్నిచ్చారు. ఆయన కాకినాడలోని తన కళాశాలలో బాలికలందరికీ ఉచిత విద్యకు అవకాశం కల్పించారు. కాకినాడలో బాలికల కొరకు శరణాలయాన్ని కూడా ఏర్పరిచారు. ఈ విషయంలో పిఠాపురం మహారాజాపై ఆయన గురువుగారైన సర్. ఆర్. వెంకటరత్నం నాయుడుగారి ప్రభావం చాలవుంది. ఉన్నరాచరణలో ఆయన తన గురువుగారి ననుసరించారు. పిఠాపురం మహారాణి కూడా స్త్రీలలో రచయితలు మొదలగువారికి ప్రోత్సాహాన్నిచారు.

కస్తూర్బా గాంధీ మెమోరియల్ ట్రస్టు స్త్రీలు నూతన రంగంలో సేవచేయడానికి అవకాశాన్నిచ్చినది. ప్రత్యేక శిక్షణ సౌకర్యాలను వినియోగించుకొని, గ్రామోద్ధరణకై కృషిచేయడానికి చాలమంది స్త్రీలు ఐచ్ఛికంగా ముందుకు వచ్చారు.

ప్రభుత్వ పక్షాన స్త్రీసంక్షేమశాఖ నెలకొల్పబడింది. అది గ్రామ సీమలలో శాస్త్రీయమైన, క్రమబద్ధమైన పద్ధతిలో సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. వెనుకబడిన తరగతులు, హరిజనస్త్రీల విషయంలో ప్రభుత్వం నడిపే సంక్షేమ కార్యక్రమాల విషయంలో సలహా యివ్వడానికై రాష్ట్ర, జిల్లా స్థాయిలలో సలహా సంఘాలు ఏర్పాటుచేయబడినవి.

1953 లో కేంద్ర ప్రభుత్వం కేంద్ర సాంఘిక సంక్షేమ సంఘాన్ని ఏర్పాటుచేసి, రాష్ట్రాలలో శాఖలను, సలహా సంఘాలను స్థాపించినది. ఇవి ప్రజా సేవా పరాయణులైన స్త్రీల సేవకు క్రొత్తబాటలను వేసినవి. ఆంధ్ర, తెలంగాణా జిల్లా లన్నిటిలోనూ యీ సంస్థలు విద్యావ్యాప్తి, ఆరోగ్యం, పారిశుద్ధ్యాల అభివృద్ధి, ఆర్త రక్షణ, వివిధరకాల అభివృద్ధి కార్యక్రమాల విషయంలో చురుగ్గా పనిచేస్తున్నవి.

భారత సేవక్ సమాజ్, భారత్ స్కౌట్సు, గైడ్సు, ఇండియన్ రెడ్‌క్రాస్ సంఘంవంటి సంస్థలకు చెందిన సేవానిరతిగల స్త్రీలు సాంఘిక రంగంలోకూడా నిర్మాణ కార్యక్రమాన్ని అమలుజరుపుతున్నారు.

హైదరాబాద్‌లో రాకుమారి నిలోఫర్ ప్రోత్సాహంతో నడిచే స్త్రీ, శిశువైద్య సహాయసంస్థ చాలకాలంగా సాంఘిక సేవ చేస్తున్నది. ఆంధ్ర యువతీమండలి సంస్కృతి కార్యక్రమాలను ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో క్రమంగా జరిపిస్తున్నది. అది పిల్లల నిమిత్తం ఒక వస్తుబోధనా పాఠశాలను నడుపుతున్నది. కేంద్ర సాంఘిక సంక్షేమ సంఘం ఏర్పాటుచేసిన సంక్షేమవిస్తరణప్రాజెక్టును నిర్వహిస్తున్నది.

మహిళా నవజీవన్ మండలి మాంటిసోరీ పద్ధతిలో ఒక నర్సరీ స్కూల్‌ను నడుపుతున్నది.

హైదరాబాద్‌లో స్త్రీసంక్షేమంనిమిత్తం పనిచేసే యితర సంస్థలు యివి : అంజుమనె-యే-ఖవాతీన్, ఇందిరా సేవా సదన్, దక్కన్ సేవా సదన్, నారీ సుధార్ సంఘం, రాధా కృష్ణా హోం (నానల్‌నగర్), రాష్ట్రీయ మహిళా సమాజం, స్త్రీల ఆస్పత్రి సంక్షేమ సేవకుల సంఘం, స్త్రీల వర్క్‌షాపు.


## భూ సంస్కరణలు

[56 వ పేజీ తరువాయి]

1948 సం. మద్రాసు ఎస్టేట్ల చట్టం, 1956 సం. ఆంధ్ర ఇనాముల రద్దుచట్టం అమలుపరచబడడం వల్ల జమీందారీ మరియు ఇనాం భూములన్నీ రైత్వారీ భూములుగా మార్చ బడుతాయి.

ఆంధ్ర రాష్ట్రంలో రైతాంగపు ఆందోళన, అశాంతి అంటూ ఏమీ లేవు. అయితే 1954 ఆగస్టులో ప్రస్తుత సాంఘిక పరిస్థితులను, అవసరములను దృష్టిలోఉంచుకొని భూ సంస్కరణల పట్ల విచారణజరుపుటకు ఆంధ్రప్రభుత్వం భూసంస్కరణల సంఘాన్ని ఒకదానిని నియమించింది. ఈ సంఘం జిల్లాల్లో పర్యటించి, అవసరమైన భోగట్టా సేకరించిన తరువాత, వ్యవసాయాభివృద్ధికి ఆధారాలైన భూమి, నీరు, కార్మికులు, పశుసంపద, మూలధనం మున్నగువాటి వినియోగావకాశాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వానికి కొన్ని సిఫారసులు చేసింది. ప్రజల శ్రేయస్సును ముఖ్యంగా వ్యవసాయమే వృత్తిగాగల ప్రజల లాభాలను దృష్టిలో ఉంచుకొనే యీ సంఘం ఒక నివేదికను తయారుచేసింది. 1956 ఆగస్టులో ఆంధ్ర శాసనసభ కౌల్దారీచట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టం 1956 సెప్టెంబరులో అమల్లోకి వచ్చింది. ఈవిషయంలో హైదరాబాదురాష్ట్రంలో కలిగిన అనుభవాన్ని పురస్కరించుకొని ఇతర భూసంస్కరణలను చేపట్టుటకు ప్రభుత్వం తలపెట్టింది.

ప్లానింగు కమీషన్ సూచనల ప్రకారం రాష్ట్రంలో భూ సంస్కరణల అమలుకూ, భూ కమతాలు, వ్యవసాయ భూములకు సంబంధించిన అవసరమైన భోగట్టా సేకరించుటకూ, ఆంధ్ర ప్రభుత్వం పూనుకున్నది.



# జిల్లాల వివరాలు

## హైద్రాబాదు

హైద్రాబాదు జిల్లా వైశాల్యం 1648.1 చ. మై. జనాభా 15,11,336. వీరిలో పురుషులు 7,60,730 మంది. స్త్రీలు 7,50,606 మంది ఉన్నారు.

హైద్రాబాదు జిల్లాలో మొత్తం 10,23,177 ఎకరాల భూమిఉన్నది. ఇందులో అటవీప్రాంతం 77,157 ఎకరాలు, సేద్యయోగ్యంకాని భూమి 1,00,553 ఎకరాలు, పడావా భూమి 2,33,263 ఎకరాలు, సాగు అవుతున్న భూమి 3,74,862 ఎకరాలు ఉన్నాయి. ఈ జిల్లాలో హైద్రాబాదు పడమర, హైద్రాబాదు తూర్పు, షహాబాదు, మేడ్చల్, ఇబ్రాహీంపటం అను తాలూకాలు 5 ఉన్నాయి. హైద్రాబాదు రాష్ట్రం పునర్వ్యవస్థీకరించబడిన తరువాత తాండూరు తాలూకా హైద్రాబాదు జిల్లాలో కలుపబడింది. ఈ తాలూకా విస్తీర్ణం 371.2 చ. మై. జనాభా 85,414. మెదకు జిల్లాలోని వికారాబాదు తాలూకా కూడా ఈ జిల్లాలోనే కలిపి వేయబడింది.

## మహబూబునగరు

మహబూబునగరం జిల్లా వైశాల్యం 5,749.8 చ. మై. జనాభా 11,86,496, ఇందులో పురుషులు 5,94,239 మంది, స్త్రీలు 5,92,257 మంది ఉన్నారు.

మహబూబునగరం జిల్లాలోని మొత్తంభూమి 38,46,774 ఎకరాలు, సేద్యయోగ్యం కాని భూమి 2,80,873 ఎకరాలు, పడావా భూమి 5,60,728 ఎకరాలు, సాగు అవుతున్న భూమి 18,19,220 ఎకరాలు ఉన్నాయి.

హైద్రాబాదు రాష్ట్ర పునర్విభజనకు పూర్వం యీ జిల్లాలో మహబూబునగరం, వనపర్తి, ఆత్మకూరు, మఖ్తల్, పర్గీ, షాద్‌నగర్, కల్వకుర్తి, అచ్చంపేట, నాగరకర్నూలు కొల్లాపూరు అను తాలూకాలు మొత్తం 10 వుండేవి. కాని రాష్ట్ర విభజనానంతరం గద్వాల (విస్తీర్ణం 517,8 చ. మై, జనాభా 1,17,017), ఆలంపూరు (విస్తీర్ణం 435.2 చ. మై. జనాభా 81330), కొడంగల్ (విస్తీర్ణం 460.9 చ. మై. జనాభా 1,51,594) అను మూడు తాలూకాలు క్రొత్తగా మహబూబునగరు జిల్లాకు చేర్చబడినవి.

## కరీంనగరు

కరీంనగరు జిల్లా వైశాల్యం 4,594.1 చ. మై. జనాభా 14,28,168 ఇందులో పురుషులు 7,20,768 మంది, స్త్రీలు 7,07,400 మంది ఉన్నారు.

ఈజిల్లాలో మొత్తం 30,29,151 ఎకరాలభూమి ఉన్నది. ఇందులో 7,17,282 ఎకరాలు అటవీ ప్రాంతం, 2,15,542 ఎకరాలు సేద్యయోగ్యం కాని ప్రాంతం, 4,15.783 ఎకరాల పడావా భూమి ఉన్నాయి. సాగు అవుతున్న భూమి 12,59,713 ఎకరాలు ఉంది.

కరీంనగర్ జిల్లాలోని తాలూకాలు ఇవి : కరీంనగర్. సిరిసిల్ల, మెట్టుపల్లి, జగత్యాల, సుల్తానాబాదు, మహదేవపూరు, హుజూరాబాదు.

## వరంగలు

వరంగలు జిల్లా వైశాల్యం 5326.3 చ. మై. జనాభా- 13,25,984. ఇందులో పురుషులు 6,78,801 మంది, స్త్రీలు 6,47,182 మంది ఉన్నారు.

వరంగలు జిల్లాలోని మొత్తం 25,91,493 ఎకరాల భూమిలో అటవీ ప్రాంతం 8,77,468 ఎకరాలు, సేద్యయోగ్యం కాని భూమి 2,47,216 ఎకరాలు, పడావా భూమి 3,42,403 ఎకరాలు, సాగు అవుతున్న భూమి 10,77,913 ఎకరాలు ఉన్నాయి.

ఈ జిల్లాలో ఆరు తాలూకాలు ఉన్నాయి. అవి వరంగలు, పాఖాల, ములుగు, మహబూబాబాదు, పర్కాల, జనగామ.

## ఖమ్మం

ఖమ్మం జిల్లా వైశాల్యం 4,232.1 చ మై. జనాభా 7,00,006. ఇందులో పురుషులు 3,59,089 మంది, స్త్రీలు 3,40,917 మంది ఉన్నారు.

ఈ జిల్లాలోని మొత్తం 25,15,796 ఎకరాల భూమిలో అటవీ ప్రాంతం 10,17,311 ఎకరాలు, సేద్యయోగ్యం కాని భూమి 2,26,262 ఎకరాలు, పడావా భూమి 2,23,974 ఎకరాలు. సాగు అవుతున్న భూమి 7,93,215 ఎకరాలు ఉన్నాయి.

ఈ జిల్లాలో ఖమ్మం, మధిర, యెల్లందు, బూర్గంపహాడు, పాల్వంచ అను ఐదు తాలూకాలున్నాయి.

## నల్లగొండ

నల్లగొండ జిల్లా వైశాల్యం 5,385.1 చ. మై. ఈ జిల్లాలోని మొత్తం 12,52,510మంది జనాభాలో 6,44,144మంది పురుషులు, 6,08,666 మంది స్త్రీలు ఉన్నారు.

ఈ జిల్లా మొత్తంలో 34,60,884 ఎకరాల భూమి వుంది. ఇందులోఅటవీప్రాంతం 3,13,873 ఎకరాలు,సేద్యయోగ్యం కాని భూమి 2,56,847 ఎకరాలు. పడావా భూమి 6,15,537 ఎకరాలు, సాగు అవుతున్న భూమి 17,66,987 ఎకరాలున్నాయి. ఈ జిల్లాలో 7 తాలూకాలున్నాయి. అవి-నల్లగొండ మిర్యాల గూడ, దేవరకొండ, రామన్నపేట, భోనగిరి, సూర్యాపేట, హుజూరునగరు.

## మెదకు

మెదకు జిల్లా వైశాల్యం 3,409.1 చ. మై. జనాభా 10,27,293. ఇందులో 5,16,388 మంది పురుషులు, 5.10, 905 మంది స్త్రీలు ఉన్నారు,

ఈ జిల్లాలోని మొత్తం 22,73,206 ఎకరాల భూమిలో అటవీ ప్రాంతం 2,91,227 ఎకరాలు, సేద్యయోగ్యం కాని భూమి 2,20,548ఎకరాలు, పడావాభూమి 2,94,453ఎకరాలు, సాగు అవుతున్న భూమి 10,32,095 ఎకరాలు ఉన్నాయి.

ఈ జిల్లాలో సంగారెడ్డి, వికారాబాదు, ఆందోల్, మెదకు, సిద్ధిపేట, గజ్వేలు, నర్సాపూరు అను ఏడు తాలూకాలు ఉన్నాయి.

హైద్రాబాదురాష్ట్ర విభజనానంతరం ఈజిల్లాలో క్రొత్తగా జహీరాబాదు (విస్తీర్ణం 505.3 చ. మై. జనాభా 1,33,285,) నారాయిణఖేడ్ (విస్తీర్ణం 377.6. చ. మై. జనాభా 84,687) అను రెండు తాలూకాలు చేర్చబడినవి,

ఈ జిల్లా నుంచి వికారాబాదు తాలూకా విడదీయబడి హైద్రాబాదు జిల్లాలో కలిపివేయబడింది.

## నిజామాబాదు

నిజామాబాదు జిల్లా వైశాల్యం 2,957.6 చ. మై. జనాభా 7,73,158, ఇందులో పురుషులు 3,82,563 మంది, స్త్రీలు 3,90,595 మంది ఉన్నారు.

ఈ జిల్లా భూప్రాంతం మొత్తం 18,81,757 ఎకరాలు, ఇందులో అటవీ ప్రాంతం 4,55,149 ఎకరాలు, సేద్య యోగ్యం కాని భూమి 2,33,608 ఎకరాలు, పడావా భూమి 2,28,608 ఎకరాలు. సాగు అవుతున్న భూమి 6,64,052 ఎకరాలు ఉన్నాయి.

ఈ జిల్లాలోనితాలూకాలు ఇవి: నిజామాబాదు, కామారెడ్డి, యెల్లారెడ్డి, బన్సవాడా, బోధన్, ఆర్మూరు.

## ఆదిలాబాదు

ఆదిలాబాదు జిల్లా వైశాల్యం 7,358.7. చ. మై. జనాభా 9,02,522. ఇందులో పురుషులు 4,51,888 మంది, స్త్రీలు 4,50,640 మంది ఉన్నారు.

ఈ జిల్లాలో ఉన్నమొత్తం 45,39,777ఎకరాల భూమిలో అటవీ ప్రాంతం 22,42,166 ఎకరాలు, సేద్య యోగ్యంకాని ప్రాంతం 6,58,266 ఎకరాలు, పడావా భూమి 3,65,603 ఎకరాలు, సాగు అవుతున్న భూమి 14,68,175 ఎకరాలు ఉన్నాయి,

ఈ జిల్లాలోని తాలూకాలు ఇవి: ఆదిలాబాదు, ఉట్నూరు, ఖానాపూరు, నిర్మల్, బోద్, కిన్వట్, రాజూరా, చిన్నూరు, సిర్పూరు, లక్సెట్టిపేట, ఆసిఫాబాదు.

కిన్వట్, రాజూరా తాలూకాలు బొంబాయి రాష్ట్రంలో కలిసిపోయినవి.

## కర్నూలు

కర్నూలు జిల్లా వైశాల్యం 9,275 చ. మై. జనాభా 16,18,621. ఇందులో పురుషులు 8,18,708 మంది, స్త్రీలు 7,99,913 మంది ఉన్నారు. ఈ జిల్లాలో 12 తాయాకాలు ఉన్నాయి. అవి- కర్నూలు, ద్రోణాచలం, నంద్యాల, పత్తికొండ, నందికొట్కూరు, సిరువెల్ల, కంభం, మార్కాపురం, కోయిలకుంట్ల, బంగనపల్లి, ఆదోని, ఆలూరు.

జిల్లాలోని మొత్తం 58,94,616 ఎకరాల భూమిలో ఆటవీ ప్రాంతం 16,94,477 ఎకరాలు ఉంది. 1954-55 సం. లెక్కల ప్రకారం సేద్యయోగ్యం కాని భూమి 4,40,547 ఎకరాలు, సేద్యం క్రిందలేని భూమి 8,42,542 ఎకరాలు,

సాగు క్రింద ఉన్న భూమి 29,17,050 ఎకరాలు ఉన్నాయి. ప్రభుత్వానికి భూమి శిస్తునుంచి, నీటి పన్నునుంచి రూ. 30, 59,398 ల ఆదాయం వస్తున్నది.

## కృష్ణా

కృష్ణాజిల్లా వైశాల్యం 3,496 చ. మై. జనాభా 17,79,484 ఇందులో పురుషులు 9,03,872 మంది. స్త్రీలు 8,75,612 మంది ఉన్నారు.

ఈ జిల్లాలో పది తాలూకాలు ఉన్నాయి. అవి : మచిలీపట్నం, విజయవాడ, నూజివీడు, నందిగామ, కైకలూరు, గుడివాడ, దివి, జగ్గయ్యపేట, గన్నవరం, తిరువూరు.

కృష్ణాజిల్లాలో మొత్తం 22,39,187 ఎకరాల భూమి ఉంది. ఇందులో 1954-55 సం. పు భూ గణన లెక్కల ప్రకారం అటవీప్రాంతం 2,57,047 ఎకరాలు, సేద్యయోగ్యం కాని ప్రాంతం 4,21,348 ఎకరాలు, సాగుకాని భూమి 2,39,462ఎకరాలు, సాగుఅవుతున్న భూమి 13,18,948 ఎకరాలు ఉన్నాయి. భూమిశిస్తు, నీటి పన్నులనుంచి ఈ జిల్లాకు రూ. 58,32,865 ల ఆదాయం వస్తుంది.

## తూర్పుగోదావరి

తూర్పుగోదావరి జిల్లా వైశాల్యం 5768 చ. మై. జనాభా 24,14,808. ఇందులో పురుషులు 12,06,483 మంది, స్త్రీలు 12,08,325 మంది ఉన్నారు.

ఈ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతపు వైశాల్యం 3,064 చ. మై. ఇక్కడ జనాభా 2,07,784 మంది. వీరిలో పురుషులు 1,04,584 మంది, స్త్రీలు 1,03,200 మంది ఉన్నారు.

తూర్పుగోదావరి జిల్లాలో 13 తాలూకాలు ఉన్నాయి. అవి రాజమండ్రి, రామచంద్రాపురం, రాజోలు, కాకినాడ, తుని, భద్రాచలం, అమలాపురం, పెద్దాపురం, పిఠాపురం, రంపచోడవరం, యెల్లవరం, నాగూరు, కొత్తపేట.

ఈ జిల్లాలో మొత్తం 36,36,573 ఎకరాల భూమి ఉంది. ఇందులో 1954-55 భూ గణన లెక్కల ప్రకారం అటవీ ప్రాంతం 13,35,132 ఎకరాలు, సేద్యయోగ్యం కాని భూమి 5,25,791 ఎకరాలు, సాగుచేయబడని భూమి 7,09,614 ఎకరాలు, సాగుఅయిన భూమి 10,66,463 ఎకరాలు ఉన్నాయి, ప్రభుత్వానికి ఈ జిల్లా నుంచి భూమి శిస్తు, నీటి పన్నుల నుంచి రూ. 83,20,643 ల ఆదాయం వస్తున్నది.

## నెల్లూరు

నెల్లూరు జిల్లా వైశాల్యం 7,942 చ, మై. జనాభా 17,95,632. వీరిలో 9,02,794 మంది పురుషులు, 8,92,838 మంది స్త్రీలు ఉన్నారు,

ఈ జిల్లాలో 13 తాలూకాలు ఉన్నాయి. అవి గూడూరు, కావలి, కొవ్వూరు, నెల్లూరు, ఉదయగిరి, కనిగిరి, రాపూరు, ఆత్మకూరు, కందుకూరు, దర్శి, సుళ్లూరు పేట. పొదిలి, వెంకటగిరి,

నెల్లూరు జిల్లాలో మొత్తం 50,91,191 ఎకరాల భూమి ఉంది. 1954-55 సం. పు భూ గణన లెక్కల ప్రకారం సేద్యంచేయబడని భూమి 10,16,474ఎకరాలు, సాగుఅయిన భూమి 15,41,030 ఎకరాలు ఉన్నాయి. భూమి శిస్తు, నీటి పన్నుల నుంచి రూ. 33,39,428 ల ఆదాయం వస్తుంది.

## శ్రీకాకుళం

శ్రీకాకుళం జిల్లా వైశాల్యం 3,902 చ. మై. జనభా 21,23,136, ఇందులో పురుషులు 10,34,910 మంది, స్త్రీలు 10,88,226 మంది వున్నారు.

శ్రీకాకుళం జిల్లాలోని తాలూకాలు- టెక్కలి, సోంపేట, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం, పాతపట్నం, నరసన్నపేట, బొబ్బిలి, పార్వతీపురం, పాలకొండ, సాలూరు, చీపురుపల్లి.

ఈల్లాలోని మొత్తం 24,88,931 ఎకరాల భూమిలో అటవీ ప్రాంతం 4,35,9608 ఎకరాలు వుంది. 1954-55 సం.పు భూగణన లెక్కల ప్రకారం సాగుకాని భూమి 6,38,188 ఎకరాలు, సేద్యయోగ్యం కాని భూమి 5,45,898 ఎకరాలు, సాగుఅయిన భూమి 8,73,022 ఎకరాలు ఉన్నాయి. ప్రభుత్వానికి యీ జిల్లానుండి భూమిశిస్తు, నీటిపన్నులను ంచి రూ. 21,33,164 ల ఆదాయం వస్తుంది.

## పశ్చిమగోదావరి

పశ్చిమగోదావరి జిల్లా వైశాల్యం 2988 చ. మై. జనాభా 16,97,727. ఇందులో పురుషులు 8,48,990 మంది, స్త్రీలు 8,48,737 మంది ఉన్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలోని తాలూకాలు భీమవరం, తాడేపల్లిగూడెం, ఏలూరు, కొవ్వూరు, పోలవరము, నర్సాపురం, చింతలపూడి, తణుకు.

ఈ జిల్లాలో ఉన్న మొత్తము 19,29,460 ఎకరాల భూమిలో అటవీ ప్రాంతం 1,18,471 ఎకరాలువుంది 1954, 1955 లెక్కల సం. ప్రకారం సేద్యయోగ్యం కాని భూమి

3,92,112 ఎకరాలు, సాగుకాని భూమి 4,66,372 ఎకరాలు, సాగు అయిన భూమి 9,54,875 ఎకరాలు ఉన్నాయి. ప్రభుత్వానికి ఈ జిల్లానుంచి భూమిశిస్తు నీటి పన్నుల ద్వారా రూ. 71,34,071 ల ఆదాయం వస్తుంది.

## విశాఖపట్నం

విశాఖపట్నం జిల్లా వైశాల్యం 5,201 చ. మై. జనాభా 20,72,698. ఇందులో పురుషులు 10,23,192 మంది, స్త్రీలు 10,49,506 మంది ఉన్నారు.

ఈ జిల్లాలోని తాలూకాలు, నర్సీపట్నం, ఎలమంచిలి, అనకాపల్లి, విశాఖపట్నం, శృంగవరపు కోట, విజయనగరం, భీమునిపట్నం, చోడవరం, చింతపల్లి.

ఈ జిల్లాలో వున్న భూప్రాంతం మొత్తం 33,14,434 ఎకరాలు. ఇందులో అటవీ ప్రాంతం 14,46,164 ఎకరాలు 1954-55 సం. లెక్కల ప్రకారం సేద్యయోగ్యం కాని భూమి 7,86,736 ఎకరాలు, సాగుకాని భూమి 3,01,844 ఎకారాలు, సాగు అయిన భూమి 7,79,690 ఎకరాలు ఉన్నాయి. ఈ జిల్లానుంచి ప్రభుత్వానికి భూమి శిస్తు, నీటి పన్నుల నుంచి రూ. 10,01,982 ల ఆదాయం వస్తుంది.

## గుంటూరు

గుంటూరు జిల్లా వైశాల్యం 5,795 చ. మై. జనాభా 25,49,996. ఇందులో పురుషులు 12,91,745 మంది, స్త్రీలు 12,58,251 మంది ఉన్నారు.

గుంటూరుజిల్లాలోని తాలూకాలు- గుంటూరు, ఒంగోలు, బాపట్ల, తెనాలి, రేపల్లె, నర్సారావుపేట, పల్నాడు, వినుకొండ, సత్తెనపల్లి.

ఈ జిల్లాలో మొత్తం 36,93,743 ఎకరాల భూప్రాంతం వుంది. ఇందులో అటవీ ప్రాంతం 4,68,862 ఎకరాలు వుంది. సేద్యం క్రిందలేని భూమి 5,70,956 ఎకరాలు, సాగు అవుతున్న భూమి 21,17,052 ఎకరాలు- 1954 - 55 సంవత్సరము లెక్కల ప్రకారం- ప్రభుత్వానికి భూమి శిస్తు క్రింద రూ. 84,75,968 ల ఆదాయం వస్తున్నది.

## చిత్తూరు

చిత్తూరు జిల్లా వైశాల్యం 5931 చ. మై. జనాభా 18,10,377. ఇందులో పురుషులు 924,592 మంది, స్త్రీలు 8,85,785 మంది వున్నారు.

చిత్తూరు జిల్లాలోని తాలూకాలు : చిత్తూరు, మదనపల్లి, వాయలపాడు, కాళహస్తి, పుంగనూరు, తిరుత్తణి, పలమనేరు, చంద్రగిరి, పుత్తూరు.

ఈ జిల్లాలోని మొత్తం 37,69,290 ఎకరాల భూప్రాంతంలో అటవీ ప్రాంతం 5,23,721 ఎకరాలు, సేద్యయోగ్యం కాని ప్రాంతం 13,45,907 ఎకరాలు, సాగుఅవుతున్న భూమి 9,54,388 ఎకరాలు- 1954-55 సం, లెక్కల ప్రకారం- ఉన్నాయి. ప్రభుత్వానికి భూమి శిస్తు, నీటి పన్నుల ద్వారా రూ. 14,22,118 ల ఆదాయం వస్తున్నది.

## అనంతపురం

అనంతపురం జిల్లా వైశాల్యం 7,837 చ. మై. జనాభా 14,83,591. ఇందులో పురుషులు 7,63.379 మంది, స్త్రీలు 7,20,212 మంది ఉన్నారు.

అనంతపురంజిల్లాలోనితాలూకాలు : అనంతపురం,మడకశిర, కదిరి, గుత్తి, హిందూపురం, పెనుగొండ, కల్యాణదుర్గం, ధర్మవరం, తాడిపత్రి, రాయదుర్గం, ఉరవకొండ.

ఈ జిల్లాలో మొత్తం 42,92,129 ఎకరాల భూమిలో అటవీ ప్రాంతం 4,82,795, ఎ. సేద్యయోగ్యం కాని భూమి 7,23,463 ఎకరాలు, సేద్యం చేయబడని భూమి 10,37,667 ఎకరాలు, సాగు అవుతున్న భూమి 24,84,404-1954-55 సం. లెక్కలప్రకారం ఉన్నాయి. ప్రభుత్వానికి ఈ జిల్లానుంచి భూమి శిస్తు, నీటి పన్నుల ద్వారా రూ. 21,95,529 ల ఆదాయం వస్తున్నది.

## కడప

కడప జిల్లా వైశాల్యం 5,923 చ.మై. జనాభా 11,61,731 ఇందులో పురుషులు 5,95,060 మంది, స్త్రీలు 5,66,671 మంది ఉన్నారు.

ఈ జిల్లాలో ఉన్న తాలూకాలు - కడప, ప్రొద్దుటూరు, రాజంపేట, జమ్మలమడుగు, పులివెందల, బద్వేలు, రాయచోటి, సిద్దవటం, కమలాపురం.

ఈ జిల్లాలో మొత్తం 37,94.524 ఎకరాల భూమి వుంది. ఇందులో అటవీ ప్రాంతం 11,56,865 ఎకరాలు, సేద్యయోగ్యం కాని భూమి 3,85,263 ఎకరాలు, సేద్యం చేయబడని భూమి 11,90,994 ఎకరాలు, సాగు అవుతున్న భూమి 10,65,400 ఎకరాలు- 1954-55 సం. లెక్కల ప్రకారం- ఉన్నాయి. ప్రభుత్వానికి యీ జిల్లానుంచి భూమి శిస్తు నీటి పన్నులవల్ల రూ. 20,83,633 ల ఆదాయం వస్తున్నది.

# శాసనసభ్యులు

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యుల సంఖ్య 301 గా నిర్ణయించబడినది. అయితే యిప్పుడు ఆంధ్ర శాసనసభ ప్రస్తుత సభ్యులు 196 మంది, హైదరాబాదు శాసన సభలోని తెలంగాణా సభ్యులు 101 మంది, మొత్తం 297 మంది సభ్యులతో శాసన సభ ప్రారంభమవుతున్నది. సభ్యులపేర్లు, వారి పార్టీలు, నియోజక వర్గాల వివరాలు దిగువ ఇవ్వబడినవి.

| సంఖ్య | పేరు | పార్టీ | నియోజకవర్గము |
|---|---|---|---|
| 1. | అనంత రామచంద్రారెడ్డి | పి. డి. ఎఫ్. (పీపుల్సు డెమోక్రటిక్ ఫ్రంట్) | కొల్లాపురం |
| 2. | కె. అనంతరామారావు | ,, | దేవరకొండ |
| 3. | అనంతరెడ్డి | కాంగ్రెసు | కొడంగల్ |
| 4. | అనంతరెడ్డి | సోషలిస్టు | బాల్కొండ |
| 5. | అప్పారావు | కాంగ్రెసు | నారాయణ్ ఖేడ్ |
| 6. | అబ్దుల్ రహమాన్ | పి. డి. ఎఫ్. | మలక్ పేట |
| 7. | జగన్ పల్లి ఆనందరావు | ,, | సిరిసిల్ల |
| 8. | అరిగె రామస్వామి | కాంగ్రెసు | వికారాబాదు (రిజర్వుడు) |
| 9. | ఆరుట్ల కమలాదేవి | పి. డి. ఎఫ్. | ఆలేరు |
| 10. | ఉప్పల ముల్చూర్ | ,, | సూర్యాపేట (రిజర్వుడు) |
| 11. | కటంగూరి కేశవరెడ్డి | కాంగ్రెసు | పరకాల |
| 12. | కట్ల రామారెడ్డి | పి. డి. ఎఫ్. | నల్గొండ |
| 13. | కాశీనాథరావు వైద్య | కాంగ్రెసు | బేగంబజార్ |
| 14. | కాశీరాం గంగి మరసోక్లె | ,, | అసిఫాబాద్ (రిజర్వుడు) |
| 15. | బుగ్గవీటి కృష్ణయ్య | పి. డి. ఎఫ్. | ఖమ్మం |
| 16. | గంగారాం | సోషలిస్టు | నిర్మల్ (రిజర్వుడు) |
| 17. | గంగుల భూమయ్య | కాంగ్రెసు | మెట్ పల్లి |
| 18. | గుండవరం హనుమంతరావు | పి. డి. ఎఫ్. | ములుగు |
| 19. | గుండేరావు యెరోల్కర్ | కాంగ్రెసు | జహీరాబాదు |
| 20. | ఏ. గురువారెడ్డి | పి. డి. ఎఫ్. | సిద్దీపేట |
| 21. | గోపాలరావు ఎక్బోటే | కాంగ్రెసు | చాదర్ ఘాట్ |
| 22. | జి. గోపాలరావు | పి. డి. ఎఫ్. | పాఖాల్ |
| 23. | గోపి గంగారెడ్డి | సోషలిస్టు | నిర్మల్ |
| 24. | యమ్. బి. గౌతమ్ | కాంగ్రెసు | ఇబ్రాహింపట్నం (రిజర్వుడు) |
| 25. | బి. ఎమ్. చంద్రారావు | షెడ్యూల్డు కులాల ఫెడరేషన్ | మహబూబాబాద్ (రిజర్వుడు) |
| 26. | మర్రి చెన్నారెడ్డి | కాంగ్రెసు | వికారాబాదు |

| సంఖ్య | పేరు | పార్టీ | నియోజకవర్గము |
|---|---|---|---|
| 27. | జవ్వాది దామోదరరావు | పి. డి. ఎఫ్. | ఎల్గందల |
| 28. | దాజీ శంకరరావు | ,, | ఆదిలాబాద్ |
| 29. | వి. డి. దేశపాండే | ,, | ఇప్పగూడెం |
| 30. | ఎమ్. నరసింగరావు | కాంగ్రెసు | కల్వకుర్తి |
| 31. | ఐ. నరసింహులు | పి. డి. ఎఫ్. | హుజూర్‌నగర్ (రిజర్వుడు) |
| 32. | కె. ఎల్. నరసింహారావు | ,, | ఎల్లందు |
| 33. | పండిట్ నరేందర్‌జీ | కాంగ్రెసు | కార్వాన్ |
| 34. | కె. నాగన్న | ,, | అలంపూర్ - గద్వాల (రిజర్వుడు) |
| 35. | నాగయ్య | సోషలిస్టు | ఎల్లందు (రిజర్వుడు) |
| 36. | కె. వి. నారాయణరెడ్డి | స్వతంత్ర | రాజగోపాలపేట |
| 37. | పాపిరెడ్డి | పి. డి. ఎఫ్. | ఇబ్రాహింపట్నం |
| 38. | పి. పుల్లారెడ్డి | కాంగ్రెసు | అలంపురం - గద్వాల |
| 39. | పెండెం వాసుదేవ్ | పి. డి. ఎఫ్. | గజ్వేల్ |
| 40. | పొన్నమనేని నారాయణరావు | కాంగ్రెసు | హుజూరాబాదు |
| 41. | జె. కె. ప్రాణేశాచార్య | ,, | తాండూరు |
| 42. | బట్టి రాజారాం | షెడ్యూల్డు కులాల ఫెడరేషన్ | జగిత్యాల (రిజర్వుడు) |
| 43. | బద్దం మల్లారెడ్డి | పి. డి. ఎఫ్. | జగిత్యాల |
| 44. | బసప్ప | కాంగ్రెసు | మఖ్తల్ - ఆత్మకూరు |
| 45. | ఎమ్. బుచ్చయ్య | సోషలిస్టు | సిర్పూర్ |
| 46. | బొమ్మగాని ధర్మభిక్షం | పి. డి. ఎఫ్. | హుజూర్‌నగర్ |
| 47. | బ్రహ్మరెడ్డి | కాంగ్రెసు | నాగర కర్నూల్ |
| 48. | మక్‌దూమ్ మొహియుద్దీన్ | పి. డి. ఎఫ్. | హుజూర్‌నగర్ |
| 49. | మాసూమాబేగం | కాంగ్రెసు | షాలిబండ |
| 50. | మీర్జా షకూర్‌బేగ్ | ,, | హసన్‌పర్తి |
| 51. | ముదిగంటి కొండలరెడ్డి | స్వతంత్ర | కూనారం |
| 52. | ఎల్. ముత్తయ్య | పి. డి. ఎఫ్. | పెద్దపల్లి |
| 53. | జె. బి. ముత్యాలరావు | కాంగ్రెసు | సికింద్రాబాదు (రిజర్వుడు) |
| 54. | మెహదీ నవాజ్ జంగ్ బహదూర్ | ,, | సోమాజీగూడా |
| 55. | డా. జి. యస్. మేల్కోటే | ,, | ముషీరాబాద్ |
| 56. | దావర్ హుస్సేన్ | ,, | నిజామాబాద్ |
| 57. | శ్రీమతి జె. ఎమ్. రాజమణీదేవి | షెడ్యూల్డు కులాల ఫెడరేషన్ | సిరిసిల్ల (రిజర్వుడు) |
| 58. | కోదాటి రాజమల్లు | సోషలిస్టు | లక్సెట్టి పేట |
| 59. | ఏ. రాజారెడ్డి | పి. డి. ఎఫ్. | సుల్తానాబాద్ |
| 60 | ఎమ్. ఎస్. రాజలింగం | కాంగ్రెసు | వరంగల్లు |
| 61. | రాజారాం | సోషలిస్టు | ఆర్మూరు |
| 62. | బూర్గుల రామకృష్ణారావు | కాంగ్రెసు | షాద్‌నగర్ |
| 63. | కె. రామకృష్ణారావు | స్వతంత్ర | వేంసూరు |

| సం. | పేరు | పార్టీ | నియోజకవర్గము |
|---|---|---|---|
| 64. | కె. రామచంద్రారెడ్డి | పి. డి. ఎఫ్. | రామన్నపేట |
| 65. | ఎస్. రామనాథం | ,, | హనుమకొండ |
| 66. | గోకా రామలింగం | కాంగ్రెసు | భోనగిరి |
| 67. | పి. రామస్వామి | ,, | నాగరకర్నూలు (రిజర్వుడు) |
| 68. | వి. రామారావు | ,, | కామారెడ్డి (రిజర్వుడు) |
| 69. | జె. రామారెడ్డి | ,, | నర్సాపూర్ |
| 70. | ఎమ్. రామారెడ్డి | సోషలిస్టు | వనపర్తి |
| 71. | రెంటాల బాల గురుమూర్తి | పి. డి. ఎఫ్. | ఖమ్మం (రిజర్వుడు) |
| 72. | లక్ష్మణకుమార్ | కాంగ్రెసు | ఆందోలు (రిజర్వుడు) |
| 73. | కొండా లక్ష్మణ్ బాపూజీ | ,, | ఆసిఫాబాద్ |
| 74. | పెరికె లక్ష్మయ్య | పి. డి. ఎఫ్. | నల్లగొండ (రిజర్వుడు) |
| 75. | లక్ష్మీనరసింహారెడ్డి | ,, | వరదన్నపేట |
| 76. | శ్రీమతి సంగం లక్ష్మీబాయి | కాంగ్రెసు | బాన్‌వాడ |
| 77. | వరకాంతం గోపాలరెడ్డి | ,, | మేడ్చల్ |
| 78. | వల్లూరి బసవరాజు | ,, | సికిందరాబాద్ |
| 79. | జి. విఠల్‌రెడ్డి | ,, | కామారెడ్డి |
| 80. | కె. ఆర్. వీరాస్వామి | షెడ్యూల్డు కులాల ఫెడరేషన్ | కల్వకుర్తి (రిజర్వుడు) |
| 81. | బి. వీరాస్వామి | ,, | కొడంగల్ (రిజర్వుడు) |
| 82. | కొండా వెంకట రంగారెడ్డి | కాంగ్రెసు | షాహాబాద్ |
| 83. | వెంకట రాజేశ్వర జోషి | ,, | ఆందోలు |
| 84. | కె. వెంకటరామారావు | ,, | పెద మునగాల |
| 85. | వెంకటరామారావు | పి. డి. ఎఫ్. | కరీంనగర్ |
| 86. | కాంచనపల్లి వెంకటరామారావు | ,, | చినకొండూరు |
| 87. | జె. వెంకటేశం | సోషలిస్టు | హుజూరాబాద్ (రిజర్వుడు) |
| 88. | వెంకటేశ్వరరావు | కాంగ్రెసు | మెదక్ |
| 89. | కె. వెంకయ్య | పి. డి. ఎఫ్. | మధిర |
| 90. | శ్రీమతి శాంతాబాయి | కాంగ్రెసు | మక్తల్ - ఆత్మకూర్ |
| 91. | ఎస్. ఎల్. శాస్త్రి | ,, | బోధన్ |
| 92. | శ్రీనివాసరావు | సోషలిస్టు | డిచ్‌పల్లి |
| 93. | కన్నెకంటి శ్రీనివాసరావు | పి. డి. ఎఫ్. | మహబూబాబాద్ |
| 94. | గులుకోట శ్రీరాములు | సోషలిస్టు | మంథెన |
| 95. | శ్రీహరి గుండావర్ | కాంగ్రెసు | కిన్వత్ |
| 96. | షాజహాన్ బేగం | ,, | మహబూబ్‌నగర్ |
| 97. | సయ్యదు అఖ్తర్ హుస్సేన్ | పి. డి. ఎఫ్. | జనగామ |
| 98. | సయ్యద్ హుస్సేన్ | ,, | హైద్రాబాద్ |
| 99. | సింగిరెడ్డి వెంకటరెడ్డి | ,, | సుల్తాన్ పురం |
| 100. | సూరి విశ్వనాథరావు | సోషలిస్టు | లక్సెట్టిపేట |

| నం. | పేరు | పార్టీ | నియోజకవర్గము |
|---|---|---|---|
| 101. | పి. హనుమంతరావు | కాంగ్రెసు | మహబూబ్‌నగరం |
| 102. | కె. వి. వేమారెడ్డి | ,, | కదిరి - అనంతపురంజిల్లా |
| 103. | పి. బయ్యపరెడ్డి | ,, | నల్లమడ |
| 104. | పూల వెంకట రమణప్ప | ,, | గోరంట్ల |
| 105. | కల్లూరు సుబ్బారావు | ,, | హిందూపురం |
| 106. | శ్రీమతి జి. రుక్మిణీదేవి | ,, | హిందూపురం (రిజర్వుడు) |
| 107. | పి. చిదంబరరెడ్డి | ,, | పెనుకొండ |
| 108. | పప్పూరు రామాచార్లు | ,, | ధర్మవరం |
| 109. | కె. శాంతప్ప | కాంగ్రెసు | ధర్మవరం (రిజర్వుడు) |
| 110. | పి. ఆంథోనిరెడ్డి | ,, | అనంతపురం |
| 111. | తరిమెల రామచంద్రారెడ్డి | ,, | పుట్లూరు |
| 112. | చల్లా సుబ్బరాయుడు | ,, | తాడిపత్రి |
| 113. | నారాయణప్ప | ,, | గుత్తి |
| 114. | ఎమ్. రాజారాం | ,, | గుత్తి (రిజర్వుడు) |
| 115. | ఎన్. సి. శేషాద్రి | ,, | రాయదుర్గం |
| 116. | పి. పార్థసారధి | ,, | రాజంపేట (కడపజిల్లా) |
| 117. | పి. వెంకట సుబ్బయ్య | ,, | రాజంపేట (రిజర్వుడు) |
| 118. | వై. ఆదినారాయణరెడ్డి | ,, | రాయచోటి |
| 119. | కె. కోటిరెడ్డి | ,, | లక్కిరెడ్డి పల్లి |
| 120. | షేక్ మహమ్మద్ రహంతుల్లా | ,, | కడప |
| 121. | బి. రత్నసభాపతి | సోషలిస్టు | బద్వేల్ |
| 122. | బొమ్ము రామరెడ్డి | స్వతంత్ర | మైదుకూరు |
| 123. | — | — | ప్రొద్దుటూరు |
| 124. | కె. రామయ్య | కాంగ్రెసు | జమ్మలమడుగు |
| 125. | నర్రెడ్డి శంభురెడ్డి | ,, | కమలాపురం |
| 126. | పి. బసివిరెడ్డి | ,, | పులివెందల |
| 127. | హెచ్. రామలింగారెడ్డి | ,, | ఆలూరు, కర్నూలుజిల్లా |
| 128. | జి. బుస్సన్న | సోషలిస్టు | అదోని |
| 129. | టి. జి. తిమ్మయ్యసెట్టి | కాంగ్రెసు | కోసిగి |
| 130. | డి. సంజీవయ్య | ,, | ఎమ్మిగనూరు (రిజర్వుడు) |
| 131. | కె. విజయ భాస్కరరెడ్డి | ,, | ఎమ్మిగనూరు |
| 132. | పి. హనుమంతరెడ్డి | ,, | పత్తికొండ |
| 133. | బి. పి. శేషారెడ్డి | స్వతంత్ర | ద్రోణాచలం |
| 134. | మహబూబ్ అలీఖాన్ | కాంగ్రెసు | కర్నూలు |
| 135. | ఇ. అయ్యపురెడ్డి | ,, | నందికొట్కూరు |
| 136. | ఎన్. కె. లింగం | ,, | నందికొట్కూరు (రిజర్వుడు) |
| 137. | గోపవరం రామిరెడ్డి | స్వతంత్ర | నంద్యాల |

| సం. | పేరు | పార్టీ | నియోజకవర్గము |
|---|---|---|---|
| 138. | బి. వి. సుబ్బారెడ్డి | కాంగ్రెసు | కోయిలకుంట్ల |
| 139. | సి. పి. తిమ్మారెడ్డి | ,, | సిర్వెల్ |
| 140. | పిడతల రంగారెడ్డి | ,, | గిద్దలూరు |
| 141. | కందుల ఓబులరెడ్డి | కృషిక్ లోక్ పార్టీ | మార్కాపురం |
| 142. | నర్కా వెంకటయ్య | ,, | ఎర్రగొనిపాలెం |
| 143. | కమ్మిలి అప్పారావు | కాంగ్రెసు | కైకలూరు, కృష్ణాజిల్లా |
| 144. | అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం | స్వతంత్ర | గుడివాడ |
| 145. | వేముల కూర్మయ్య | కాంగ్రెసు | గుడివాడ, (రిజర్వుడు) |
| 146. | పుచ్చలపల్లి సుందరయ్య | కమ్యూనిస్టు | గన్నవరం |
| 147. | చాగలమూడి రామకోటయ్య | కృషిక్ లోక్ పార్టీ | కంకిపాడు |
| 148. | ఏ. కాశేశ్వరరావు | కాంగ్రెసు | విజయవాడ |
| 149. | మరుపిళ్ళ చిట్టి అనే అప్పలస్వామి | ,, | విజయవాడ, ఉత్తరం |
| 150. | వెల్లంకి విశ్వేశ్వరరావు | కమ్యూనిస్టు | మైలవరం |
| 151. | పిల్లలమర్రి వెంకటేశ్వర్లు | ,, | నందిగామ |
| 152. | మాగంటి రామయ్య | కాంగ్రెసు | కంచికచర్ల |
| 153. | పేట బాపయ్య | ,, | తిరువూరు |
| 154. | మేకా రంగయ్యప్పారావు బహదూర్ | ,, | నూజివీడు |
| 155. | కాకాని వెంకటరత్నం | ,, | వుయ్యూరు |
| 156. | పిన్నెంటి పమిదేశ్వరరావు | ,, | మల్లేశ్వరం |
| 157. | కొల్లిపర వెంకట రమణయ్య నాయుడు | ,, | మచిలీపట్నం |
| 158. | రాజా యార్లగడ్డ శివరామ ప్రసాద్ | ,, | దివి |
| 159. | మల్లిపూడి రాజేశ్వరరావు | ,, | దివి (రిజర్వుడు) |
| 160. | అనగాని భగవంతరావు | కృషిక్ లోక్ | కూచిపూడి, గుంటూరుజిల్లా |
| 161. | యడం చెన్నయ్య | కాంగ్రెసు | రేపల్లె |
| 162. | కల్లూరి చంద్రమౌళి | ,, | వేమూరు |
| 163. | పుతుంబాక శ్రీరాములు | ,, | దుగ్గిరాల |
| 164. | ఆలపాటి వెంకట్రామయ్య | ,, | తెనాలి |
| 165. | గోవాడ పరంధామయ్య | కృషీకార్ | పొన్నూరు |
| 166. | మంతెన వెంకట్రాజు | కాంగ్రెసు | బాపట్ల |
| 167. | ప్రగడ కోటయ్య | ,, | చీరాల |
| 168. | కొల్లా రామయ్య | ,, | పరచూరు |
| 169. | జి. బాపయ్య | కాంగ్రెసు | పెద కాకాని |
| 170. | మేకా కోటిరెడ్డి | ,, | మంగళగిరి |
| 171. | తెల్లాకుల జాలయ్య | ,, | గుంటూరు - 1. |
| 172. | మేడూరి నాగేశ్వరరావు | ,, | గుంటూరు - 2. |
| 173. | గణపా రామస్వామిరెడ్డి | కృషిక్ లోక్ | పెద కూరపాడు |
| 174. | కె. బ్రహ్మానందరెడ్డి | కాంగ్రెసు | ఫిరంగిపురం |

| సం. | పేరు | పార్టీ | నియోజకవర్గము |
|---|---|---|---|
| 175. | వావిలాల గోపాలకృష్ణయ్య | స్వతంత్ర | సత్తెనపల్లి |
| 176. | మండవ బాపయ్య చౌదరి | కృషిక్ లోక్ | గురజాల |
| 177. | నలబోలు గోవిందరాజులు | కాంగ్రెసు | వినుకొండ |
| 178. | మండపాటి నాగిరెడ్డి | కమ్యూనిస్టు | మాచెర్ల |
| 179. | బండ్లమూడి వెంకట శివయ్య | కృషిక్ లోక్ | పర్చూరు |
| 180. | నల్లపాటి వెంకట్రామయ్య | కాంగ్రెసు | నరసారావుపేట |
| 181. | నాగినేని వెంకయ్య | కృషిక్ లోక్ | అద్దంకి. |
| 182. | జాగర్లమూడి చంద్రమౌళి | కాంగ్రెసు | అమ్మనబ్రోలు |
| 183. | టి. ప్రకాశం | ,, | ఒంగోలు |
| 184. | టి. జియ్యర్‌దాస్ | ,, | ఒంగోలు (రిజర్వుడు) |
| 185. | నీలం సంజీవరెడ్డి | ,, | కాళహస్తి, చిత్తూరుజిల్లా |
| 186. | పి. సింగరయ్య | ,, | కాళహస్తి, (రిజర్వుడు) |
| 187. | ఆర్. బి. రామకృష్ణరాజు | స్వతంత్ర | వడమాలపేట |
| 188. | పసల గోపాలరెడ్డి | కాంగ్రెసు | తిరుత్తని |
| 189. | ఎమ్. దొరైకణ్ణు | ,, | తిరుత్తని (రిజర్వుడు) |
| 190. | ఎస్. రంగనాథ మొదలియార్ | స్వతంత్ర | రామకృష్ణరాజుపేట |
| 191. | ఎస్. పి. చెంగల్రాయ నాయుడు | కాంగ్రెసు | వేపంజేరి |
| 192. | పి. చిన్నమ్మరెడ్డి | ,, | చిత్తూరు |
| 193. | పి. రాజాగోపాల్ నాయుడు | కృషిక్‌లోక్ | తవనంపల్లి |
| 194. | డి. రామబ్రహ్మం | కాంగ్రెసు | కుప్పం |
| 195. | రాజవీర బసవ చిక్కరాయలు వై. బి. | స్వతంత్ర | పుంగనూరు |
| 196. | ఏ రత్నం | కాంగ్రెసు | పుంగనూరు (రిజర్వుడు) |
| 197. | టి. గోపాల కృష్ణయ్య | ,, | మదనపల్లి. |
| 198. | టి. ఎన్. వెంకట సుబ్బారెడ్డి | ,, | తంబళ్లపల్లి |
| 199. | పి. తిమ్మారెడ్డి | ,, | వాయల్పాడు |
| 200. | ఎన్. వెంకటరామానాయుడు | కృషిక్‌లోక్ | పీలేరు |
| 201. | ఆర్. నాదమునిరెడ్డి | కకాంగ్రెసు | తిరుపతి |
| 202. | మహమ్మద్ తహశీల్ | మ్యూనిస్టు | భద్రాచలం, తూర్పుగోదావరి జిల్లా |
| 203. | — | — | భద్రాచలం, (రిజర్వుడు) |
| 204. | డా. ఏ. బాలనాగేశ్వరరావు | ప్రజా పార్టీ | రాజమండ్రి |
| 205. | శ్రీమతి నీరుకొండ వెంకటరత్నం | కాంగ్రెసు | బూరుగుపూడి |
| 206. | బత్తిన సుబ్బారావు | స్వతంత్ర | బూరుగుపూడి (రిజర్వుడు) |
| 207. | దురుసేటి గోపాలరావు | ,, | జగ్గంపేట |
| 208. | చూర్వాసుల వెంకట సుబ్బారావు | కమ్యూనిస్టు | పెద్దాపురం |
| 209. | పర్వత గుర్రాజు | కాంగ్రెసు | ప్రత్తిపాడు |
| 210. | రాజా వత్సవాయి వెంకట కృష్ణంరాజు బహదూర్ | ,, | తుని |

| సం. | పేరు | పార్టీ | నియోజకవర్గము |
|---|---|---|---|
| 211. | వాడ్రేవు గోపాలకృష్ణ | ప్రజా పార్టీ | పిఠాపురం |
| 212. | పి. సత్యనారాయణ | కమ్యూనిస్టు | సామర్లకోట |
| 213. | మల్లిపూడి పళ్లంరాజు | కాంగ్రెసు | కాకినాడ |
| 214. | రేమళ్ల తిరుపతిరావు | ,, | పల్లిపాలెం |
| 215. | రెడ్డి కామయ్య | ,, | పల్లిపాలెం, (రిజర్వుడు) |
| 216. | రాజా కాకర్లపూడి రామచంద్రరాజు | ప్రజా పార్టీ | రామచంద్రపురం |
| 217. | తేతలి లక్ష్మీనారాయణరెడ్డి | ,, | అనపర్తి |
| 218. | ఎస్. బులుసు ప్రకాశరం పట్టాభి రామారావు | కాంగ్రెసు | పామర్రు |
| 219. | నడింపల్లి రామభద్రరాజు | ,, | చెయ్యేరు |
| 220. | జి. నరసింహమూర్తి | స్వతంత్ర | అమలాపురం |
| 221. | బొజ్జా అప్పలస్వామి | ,, | అమలాపురం, (రిజర్వుడు) |
| 222. | ఏ. వెంకట రామరాజు | కమ్యూనిస్టు | రాజోలు |
| 223. | జి. నాగేశ్వరరావు | ,, | రాజోలు, (రిజర్వుడు) |
| 224. | కళా వెంకటరావు | కాంగ్రెసు | కొత్తపేట |
| 225. | దిరిశల వెంకట రమణారెడ్డి | ,, | దర్సి, నెల్లూరుజిల్లా |
| 226. | ఎస్. కాశిరెడ్డి. | కమ్యూనిస్టు | పొదిలి |
| 227. | గుజ్జులయుల్ల మందారెడ్డి | ,, | కనిగిరి |
| 228. | షేక్ మౌలాసాహేబ్ | కాంగ్రెసు | ఉదయగిరి |
| 229. | కాశిం వెంకటరెడ్డి | స్వతంత్ర | నందిపాడు |
| 230. | దివి కొండయ్యచౌదరి | కాంగ్రెసు | కందుకూరు |
| 231. | నల్లమోతు చెంచురామయ్య నాయుడు | ,, | కొండపి |
| 232. | బత్తిన రామకృష్ణారెడ్డి | ప్రజా పార్టీ | కావలి |
| 233. | బి. శంకరయ్య | కమ్యూనిస్టు | బుచ్చిరెడ్డిపాలెం |
| 234. | స్వర్ణ వేమయ్య | ,, | బుచ్చిరెడ్డిపాలెం, (రిజర్వుడు) |
| 235. | బెజవాడ గోపాలరెడ్డి | కాంగ్రెసు | ఆత్మకూరు |
| 236. | పదిలేటి వెంకటస్వామిరెడ్డి | ,, | వెంకటగిరి |
| 237. | అల్లం కృష్ణయ్య | ,, | ,, |
| 238. | ఆనెం చెంచు సుబ్బారెడ్డి | ,, | నెల్లూరు |
| 239. | వంగల్లు కోదండరామరెడ్డి | ,, | సర్వేపల్లి |
| 240. | పి. గోపాలకృష్ణరెడ్డి | ,, | గూడూరు |
| 241. | ఎమ్. మునుస్వామి | ,, | గూడూరు, (రిజర్వుడు) |
| 242. | అల్లూరి బాపినీడు | ,, | కొవ్వూరు, పశ్చిమగోదావరి జిల్లా |
| 243. | టి. వీరరాఘవులు | ,, | కొవ్వూరు, (రిజర్వుడు) |
| 244. | పుసులూరి కోదండరామయ్య | ,, | పోలవరం |
| 245. | శీర్ల బ్రహ్మయ్య | ,, | ఏలూరు |
| 246. | మూల్పూరి రంగయ్య | ,, | దెందులూరు |

| నం. | పేరు | పార్టీ | నియోజకవర్గము |
| --- | --- | --- | --- |
| 247. | కిళాంబి వెంకట కృష్ణావతారం | ,, | తాడేపల్లిగూడెం |
| 248. | నండూరి శ్రీనివాసరావు | ,, | తాడేపల్లి గూడెం, (రిజర్వుడు) |
| 249. | చింతలపాటి సీతారామచంద్ర వరప్రసాద మూర్తిరాజు | ,, | పెంటపాడు |
| 250. | ఎమ్. హరిశ్చంద్ర ప్రసాద్ | ,, | తణుకు |
| 251. | శ్రీమతి చోడగం అమ్మన్నరాజా | ,, | అత్తిలి |
| 252. | జవ్వాది లక్ష్మయ్య | ,, | పెనుగొండ |
| 253. | గ్రంధి వెంకటరెడ్డినాయుడు | ,, | నరసాపురం |
| 254. | అద్దేపల్లి సత్యనారాయణమూర్తి | ,, | పాలకొల్లు |
| 255. | డి. పెరుమాళ్లు | ,, | పాలకొల్లు, (రిజర్వుడు) |
| 256. | ఎన్. వెంకటరామయ్య | ,, | భీమవరం |
| 257. | గాదిరాజు జగన్నాధరాజు | కాంగ్రెసు | ఉండి |
| 258. | బి. ఆదినారాయణ | సోషలిస్టు | భోగాపురం, విశాఖపట్నం జిల్లా |
| 259. | శ్రీమతి కుసుం గజపతిరాజు | ,, | గజపతి నగరం |
| 260. | గంట్లాన సూర్యనారాయణ | ,, | ,, |
| 261. | పూసపాటి విజయరామ గజపతిరాజు | ,, | విజయనగరం |
| 262. | కె. వి. యస్. పద్మనాభరాజు | ,, | రేవిడి |
| 263. | గొట్టుముక్కల జగన్నాధరాజు | ,, | భీమునిపట్నం |
| 264. | ఏ.వి. భానోజీరావు | కాంగ్రెసు | విశాఖపట్నం |
| 265. | బి. జి. ఎమ్. ఏ. నరసింహారావు | ,, | కణితి |
| 266. | ఏ. టి. నాగయ్య | కృషిక్ లోక్ | పరవాడ |
| 267. | బీసెట్టి అప్పారావు | ,, | అనకాపల్లి |
| 268. | రెడ్డి జగన్నాధం | స్వతంత్ర | చోడవరం |
| 269. | సి. వి. సోమయాజులు | సోషలిస్టు | శృంగవరపుకోట |
| 270. | జి. రామునాయుడు | ,, | శృంగవరపుకోట (రిజర్వుడు) |
| 271. | దొండా శ్రీరామమూర్తి | ,, | మాడుగుల |
| 272. | మజ్జి పైడయ్య నాయుడు | కృషిక్ లోక్ | కొండకర్ల |
| 273. | సి. వి. సూర్యనారాయణరాజు | స్వతంత్ర | ఎలమంచిలి |
| 274. | రాజా సాగి సూర్యనారాయణరాజు | కాంగ్రెసు | నరిసీపట్నం |
| 275. | ఎమ్. పోతురాజు | ,, | ,, |
| 276. | ఆర్. లచ్చపాత్రుడు | స్వతంత్ర | గోలుగొండ |
| 277. | ఎమ్. మాచరాజు | ,, | గూడెం |
| 278. | ఉప్పాడ రంగబాబు | కృషిక్ లోక్ | ఇచ్ఛాపురం శ్రీకాకుళంజిల్లా |
| 279. | గౌతు లచ్చన్న | ,, | సోంపేట |
| 280. | ఎన్. రాములు | ,, | బ్రాహ్మణతర్ల |
| 281. | రొక్కం లక్ష్మీనరసింహం దొర | కాంగ్రెసు | టెక్కలి |
| 282. | సిమ్మా జగన్నాధం | కృషిక్ లోక్ | నరసన్నపేట |

| సం. | పేరు | పార్టీ | నియోజకవర్గము |
| --- | --- | --- | --- |
| 283. | లుకలాపు లక్ష్మణదాసు | కాంగ్రెసు | పాతపట్నం |
| 284. | పి. గున్నయ్య | ,, | పాతపట్నం (రిజర్వుడు) |
| 285. | అడ్డాకుల లక్ష్మనాయుడు | స్వతంత్ర | నాగూరు |
| 286. | వి. చంద్రచూడామణీదేవ్ | ,, | పార్వతీపురం |
| 287. | ఏ. ఎరుకునాయుడు | సోషలిస్టు | సాలూరు |
| 288. | బోయిన రాజయ్య | కాంగ్రెసు | సాలూరు (రిజర్వుడు) |
| 289. | కోటగిరి సీతారామస్వామి | ,, | బొబ్బిలి |
| 290. | పెద్దింటి రామస్వామి నాయుడు | ,, | బలిజపేట |
| 291. | సి. శ్రీరంగనాయకులు | కృషిక్ లోక్ | ఉణుకూరు |
| 292. | పైడి నరసింహ అప్పారావు | స్వతంత్ర | పాలకొండ |
| 293. | తమ్మినేని పాపారావు | ,, | నగరి కటకమ్ |
| 294. | పి. సూర్యనారాయణ | ,, | శ్రీకాకుళం |
| 295. | చౌదరి సత్యనారాయణ | కృషిక్‌లోక్ | షేర్ మహమ్మద్‌పురం |
| 296. | ఎమ్. సత్యనారాయణరాజు | సోషలిస్టు | చీపురుపల్లి |
| 297. | కొత్తపల్లి పున్నయ్య | కృషిక్‌లోక్ | చీపురుపల్లి(రిజర్వుడు) |

ఈ శాసన సభ్యులలో ఆయాపార్టీలకు చెందిన సంఖ్యాబలం వివరాలు యివి : కాంగ్రెసు 197 ; పీపుల్సు డెమో క్రటిక్ ఫ్రంట్, కమ్యూనిస్టుపార్టీ 49 ; సోషలిస్టుపార్టీ 25 ; షెడ్యూల్డుకులాల ఫెడరేషన్ 5; స్వతంత్రులు 21 మంది.



# భారతదేశ నూతన వ్యవస్థ

## రాష్ట్రాలు


| క్రమ సంఖ్య | రాష్ట్రం | విస్తీర్ణం చ. మైళ్ళ | జనాభా లక్షలలో | రాజధాని | రాజధాని జనాభా | గవర్నరు | ముఖ్యమంత్రి |
|---|---|---|---|---|---|---|---|
| 1. | ఆంధ్ర ప్రదేశ్ | 1,10,250 | 322 | హైద్రాబాదు | 10.86 | శ్రీ సి. ఎం. త్రివేది | శ్రీ నీలం సంజీవరెడ్డి |
| 2. | అస్సాం | 84,924 | 90 | షిల్లాంగ్ | 0.54 | శ్రీ ఫజల్ అలీ | శ్రీ విష్ణురాం మెహదీ |
| 3. | బీహార్ | 67,830 | 389 | పాట్నా | 2.83 | శ్రీ ఆర్. ఆర్. దివాకర్ | డా. ఎస్. కె. సిన్హా |
| 4. | బొంబాయి | 1,88,240 | 478 | బొంబాయి | 28.40 | శ్రీ శ్రీ ప్రకాశ | శ్రీ వై. బి. చవన్ |
| 5. | కేరళ | 14,980 | 136 | త్రివేంద్రం | 1.87 | డా. బి. రామకృష్ణారావు | — |
| 6. | మధ్య ప్రదేశ్ | 1,71,200 | 261 | భోపాలు | 1.02 | డా. బి. పట్టాభి సీతారామయ్య | శ్రీ రవిశంకర శుక్లా |
| 7. | మద్రాసు | 50,170 | 300 | మద్రాసు | 14.20 | — | శ్రీ కె. కామరాజ్ |
| 8. | మైసూరు | 72,730 | 190 | బెంగుళూరు | 7 80 | మైసూరు మహారాజా | శ్రీ ఎస్. నిజలింగప్ప |
| 9. | ఒరిస్సా | 60,140 | 146 | భువనేశ్వర్ | — | శ్రీ భీమసేన్ సచార్ | డా. హరేకృష్ణ మెహతాబ్ |
| 10. | పంజాబు | 46,616 | 160 | చండీఘర్ | — | శ్రీ సి. పి. యన్. సింగ్ | శ్రీ ప్రతాప్ సింగ్ కైరాన్ |
| 11. | రాజస్తాన్ | 1,32,300 | 160 | జైపూరు | 2.91 | శ్రీ జి. యన్. సింగ్ | శ్రీ ఎం. ఎల్. సుఖాడియా |
| 12. | ఉత్తర ప్రదేశ్ | 1,13,410 | 652 | లక్నో | 5 | శ్రీ కె. యం. మున్షి | డా. సంపూర్ణానంద్ |
| 13. | పశ్చిమ బెంగాల్ | 33,279 | 262 | కలకత్తా | 45,8 | కుమారి పద్మజా నాయుడు | డా. బి. సి. రాయ్ |
| 14. | జమ్మూ, కాశ్మీర్ | 92,780 | 44 | శ్రీనగర్ | 1.1 | శ్రీ కరణ్ సింగ్ | శ్రీ బక్షీ గులాం మహమ్మద్ |

# కేంద్రపాలిత ప్రాంతాలు


| క్రమసంఖ్య | రాష్ట్రం | విస్తీర్ణం ч. మైళ్లు | జనాభా లక్షలలో | రాజధాని | రాజధాని జనాభా లక్షలలో |
|---|---|---|---|---|---|
| 1. | ఢిల్లీ | 578 | 17.4 | ఢిల్లీ | 13.8 |
| 2, | హిమాచల ప్రదేశ్ | 10,451 | 9.8 | సిమ్లా | 0.46 |
| 3. | మణిపూరు | 8,658 | 5.8 | ఇంఫాల్ | 1.3 |
| 4. | త్రిపుర | 4,032 | 6.1 | అగర్తల | 0.12 |
| 5. | లకదీవులు అమీన్‌దీవులు | 1,900 (సుమారు) | 0.2 | — | — |
| 6 | అండమాన్ నికోబార్ దీవులు | 3,215 | 0.3 | పోర్టుబ్లేర్ | — |

# ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం


| | |
|---|---|
| శ్రీ ఎన్. సంజీవరెడ్డి | జనరల్ అడ్మినిస్ట్రేషన్- పౌరసంబంధ, సమాచార శాఖతో సహా- ఎన్నికలు, గృహ వసతి కంట్రోలు, శాంతి భద్రతలు, అఖిల భారత సర్వీసులు, హోం, ప్లానింగు, రవాణా. |
| శ్రీ కె. వి. రంగారెడ్డి | రెవిన్యూ. |
| శ్రీ కళా వెంకటరావు | ఆర్థికశాఖ, అమ్మకం పన్నులు, భూ సంస్కరణలు. |
| శ్రీ జె. వి. నరసింగరావు | విద్యుచ్ఛక్తి, నీటిపారుదల. |
| శ్రీ డి. సంజీవయ్య | సహకారం, దేవాదాయాలు, సాంఘిక సంక్షేమం. |
| శ్రీ వి. బి. రాజు | పరిశ్రమలు, వాణిజ్యం, కార్మికశాఖ. |
| శ్రీ పి. తిమ్మారెడ్డి | వ్యవసాయం, అడవులతోసహా; పశుసంక్షేమం, మత్స్య సంపద, అధికాహారోత్పత్తి కార్యక్రమం. |
| శ్రీ ఎస్. బి. పి. పట్టాభిరామారావు | విద్య |
| నవాబ్ మెహదీ నవాజ్ జంగ్ బహదూర్ | ప్రజారోగ్యం. |
| శ్రీ గ్రంధి వెంకటరెడ్డి నాయుడు | శాసనశాఖ, కోర్టులు, జైళ్ళు. |
| శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి | స్థానిక పరిపాలన. |
| శ్రీ ఎం. నరసింగరావు | భవనాలు, రహదారులు, సుంకములు, మద్య నిషేధము. |




ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారు ప్రమాణ స్వీకారం చేస్తున్నారు.




ముఖ్యమంత్రి అధికారపత్రాలపై సంతకం చేస్తున్నారు.




రాష్ట్రమంత్రిగా నియమింపబడిన శ్రీ తొండా వెంకటరంగారెడ్డిగారు ప్రమాణ స్వీకారం చేస్తున్నారు.



రాష్ట్రమంత్రిగా నియమింపబడిన శ్రీ కళా వెంకటరావుగారు ప్రమాణ స్వీకారం చేస్తున్నారు.




రాష్ట్రమంత్రిగా నియమింపబడిన శ్రీ జె. వి. నర్సింగరావుగారు ప్రమాణ స్వీకారం చేస్తున్నారు.




రాష్ట్రమంత్రిగా నియమింపబడిన శ్రీ డి. సంజీవయ్యగారు ప్రమాణ స్వీకారం చేస్తున్నారు.



రాష్ట్రమంత్రిగా నియమింపబడిన శ్రీ వల్లూరి బసవరాజుగారు ప్రమాణ స్వీకారం చేస్తున్నారు.




రాష్ట్రమంత్రిగా నియమింపబడిన శ్రీ వి. తిమ్మారెడ్డిగారు ప్రమాణ స్వీకారం చేస్తున్నారు.




రాష్ట్రమంత్రిగా నియమింపబడిన శ్రీ యస్. బి. పి. పట్టాభిరామారావుగారు ప్రమాణ స్వీకారం చేస్తున్నారు.



రాష్ట్రమంత్రిగా నియమింపబడిన శ్రీ నవాబ్ మెహదీ నవాజ్ జంగ్ గారు ప్రమాణ స్వీకారం చేస్తున్నారు.




రాష్ట్రమంత్రిగా నియమింపబడిన శ్రీ గ్రంధి వెంకటరెడ్డి నాయుడుగారు ప్రమాణ స్వీకారం చేస్తున్నారు.



రాష్ట్రమంత్రిగా నియమింపబడిన శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి గారు ప్రమాణ స్వీకారం చేస్తున్నారు.



రాష్ట్ర మంత్రిగా నియమింపబడిన శ్రీ మందముల నర్సింగరావు గారు ప్రమాణ స్వీకారం చేస్తున్నారు.


మధ్య ప్రదేశ్
ఒరిస్సా
అదిలాబాద్
నిజామాబాద్
కరీంనగర్
మెదక్
వరంగల్
హైదరాబాదు
నల్గొండ
ఖమ్మం
తూర్పు గోదావరి
పడమటి గోదావరి
కృష్ణా
మహబూబ్‌నగర్
గుంటూరు
కర్నూలు
బంగాళా
నెల్లూరు
ఖాతము
అనంతపూర్
కడప
చిత్తూరు
ఆంధ్ర ప్రదేశ్
మద్రాసు

# దేశంతో పాటు మీరు కూడా అభ్యుదయం పొందండి!

## మీరు మిగుల్చుకున్న డబ్బును భారత ప్రభుత్వ చిన్న మొత్తముల పొదుపు పథకంలో పెట్టుబడి పెట్టండి!

భారత దేశము యొక్క
సామాజికాభివృద్ధి కార్యక్రమమునకు, గొప్పనదీలోయ ప్రాజెక్టులకు,
రైలుమార్గములు రోడ్ల అభివృద్ధికి సహాయపడండి!

*మీ డబ్బును ఈ క్రింది గ్యారంటీడ్ సెక్యూరిటీలలో దేనిలోనైనా పెట్టుబడి పెట్టండి!*

| | |
|---|---|
| 12 సంవత్సరముల నేషనల్ సేవింగ్సు సర్టిఫికెట్లు | మెచ్యూరిటీ పొందినమీదట నూటికి ఏడాదికి 4.16 వంతుల చొప్పున వడ్డీ లభిస్తుంది. రూ. 5 లవి మొదలు రూ. 5,000 ల వాటివరకు ఈ సర్టిఫికెట్లు లభించును. వ్యక్తిగతంగా రూ. 25,000 ల వరకు కొనవచ్చును. |
| 10 సంవత్సరముల ట్రెజరీ సేవింగ్సు డిపాజిట్ సర్టిఫికెట్లు | ప్రతియేటా నూటికి 3½ వంతుల చొప్పున వడ్డీ చెల్లించబడుతుంది. రూ. 100 లవి మొదలు రూ. 25,000 లవి వరకు లభిస్తాయి, వ్యక్తిగతంగా రూ, 25,000 ల వరకు కొనవచ్చును. |
| 10 సంవత్సరముల జాతీయ ప్రణాళిక సర్టిఫికెట్లు | మెచ్యూరిటీ పొందిన మీదట నూటికి ఏడాదికి 4½ వంతుల చొప్పున వడ్డీ చెల్లించబడుతుంది. 5 రూ. లవి, 10 రూ. లవి, 25 రూ. లవి, 50 రూ. లవి, 100 రూ. లవి, 500 రూ. లవి ఇవ్వబడును. వ్యక్తిగతంగా రూ. 25,000 ల వరకు కొనవచ్చును. |
| పోస్టాఫీసు సేవింగ్సు బ్యాంకు అకౌంట్లు | డిపాజిట్లపై రూ. 10,000 ల వరకు నూటికి 2 వంతుల చొప్పున వడ్డీ చేర్చబడుతుంది. శేషముపై రూ. 15,000 ల వరకు నూటికి 1½ వంతుల చొప్పున వడ్డీ చేర్చబడుతుంది. |
| 15 సంవత్సరముల ఆన్యూటీ సర్టిఫికెట్లు | నూటికి ఏడాదికి 3½ వంతుల చక్రవడ్డీతో నెలసరి కిస్తులుగా 15 ఏండ్ల లోపున తిరిగి చెల్లించబడుతాయి. జారీచేయబడు ధరలు : రూ. 3,500, రూ. 7,000, రూ. 14,000 రూ. 28,000 వ్యక్తిగతంగా రూ. 28,000 ల వరకు కొనవచ్చును. |

## *ఆదాయపు పన్ను లేకుండా మీకు మంచి ఆదాయం లభిస్తుంది!*

## *భారతదేశ ఉజ్జ్వల భవిష్యత్తుకొరకై పెట్టుబడి పెట్టండి!*

ఇతర వివరములకు, ఈ పెట్టుబళ్ళకు సంబంధించిన నియమావళికొరకు :

**నేషనల్ సేవింగ్సు కమీషనర్, సిమ్లా చిరునామాకుగాని లేక**
**రీజనల్ ఆఫీసరు, హైద్రాబాదు (దక్కన్)**

చిరునామాకుగాని వ్రాయవలెను.



నవంబరు 2 వ తేదీన ఢిల్లీకి బయలుదేరేముందు ప్రధానమంత్రి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శివద్ద సెలవుపుచ్చుకుంటున్నారు.

